83

సృజన

సెప్టెంబర్ 1978

ఆధునిక సాహిత్య వేదిక
మా స ప త్రి క

ఒరే ఒరే శత్రువూ నువ్వు
ఒక ముసి ముసి చీకటి వేకువ
ఉదయం కోసం పోరిన
చేతులను విరిచికట్టి
ఉదయం కోసం చూసిన
కన్నులపై ముసుగు కప్పి
ఉదయం కోసం పలికిన
కంఠానికి ఉరి బిగించి
మీట నొక్కి అటు తిరిగితే
మింటి నిండ నెత్తురు-
ఆ నెత్తుటి పొత్తిలిలో
కళ్ళు తెరచె నెవడో చూడు!

నిర్వహణ
'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా 15 రూపాయలు

ఈ సంచిక రు. 1-50 పైసలు

ఈ సంచికలో....

కవర్ కవిత : జనసం – కృష్ణన్ చెట్టి స్మృతికి

మానవతా విలువలు – II

వరంగల్ పాలిటెక్నిక్‌లో ఏంజరిగింది? వచ్చే సంచికలో

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu
Printed at Warangal Printing Press, J.P.N. Road, Warangal - 506 00
for Venkataramana Mudranalayam, Warangal
Working Editor: Varavararao

సృజన

ఆధునిక సాహిత్య వేదిక
మాస పత్రిక
83
సెప్టెంబర్ 1978

మట్టిని మాట్లాడించిన శక్తి

జన సముద్రపు లోతుల్లోంచి
రెపరెపలాడే ఎర్రజెండాల అలలపై
ఉవ్వెత్తున పైకెగసిన మావో కెరటం
అసంఖ్యాకమైన అగ్నికణాలను దాచుకొని
పరమాణు కీలల మానవబలంతో
థాయ్ పర్వతాగ్రాన్ని ముద్దుపెట్టుకొని
తిరిగి జన సముద్రంలోనే
లీనమై విలీనమై
ప్రజాహృదయ విహంగమై
తరతరాలకు తరగని ఆలోచనా విధానమై
మట్టినే మాట్లాడించే రైతాంగ శక్తిగా
కొండలనే కదలించే శ్రామిక దీప్తిగా
వర్గరహిత సమాజ స్వప్నాన్ని
మనిషిలో
చెదరకుండా నిలిపిన
మాసియాంగ్
మాసిపోని మనుగడలో నిరంతరం
కదిలే కదిలించే క్రాంతిచక్రం.

[సెప్టెంబర్ 9 మావో వర్ధంతి] — నిఖిల్

నిర్వహణ
'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా 15 రూపాయలు ఈ సంచిక రు. 1-50 పైసలు

కృష్ణన్ చెట్టి
'ఉరి తీయబడ్డ శిరస్సు చెప్పిన రహస్యం'

జూలై 26వ తేది పార్లమెంటులో ఒక ప్రముఖ సభ్యుడు ఉరిశిక్షపడిన తమిళనాడు రాజకీయ ఖైదీ కృష్ణన్‌చెట్టి ఉరిశిక్షను రద్దుచేయ నిరాకరించడంమీద ఒక ప్రకటన చేసాడు. జూలై 29వ తేది "మెయిన్ స్ట్రీమ్" వారపత్రిక "ఎవరు నేరస్తులు" అనే పేరుతో కృష్ణన్‌చెట్టి ఉరిశిక్షను రద్దుచేయవల్సిందిగా డిమాండ్ చేసింది. జూలై 30న కలకత్తా నగరంలో బందీ విముక్తి-ఓ-గణతంత్ర కమిటీ ఉరిశిక్షను రద్దు చేయవల్సిందిగా కోరుతూ ప్రదర్శన నిర్వహించింది. ఆగస్టు 3వ తేది ఢిల్లీ పియుసిల్ నాయకత్వాన పందమంది మేధావులు రాష్ట్రపతిని కలిసి ఉరిశిక్షను రద్దుచేయవల్సిందిగా కోరారు. ఆరోజున రాష్ట్రపతి అసలు ఒక పిటిషన్ తోసివేయబడిందని తనకు తెలియదని, విచారిస్తానని హామీ ఇచ్చాడు.

కాని ఆగస్టు ఐదవ తేదీ సాయంకాలం ఢిల్లీ పియుసిల్‌కి మద్రాసు నుండి వచ్చిన ఒక టెలిగ్రాం తెలియజేసింది.

> "కృష్ణన్‌చెట్టిని జూలై 25వ తేది ఉదయం కోయంబత్తూర్
> సెంట్రల్ జెయిల్‌లో ఉరితీసారు."

తమిళనాడు రైతాంగ నాయకుడిగా వర్ణించబడ్డ ఈ కృష్ణన్‌చెట్టి వయసు 30 సంవత్సరాలు. 1972లోనె అతనికి సెషన్స్‌కోర్టు మరణ శిక్షను విధించింది. ఐదేళ్ళపాటు కారాగారపు చీకటికొట్లలో గడిచిన జీవిత సాయంకాలం, ఒక ఉదయాన అస్తమించింది.

అస్తమించిన జీవితంమీద ఉదయించే ప్రశ్నలు వెన్నాడక మానవు. భూమయ్య కిష్టాగౌడ్‌ల మరణానికి ప్రతీకారం తీర్చుకుంటామన్న జార్జిఫెర్నాండెజ్ ఏ భూతలింగం కమిటీ నివేదికలో తన్ను తాను పోగొట్టుకున్నాడు? భూమయ్య కిష్టాగౌడ్‌ల గురించి ఇందిరా గాంధీని, మోలీనాధక్ గురించి జ్యోతిబసును ప్రశ్నించిన జె.పి, చంద్రశేఖర్, కృష్ణకాంత్ ఎందుకు మౌనం వహించారు? మొరార్జీ-చరణ్‌ల ఉత్తరాల్లో కూరుకపోయారా?

స్టాక్ హోం అంతర్జాతీయ సదస్సులో మరణశిక్ష రద్దుని కోరిన జనతా ప్రభుత్వం కోయంబత్తూరులో తన నిర్ణయాన్ని ఎలా అమలు పర్చింది?

న్యూఢిల్లీ నార్త్ బ్లాక్ హోం మంత్రిత్వ శాఖ కార్యాలయానికి ఎవరు నేరస్తులో ఎవరుకారో నిర్ణయించే రాజకీయాధికారాన్ని ఎవరిచ్చారు?

ఐక్యరాజ్య సమితి నిరాయుధీకరణ సదస్సులో భారతదేశం మరణాన్ని కాదు జీవితాన్ని కోరుకుంటుందని చెలరేగే హర్షధ్వానాలమధ్య ప్రకటించిన ప్రధాని మొరార్జీ దేశాయ్ హోంమంత్రిగా పిటిషన్ ను ఎలా తోసిపుచ్చాడు ?

నిర్ణయ మేమిటో తెలియకుండానే ఈ గణతంత్ర ప్రజాస్వామిక సామ్యవాద మతాతీత రిపబ్లిక్ అధ్యక్షుడు సంతకం ఎలా చేసాడు ?

తెరపై విలన్లను షూట్ చేసే నడింగడ తిలకం- విప్లవ హీరో ఎంజీఆర్ జీవితంలో హీరోల ప్రాణాలకి ఉరితాళ్ళు ఎలా బిగించాడు ?

కృష్ణన్ చెట్టి ఎవరిపల్ల మరణించాడు ?

ఈ దేశంలో విస్తరించే వార్తాపత్రికల విశాలమైన పేజీలు అధికారం బొమికల కోసం కాట్లాడుకునే నేటి నాయకుల అగచాట్లకీ, ఒక్క తుప్పరతో భారత దేశాన్ని "రక్షించే" కార్యక్రమాన్ని విరమించుకునే మాజీ నేతల ప్రహసనాలకీ, స్వేచ్ఛాస్వాతంత్ర్యాల గురించి రోజూ ప్రతిరోజూ వెలువడే ఉపన్యాసాలకి కేటాయించ బడ్డాయి- అక్కడ 'ఏటి కేతం పట్టి ఎయిపుట్లు పండించి కూటిలో మెతుకెరుగని' కోట్లాది రైతుల జీవితంతో పోరాటంతో కలిసి అల్లుకుపోయిన కృష్ణన్ చెట్టిలకు చోటులేదు- రోటరీ మిషిన్ల రొదనలో మరోసారి పౌరహక్కులు నిశ్శబ్దంగా అణిగిపోతాయి.

ఆగస్ట్ పదిహేనున ఢిల్లీ పియుసిల్ ధర్నాని పేపర్లు ప్రకటించవు- వస్తామని వాగ్దానం చేసిన అరడజను మంది పార్లమెంటు సభ్యులు వ్యక్తిగత రాజకీయ కక్షల చర్చల దుమారంలో మునిగిపోయుంటారు- (పాపాలకి మారుపేరు పార్లమెంటు అసలుపేరు) సంపాదకీయాలు రాస్తానన్న ఎమర్జెన్సీ హీరో కులదీప్ నయ్యార్ కనిపించడు- వినిపించడు. అరుణ్ షౌరీ, చాంద్ జోషీ, తార్కుండే, విష్ణుదత్ ఇందిరా ఫాసిజాన్నే తప్ప జనతా ఫాసిజాన్ని ప్రశ్నించరా ?

బుల్ డోజర్ చక్రాలకింద బుల్లెట్ల వర్షంలో వందలాది ప్రజల్ని చంపిన వాళ్ళు ఈ దేశం ఏ కోర్టులోనూ నేరస్తులు కారు- అయినా వాళ్ళకోసం బెయిల్స్, యాంటిసిపేటరీ బెయిల్స్ ఉంటాయి- కక్కాయం ట్రావెలర్స్ బంగళాలో, గిరాయిపల్లి అడవుల్లో హత్య చేయబడ్డ వాళ్ళ నేరస్తులకి ఉరిశిక్ష వెయ్యమని ఏ కోర్టుని యమునా నదిబడ్డు మేధావులు వచ్చి అడగరు- అక్కడ కేసు ఉండదు, విచారణ ఉండదు- శిక్షలేదు, ఉరిశిక్షలేదు.

కాని కృష్ణన్ చెట్టి ఉరితీయబడతాడు.

కాలం, ఎమర్జెన్సీ చీకటి రోజులకి జనతా ప్రభుత్వ 'వెలుగు' రోజులకి మధ్య గీతల్ని చెరిపివేస్తుంది.

ఇందిరా - వెంగళరావు ముషీరాబాదు జెయిలు వ్యవస్థకు, మొరార్జీ - ఎంజీఆర్ కోయంబత్తూరు జెయిలు వ్యవస్థకు పెనవేసుకున్న హంతక స్వభావ అనుబంధానికి అద్దం పడుతుంది కాలం.

ఉరితాళ్ళ, చెరసాలల ఊడలనీడన ఊపిర్ల స్పందనను రికార్డుచేస్తుంది కాలం.

కవి భాషలో కృష్ణన్‌చెట్టి "సమాజానికి కాలంపెట్టిన అప్పుని తన ప్రాణాలతో తీర్చుకున్నాడు."

ఇవ్వాళ కృష్ణన్‌చెట్టి, నిన్న భూమయ్య కిష్టాగౌడ్, మొన్న కయ్యూరు కామ్రేడ్స్, ఆమొన్న భగత్‌సింగ్‌లను ఉరితీసిన వ్యవస్థ సూక్ష్మరూపం ఒక్కటే.

ఆ వ్యవస్థను రద్దుచేసి ఆ మృతవీరుల ఆశయాలకు ఊపిరిపోస్తుంది రేపటి ఉదయం.

29-8-78 — సురా

వర్షించే పూల పర్వతం

వీరులు తమ రక్తం చిందించిన వర్షించే పూల పర్వతం*
దేశద్రోహులు తప్పుదోవన నడుస్తున్న తెలివితక్కువ వారని నిరూపిస్తుంది.
ప్రజానీకం తుదకు తప్పకుండా విజయం సాధిస్తుంది
చరిత్ర వర్గపోరాట సూత్రాలను నిర్ణయిస్తుంది
చిత్రపటాలు, మెమెంటోలు మాకు వారి శక్తిని తెలుపుతాయి
ఈ ధైర్యస్థులయిన కామ్రేడ్లు ఎప్పుడూ జ్ఞాపకం ఉంచుకోబడుతారు
ఎర్రజెండాను సమున్నతంగా ఎగరేస్తూ, విజయోత్సాహంతో నమ్మకంతో
వాళ్ళరక్తం చిందిన వైపుకు అడుగేస్తూ మేము ముందుకు సాగిపోతాం.

[మూలం: టుంగ్ పి-వు (వర్షించే పూలపర్వతం వద్దనున్న మ్యూజియం సందర్శించినప్పుడు 18-4-1964) అనువాదం: మణి]

---

* వర్షించే పూలపర్వతం నాన్‌కింగ్ దక్షిణప్రాంతంలో వుంది. పూర్వం కొమింటాంగ్ అభివృద్ధి నిరోధకులు విప్లవకారులను ఇక్కడ చంపివేశారు. ఈ ప్రదేశంలో ఒక విప్లవ మ్యూజియం నిర్మించారు.

నా పాత యిల్లు

లూసున్

ఇరవై సంవత్సరాల క్రితం విడిచిపోయిన నా పాత యింటికి వస్తున్నాను. ఏడు వందల మైళ్ళకు పైగా ప్రయాణంచేసి, తీవ్రమైన చలిని అధిగమిస్తూ.

అవి చలికాలపు చివరి రోజులు. నేను ఇంటిని సమీపిస్తున్నప్పటికి ఆకాశం మేఘావృతమైంది. మా పడవ కేబిన్‌లోకి చల్లటి గాలి వీస్తోంది. పడవ వెదురు గూడు సందుల్లోంచి పసుపుపచ్చని మసక ఆకాశం కింద అక్కడక్కడా నిర్జనంగా, నిర్జీవంగా ఉన్న గ్రామాలు తప్ప చూడడాని కింకేమీ మిగిలిలేవు. నేను కృంగి పోయాను.

నిజంగా యిరవయ్యేళ్ళగా నాకు గుర్తున్న ఆ పాత యిల్లు కాదిది. అది యిట్లా ఎంతమాత్రమూ లేదు. ఇంతకన్నా ఎంతో బాగుండేది. కాని దాని వింత ఆకర్షణను గూర్చి చెప్పమంటే యిప్పుడు నా మనసులో స్పష్టమైన ముద్ర లేదు. వర్ణించే మాటలూ లేవు. ఇక యిప్పుడు నాకనిపించే దేమంటే యిప్పుడున్నదేదో ఉన్నది. అంతే.

నేను మళ్ళీ సహేతుకంగా ఆలోచించాను. ఇల్లు ఎప్పుడూ యిలాగే ఉండేది. అది మెరుగుపడలేదు కాని నేను ఊహించినట్టు కృంగిపోయేంతగా ఏమీ మారలేదు. మారింది నా మనస్థితి మాత్రమే. ఈసారి నేను గ్రామానికి ఏ భ్రమలతోనూ తిరిగి రాలేదు.

ఈసారి నేను మా యింటిని శాశ్వతంగా విడిచివెళ్ళే ఒకే ఒక ఉద్దేశంతో వచ్చాను. ఎన్నోఏళ్ళగా మా వంశీకులు నివసించిన యీ పాత యిల్లు మరో కుటుంబం వారికి అమ్మేయడం యిదివరకే జరిగిపోయింది. ఇక సంవత్సరాంతంలోగా చేతులు మారాల్సి ఉంది. మాకెంతో చనువైన మా పాత యింటిని ఎప్పటికోసమూ వదిలేసి మా ప్రాంతానికి బహుదూరంగా నేను పనిచేసే చోటుకి నా కుటుంబాన్ని కొత్త సంవత్సరంలోగా తరలించాలి.

మరునాటి తెల్లవారుజామున నేను మా యింటి గేటుముందుకి చేరుకున్నాను. ఇంటి కప్పుపై విరిగిన ఎండుగడ్డి కాడలు గాలిలో ఊగుతూ యీ పాత యిల్లు చేతులు ఎందుకు మారిందో కారణం తెలుపుతున్నాయి. మా వంశానికి చెందిన అనేక శాఖల వారు బహుశా యిదివరకే యీ ప్రాంతాన్ని వదిలివెళ్ళారు. అందుకే ఎప్పుడూ లేని విధంగా అక్కడ అంతా నిశ్శబ్దంగా ఉంది. అలా నేను యింటికి చేరుకునేప్పటికి

మా అమ్మ నన్ను ఆహ్వానించటానికి గుమ్మంలోకి వచ్చింది. ఆమె వెనకాలే తొమ్మిదేళ్ళ నా మేనల్లుడు హంగ్-ఎర్ పరుగెత్తుకొచ్చాడు.

అమ్మ సంతోషపడినప్పటికీ ఏదో బాధను దాచే ప్రయత్నం కూడా చేస్తూ ఉంది. నన్ను విశ్రాంతిగా కూర్చుని టీ తాగమంది. అక్కడి నుండి వెళ్ళిపోయే విషయాన్ని ప్రస్తావించకుండా. అంతకు పూర్వమెన్నడూ నన్ను చూడని హంగ్-ఎర్ కొంత దూరంలో నుంచుని నావైపు చూస్తున్నాడు.

చివరికి మేము వెళ్ళడం గురించి మాట్లాడుకున్నాం. కొత్తగా వెళ్తున్న స్థలంలో గదులు అద్దెకు తీసుకోవడం, కొంత ఫర్నీచర్ కూడా కొనడం జరిగింది దానికి తోడు యింకా వస్తువులు కొనడానికి యిక్కడి యింట్లో ఫర్నీచర్ అమ్మాల్సి వస్తుందనీ అన్నాను. అమ్మ ఒప్పుకుంది. ప్రయాణపు సామానంతా కట్టి సిద్ధంగా ఉంది. సులభంగా తరలించలేని ఫర్నీచర్‌లో సగం ఇదివరకే అమ్మేయడం జరిగింది. ఇక కొన్ని వాళ్ళ దగ్గర డబ్బు రాబట్టడమే కష్టంగా ఉందని చెప్పింది అమ్మ.

"నీవు ఒకటి రెండు రోజులు విశ్రాంతిగా యిక్కడే ఉండి బంధువులందర్నీ చూసిరావాలి. ఆ తరవాత మనం వెళ్ళొచ్చు." అంది అమ్మ.

"అలాగే"

"ఆc జున్-టు ఉన్నాడు చూశావూ. అతడిక్కడికి వచ్చినప్పుడెల్లా నిన్ను గురించి అడుగుతాడు. నిన్ను చూడాలని బాగా కుతూహలపడుతున్నాడు. నీవు సుమారుగా ఏ తేదీకి యింటికి తిరిగి వస్తున్నదీ అతనికి చెప్పాను. బహుశా అతను యిక్కడికి వస్తాడు.

అమ్మ అలా అనగానే నా మనస్సులో ఏనాటిదో ఒక వింత దృశ్యం మెరిసింది. వినీల ఆకాశంలో బంగారు రంగు చంద్రుడు. కింద సముద్ర తీరాన కనుచూపుమేర ముదురు ఆకుపచ్చని పుచ్చ చెట్లు. చెట్ల మధ్య పదకొండు పన్నెండేళ్ళ కుర్రవాడు. మెడలో చిన్న వెండి గొలుసు. చేతిలో స్టీలు పంగటియీటెతో తన బలంకొద్దీ 'జా'ను పొడిచాడు. కాని అది దెబ్బను తప్పించుకొని అతని కాళ్ళ సందుల్లోంచి పారిపోయింది.

ఈ కుర్రవాడే జున్-టు. ముప్పయ్యేళ్ళ క్రితం నేను మొదటిసారిగా కలుసుకున్నప్పుడు అతనికి పదేళ్ళుదాటినై. అప్పటికి మా నాన్న బతికున్నాడు. మా పరిస్థితి బాగానే ఉండింది. అందుకే కుర్రవాడిగా నేను చెడిపొయ్యాను. ఆ సంవత్సరం పితృదేవతలకు తర్పణలు పెట్టే కర్మ జరపడం మా కుటుంబం వారి వంతు. అది 30

ఏళ్ళకి ఒక మారు వచ్చేది కాబట్టి చాలా ముఖ్యమైంది. మొదటి మాసంలో పూర్వీకుల విగ్రహాలూ, నైవేద్యమూ సమర్పించే వారు. హోమ పాత్రిలు బాగా నాణ్యమైనవి. అక్కడ పూజలు చేసే వారి గుంపు ఎంతగా వుండేదంటే అవి దొంగిలింపబడకుండా కాపలా కాయడం చాలా అవసరమయ్యేది. మా కుటుంబానికి అప్పుడప్పుడు వచ్చి పనిచేసి పోయే ఒక నౌకరుండేవాడు. అప్పుడు పనుల వత్తిడి బాగా ఉంది కాబట్టి హోమ పాత్రిల్ని కాపలా కాసేందుకు తన కొడుకు జున్-టుని పంపిస్తానని అతడు మా నాన్నగారితో చెప్పాడు.

అందుకు మా నాన్న అంగీకారం తెలిపినప్పుడు నేనెంతో సంతోషించాను. ఎందుకంటే జున్-టు గురించి విని చాలా కాలమైంది. అతనిది సుమారు నా వయస్సేననీ, అధికమాసంలో* పుట్టాడనీ నాకు తెలుసు. అతని జాతకంలో పంచభూతాల్లో భూమి లేదు. అందుకే వాళ్ళ నాన్న అతన్ని జున్-టు అన్నాడు. (జున్-టు అంటే నడుమ చేర్చబడిన భూమి). జున్-టు వలలు పన్ని చిన్న పక్షుల్ని పట్టగలడు.

కొత్త సంవత్సరపు రాకకోసం రోజూ ఎదిరిచూస్తున్నాను. ఎందుకంటే కొత్త సంవత్సరం జున్-టుని తీసుకొస్తుంది. పాత సంవత్సరం గతించిపోయింది. ఒకనాడు జున్-టు వచ్చాడని మా అమ్మ చెప్పగానే నేను అతన్ని చూడటానికి పరుగెత్తాను. అతడు వంటింట్లో నుంచుని ఉన్నాడు. ఎర్రటి గుండ్రని ముఖం. తలపై చిన్న ఫెల్ట్ కేప్. మెడలో మెరుస్తున్న చిన్న వెండి గొలుసు. వాళ్ళ నాన్న అత్యంత ప్రేమతో వేయించింది. తన కొడుకు చనిపోతాడేమోననే భయంతో దేవతలమీద, బౌద్ధులమీద ప్రమాణంతో దానిని ఒక తాయెత్తుగా అతని మెడలో వేయించాడు. జున్-టు చాలా బిడియస్తుడు. నా ఒక్కడి దగ్గర అతనికి జంకుగొంకు లేకుండేది. ఎవరూ లేనప్పుడు అతడు నాతో మాట్లాడేవాడు. కొన్ని గంటల్లోనే మేమిద్దరం మంచి మిత్రులమైపోయాం.

అప్పుడు మేము దేన్ని గురించి మాట్లాడుకునేవాళ్ళమో నాకు తెలియదు. తాను బస్తీకి వచ్చినప్పటి నుండీ ఎన్నో కొత్త విషయాలు చూశానని చెప్పుతూ జున్-టు ఎంతో హుషారుగా ఉండటం నాకు జ్ఞాపకముంది.

---

* చంద్రుని గమనం ఆధారంగా ఉన్న చైనీయుల కేలెండర్‌లో సంవత్సరానికి 360 రోజులు. ప్రతి నెలకి 29 లేక 30 రోజులే ఉంటాయి. 31 రోజు ఎన్నడూ ఉండవు. కాబట్టి కొన్ని సంవత్సరాల కొకపర్యాయం కేలండరులో 13వ మాసం (అధికమాసం) చేరుస్తారు.

మరునాడు పిట్టల్ని పట్టుకు రమ్మని అతన్ని అడిగాను— "అది సాధ్యం కాదు—దట్టంగా మంచుకురిసిన తరువాతనే అది వీలవుతుంది— మంచు కురిశాక మన యిసకల్లో కొంత నేలను ఊడ్చి, శుభ్రంచేసి పెద్ద దంపుడు బుట్టను ఒక చిన్న కర్ర ఆధారంగా నిలబెడతాను— దానికింద ధాన్యం పొట్టుని చల్లి పిట్టలు ఏరుకు తినటానికి వచ్చినప్పుడు కర్రకు కట్టిన దారాన్ని లాగుతాను— పిట్టలు బుట్టలో చిక్కిపోతాయి— అన్ని రకాల పిట్టలూ, నెమళ్ళు, అడవి కోళ్ళు, అడవి పావురాలూ, నల్లవీపు పిట్టలూ...."

అతడన్నట్లుగానే నేను మంచు కురిసే రోజుకోసం చాలా ఆతురతగా ఎదిరిచూశాను—

"ఇప్పుడు చాలా చలిగా వుంది" అన్నాడు జున్‌-టు, "కాని వేసవిలో నీవు మా వూరికి తప్పక రావాలి. పగటి పూట మనం సముద్రతీరాన కవిచిప్పల కోసం పోదాం— అక్కడ ఆకుపచ్చవీ, ఎర్రవీ అంతేకాదు 'పెరఘాతం' కవిచిప్పలూ, 'బుద్ధుని హస్తాలూ' దొరుకుతాయి— సాయంత్రం నేనూ మా నాన్నా పుచ్చ చెట్లను చూడ్డానికి పోయినప్పుడు నీవు కూడా తప్పక రావాలి."

"దొంగల్ని కనిపెట్టటానికా?"

"కాదు— దారినపోయే వారు దాహమేసి ఒకటో, అరో పుచ్చకాయ తీసుకున్నా, యిక్కడి జనం దాన్ని దొంగతనం అనుకోరు— మనం కాచుకొని ఉండవలసింది నీటి కుక్కలు, ముండ్ల పందులు మరియు 'జా' కోసం— జా పుచ్చకాయని కొరికే కరకర శబ్దం వినగానే నీవు నీ పంగల యీటె తీసుకొని నిశ్శబ్దంగా పాకుతూ దానిమీదికి ఉరకాలి."

అప్పుడు నాకు యీ 'జా' అనేదేమిటో తెలియదు— నిజానికి అదేమిటో యిప్పటికీ నాకు అంత స్పష్టంగా తెలియదు— కాని నేను అర్థంచేసుకున్న దేమిటంటే అది చిన్న కుక్కలాంటి జంతువు— చాలా భయంకరమైంది.

"అవి మనుషుల్ని కరవ్వా?" అడిగాను.

"నీ దగ్గర పంగల యీటె ఉంటుంది— నీవు అడ్డంగా వెళ్ళు— అది కనిపించగానే దెబ్బతియ్యి— అది భలే జిత్తులమారి— నీవైపే పరుగెత్తుకొని వచ్చి కాళ్ళ సందుల్లోనుంచి పారిపోతుంది— దానిది నూనెలాంటి జారుడు చర్మం."

ఇలాంటి వింత సంగతు లుంటాయని నా కదివరకెన్నడూ తెలియదు— సముద్రతీరాన ఇంద్రధనుస్సులోని అన్ని రంగుల కవిచిప్పలున్నాయి—

సముద్రతీరం మీదికి ప్రవాహం వచ్చినప్పుడు తమకప్పలాంటి రెండు కళ్ళతో ఎన్నెన్నో ఎగిరే చేపలు.... జున్-టు మేధస్సు యిలాంటి ఎన్నో వింతల విజ్ఞాన భాండాగారం. మునుపటి నా స్నేహితులెవ్వరికీ యీ విషయాలేవీ తెలియవు. జున్-టు సముద్రం పక్కన జీవించగా వీళ్ళంతా నాలాగే తమ యిళ్ళ ఆవరణల ఎత్తైన గోడలపై ఆకాశాన్ని మాత్రమే చూడగలిగేవారు.

కొత్త సంవత్సరం నెల రోజుల తరవాత దురదృష్ట వశాత్తు జున్-టు తన యింటికి వెళ్ళాల్సి వచ్చింది. నేను భోరున ఏడ్చేశాను. జున్-టు వంట గదిలో దాక్కుని ఏడుస్తూ చివరికి తన తండ్రి వచ్చి లాక్కెళ్ళేవరకూ బయటికి రాలేదు. తరువాత అతడు వాళ్ళ నాన్నతో ఒక పాకెట్ కపి చిప్పలూ, కొన్ని అందమైన పక్షి యీకలూ పంపించాడు. నేనతనికి రెండు తడవలు బహుమతులు పంపించాను. అంతే. మళ్ళీ మేమిద్దరం ఎన్నడూ ఒకరినొకరం కలుసుకోలేదు.

ఇప్పుడు మా అమ్మ జున్-టు పేరు ప్రస్తావించేసరికి బాల్యకాలపు యీ స్మృతి నాలో మెరుపులా సజీవంగా మేల్కొంది. అందమైన నా పాత యింటిని చూసినట్లని పించింది. అందుకే-

"బాగుంది. అతడు ఎలా ఉన్నాడేమిటి?" అన్నాను.

"అతడా? అతని పరిస్థితి ఏమాత్రం బాగులేదు." అంది అమ్మ గుమ్మం బయటికి చూస్తూ "అదిగో ఆ మనుషులు మళ్ళీ వస్తున్నారు. వాళ్ళు మన ఫర్నీచర్ కొంటామంటున్నారు. కాని నిజానికి యిక్కడి నుండి ఏమైనా ఎత్తుకుపోయేందుకు వీలవుతుందేమో చూడటానికే వస్తున్నారు. నేను వెళ్ళి వాళ్ళని కనిపెట్టుకొని ఉండాలి."

అమ్మ బయటికి వెళ్ళిపోయింది. బయటి నుండి చాలా మంది ఆడవాళ్ళ గొంతులు వినిపిస్తున్నాయి. నేను హంగ్-ఎర్‌ను పిలిచి అతనితో సంభాషణ ఉపక్రమించాను. అక్కడి నుండి వెళ్ళిపోవడం తనకి సంతోషమేనా అని అడిగాను.

"మనం ట్రెయిన్‌లో వెళ్ళతామా?"

"అవును ట్రెయిన్‌లోనే వెళ్ళతాము."

"మరి పడవలోనో?"

"మొదట మనం పడవలో ప్రయాణం చేసి, తరువాత ట్రెయిన్‌కి వెళ్ళతాం."

"ఓహో? ఇలా ఉన్నావా ఇంత పెద్ద మీసంతో?" హఠాత్తుగా ఓ కీచుగొంతు పలికింది. నేను ఉలిక్కిపడి పైకి చూశా. ఎత్తైన చెక్కిలి ఎముకలు, సన్నని పెదా

లతో సుమారు యాభై ఏళ్ళ స్త్రీ- పంట్లాం తొడుక్కున్న కాళ్ళు ఎడంగా పెట్టి పిరుదులమీద చేతులతో రేఖాగణితపుపెట్టెలో వృత్తలేఖినిలా నా ముందు నిలబడింది.

నేను విస్మయం చెందాను-

"నీవు నన్ను ఎరుగవా? నేను నిన్ను నా చేతుల్లో ఎత్తుకున్నాను-"

నేనింకా ఆశ్చర్యపడ్డాను- అదృష్టవశాత్తు అప్పుడే మా అమ్మ అక్కడికి వచ్చి యిలా అంది- "అతను యింత కాలం దూరప్రాంతాల్లో ఉన్నాడు- మిమ్మల్ని మరచి పోయినందులకి అతణ్ణి క్షమించాలి- మీకే జ్ఞాపకముండాలి-" "ఈమె పేరు శ్రీమతి యాంగ్- రోడ్డుకి అవతలివైపు ఉంటుంది- ఆమెకి చిక్కుడు పెరుగు దుకాణం ఉంది" నాతో అంది అమ్మ.

అప్పుడు నేను గుర్తు తెచ్చుకున్నాను- నేను కుర్రవాడిగా ఉన్నప్పుడు ఒక శ్రీమతి యాంగ్ ఉండేది- ఆమె దాదాపు దినమంతా రోడ్డుకి అవతల తన చిక్కుడు పెరుగు కొట్టులో కూర్చునేది- ప్రతివాడూ ఆమెను 'చిక్కుడు పెరుగు చక్కదనం' అని పిలిచేవాడు- ఆమె పౌడర్ వేసుకునేది- అప్పుడామె చెక్కిలి ఎముకలు అంత ఎత్తుగా లేవు- పెదవులు కూడా యింత సన్నగా ఉండేవి కావు- పైగా ఆమె అస్త మానం కొట్టులో కూర్చుండి ఉండటం మూలాన యిలా వృత్తలేఖినిని పోలి వున్న సంగతి నేనెన్నడూ గమనించనేలేదు- ఆరోజుల్లో అందరూ అనుకునేవారు, చిక్కుడు పెరుగు వ్యాపారం బాగా సాగేదని- అప్పటి నా చిన్న వయసు కారణమేమో ఆమె నాపై ఏవిధమైన ముద్రా వేయలేదు- అందుకే తరువాత తరువాత నేను ఆమెను పూర్తిగా మరచిపోయాను- ఏమైతేనేం 'వృత్తలేఖిని' తీవ్రమైన కోపంలో ఉంది- నెపోలియన్‌ను గురించి వినని ఫ్రెంచి వాణ్ణి, వాషింగ్టన్ గురించి తెలియని అమెరికా వాణ్ణి చూసినట్లు నావైపు అత్యంత తిరస్కార భావంతో చూసి వ్యంగ్యంగా చిరునవ్వునవ్వుతూ యిలా అన్నది.

"నీవు మరచిపోయావా? సహజమే- నేను నీ దృష్టికి తక్కువ స్థాయిలో ఉన్నాను...."

"ఎంతమాత్రమూ కాదు- నేను...." అధైర్యంగా సమాధానమిస్తూ నిలబడ్డాను.

"అయితే మాస్టర్ సన్‌గారూ వినండి- మీరు సంపన్నులైపోయారు- బహుశా యీ పాత ఫర్నీచర్ ముక్కలు మీకవసరముండవు- పైగా అవి చాలా బరువు- తీసుకెళ్ళడం కూడ కష్టం- నా కిచ్చేయండి- మాలాంటి పేదోళ్ళం వాటితో పని వెళ్ళదీసుకుంటాం."

"నేను ధనవంతుణ్ణి కాలేదు- వేరే కొనాలంటే వీటిని అమ్మక తప్పదు."

"ఒక కార్యాలయానికి మీరిప్పుడు పర్యవేక్షణాధికారి- అయినా మీరు ధనవంతులు కారని ఎలా చెప్పగలుగుతారు? ఇప్పుడు మీకు ముగ్గురు ఉంపుడు కత్తెలున్నారు- ఎక్కడికి వెళ్ళినా ఎనమండుగురు మోసే పల్లకీ కుర్చీలో వెళ్ళుతారు- అయినా మీరు సంపన్నులు కారనే అంటారా? అబ్బ! యిక మీరు నా నుండి ఏదీ దాచలేరు-"

నేను చెప్పగలిగిం దేమీ లేదని తెలుసుకుని మౌనంగా ఉండిపోయాను.

"ఇలా చూడండి, మనుషులు నిజంగా ఎక్కువ డబ్బు ఉన్నకొద్దీ ఎక్కువ పిసినార్లుగా మారుతారు- పిసినారితనం ఎక్కువైనకొద్దీ ఎక్కువ డబ్బు సంపాదిస్తారు" అంటూ 'వృత్తలేఖిని' కోపంగా వెనుతిరిగి అక్కడి నుండి మెల్లగా వెళ్ళిపోయింది- పోతూపోతూ మా అమ్మగారి చేతిమేజోళ్ళు తన జేబులో దోపుకొని పోయింది.

దీని తరువాత యిరుగు పొరుగు బంధువులు చాలామంది వచ్చి చూసిపోయారు- వీళ్ళందరినీ పలకరిస్తూ, సత్కరిస్తూ మధ్య మధ్య సమయం దొరికినప్పుడెల్లా సామాన్లని సర్దికట్టుకున్నాను- ఈ విధంగా మూడు నాలుగు రోజులు గడిచిపోయినయ్.

బాగా చలిగా ఉన్న ఒక మధ్యాహ్నం భోంచేసి టీ తాగుతూ కూర్చున్నాను- ఇంతలో ఎవరో లోపలికి వస్తున్నట్టు గమనించి అటు తిరిగి చూశాను- చూడగానే మొదట నేను ఉలికిపడి లేచి తొందరగా అతన్ని ఆహ్వానించడానికి వెళ్ళాను.

వచ్చినవాడు జున్-టు. చూడగానే అతడు జున్-టు అని తెలుసుకున్నప్పటికీ నాకు జ్ఞాపకమున్న జున్-టు మాత్రం కాడితడు. ఆకారంలో పూర్వంకన్నా రెండింతలు పెరిగాడు- ఒకప్పటి ఎర్రటి గుండ్రని ముఖం పచ్చగా పాలిపోయి బాగాముడతలు ఏర్పడ్డాయి- అతని కళ్ళు అతని తండ్రిలాగే ఎరుపెక్కి చుట్టూ వాచి ఉన్నాయి- సముద్రతీరాన పనిచేసే రైతుల కళ్ళు దినమంతా సముద్రపు గాలి తగలడం మూలాన సాధారణంగా యిలాగే వుంటాయి. అతడు చిరిగిపోయిన ఫెల్ట్‌కేప్ సన్నగా దూది నింపి కుట్టిన చొక్కా తొడుక్కుని ఆపాదమస్తకం వణికిపోతున్నాడు- చేతిలో ఒక కాగితపు పొట్లం, ఓ పొడుగాటి పొగతాగే గొట్టం- అతని చేయి నాకు జ్ఞాపకమున్నప్పటిలాగా పుష్టిగా, ఎర్రగాలేదు- మోటుగా, పగుళ్ళుబారి దేవదారుచెట్టు బెరడులాగా వికారంగా వుంది.

నేను చాలా సంతోషపడిపోయాను- ఏం మాట్లాడాలో తెలియక అతనితో యింతమాత్రం అనగలిగాను-

"ఓహో జున్-టు నీవా ?....."

తరువాత అతనితో చాలా విషయాలు మాట్లాడాలనుకున్నాను- అవి దారంలోని పూసలు కుమ్మరించినట్లు బయటికి రావాల్సింది- అడవి కోళ్ళు, ఎగిరే చేపలు, కవి చిప్పలు, జా ఎన్నెన్నో.... కాని నా నాలుక కొట్టివేసినట్టుగా నా ఆలోచనల్ని మాట ల్లోకి మార్చలేకపోయాను.

అతడు అక్కడ నిలబడ్డాడు- అతని ముఖంలో సంతోషం విచారం కలగలిసి ఉన్నాయి- పెదాలు కదిలినాయ్- కాని ఒక్కమాటా ఉచ్చరించ లేకపోయాడు- చివరికి నా యెడ ఒక గౌరవభావాన్ని తెచ్చిపెట్టుకొని చాలా స్పష్టంగా యిలా అన్నాడు-

"దొరా !"

నేను నాలో మొత్తంగా కంపించిపోయాను- ఎందుకంటే మా యిద్దరిమధ్య ఎంత దుఃఖకరమైన పెద్ద అడ్డుగోడ పెరిగిందో అప్పుడు నాకు అర్థమైంది- నేనేమీ అనలేకపోయాను.

అతడు వెనక్కు తిరిగి "షుయీ-షెంగ్, దొరగారికి దండంపెట్టు" అంటూ తన వెనక దాక్కున్న ఒక కుర్రవాణ్ణి ముందుకి తోశాడు- కుర్రవాడు సరిగ్గా యిరవ య్యేళ్ళక్రితపు జున్-టులాగే ఉన్నాడు- కాని అతనికన్నా కొంచెం సన్నగా పాలిపోయి. అతనికి మెడలో వెండిగొలుసు లేదు- "వీడు మా ఐదోవాడు- ఎన్నడూ మందిలో తిరగలేదు- అందుకే సిగ్గు, తత్తరపాటు."

బహుశా అమ్మ మా మాటలు విన్నదేమో హంగ్-ఎర్‌తో మిద్దె దిగివచ్చింది.

"మీ ఉత్తరం కొన్నాళ్ళ క్రితమే ముట్టిందమ్మగారూ ! దొర తిరిగి వస్తున్నా రంటే నిజంగా నాకెంతో సంతోషమైంది" అన్నాడు జున్-టు.

"ఎందుకంత మర్యాద ? మీరిద్దరూ కలిసి ఆడుకున్న నేస్తులుకారా ? మునుపటి లాగే యిప్పుడుకూడా సన్ సోదరుడనే పిలువు" అన్నది అమ్మ ఉల్లాసంగా-

"అబ్బో ! అలాగైతే ఎంత అమర్యాద ! మీరు నిజంగా గొప్పోళ్ళు- అప్పుడు నేను కుర్రవాణ్ణి- అప్పుడు నేనేమీ అర్థంచేసుకోలేదు" అంటూ జున్-టు షుయీ-షెంగ్‌ను కదిలించాడు- అతడు ముందుకు వచ్చి వంగి దండం పెట్టాలని- కాని కుర్రవాడు బిడియస్తుడు- తండ్రి వెనక కదలకుండా నిలుచున్నాడు. "అయితే యితడు షుయీ-షెంగ్ నీ ఐదో కొడుకా ?" అడిగింది అమ్మ- "మేమంతా కొత్తవాళ్ళం-

అలా బిడియ పడుతున్నందుకే అతడ్ని అనాల్సిందేమీ లేదు. హంగ్-ఎర్ ఇతన్ని బయట ఆడుకోడానికి తీసుకెళ్ళితే బాగుంటుంది."

హంగ్-ఎర్ యిది వినగానే షుయీ-షెంగ్ దగ్గరికి వెళ్ళాడు- షుయీ-షెంగ్ ఏ యిబ్బంది లేకుండానే హంగ్-ఎర్‌తో కలిసి బయటికి వెళ్ళాడు- అమ్మ జున్-టుని కూర్చోమంది- కొంచెం సంకోచించి తరువాత కూర్చున్నాడు పొగతాగే గొట్టాన్ని బల్లకు ఆనించి.

"చలికాలం తీసుకు రాదగిందేమీ ఉండదు- అయ్యగారు నా చొరవకి క్షమిస్తే, యిడిగోండి యీ కొద్దిపాటి బీన్స్, మేము స్వయంగా ఎండబెట్టినవి" అంటూ తాను తెచ్చిన కాగితపు పొట్లం అందజేశాడు.

తన పరిస్థితి ఎలా ఉందని అడిగినప్పుడు అతడు ఊరికే తల ఆడించాడు.

"చాలా అధ్వాన్నంగా ఉంది- మా ఆరోవాడు కూడా కొంత పనిచేయ గలుగు తాడు- అయినా మాకు చాలినంత తిండిలేదు- భద్రతలేదు- అన్నిరకాల వాళ్ళూ డబ్బు కావాలంటారు- ఒక పద్ధతి నియమమూ లేదు- పంటల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది- పంటలు పండిస్తాం- వాటిని అమ్మబోతే ఎన్నోరకాల పన్నులు కట్టాల్సి వస్తుంది. అలా నష్టపోవడం జరుగుతుంది- మరి అమ్మే ప్రయత్నం చేయకపోతే పరిస్థితులు చెడిపోతాయి."

అతడు తలపంకిస్తూ పోయాడు- అతని ముఖం ముడతలు పడివున్నా రాతి విగ్ర హమా అన్నట్టు ముడతలు కదల్లేదు. ఎంతో వేదన పడుతున్నా అది వ్యక్తం చేయ లేకపోయాడు- కొద్దిసేపు ఆగి తన పొగగొట్టం తీసుకొని నెమ్మదిగా తాగడం మొదలు పెట్టాడు-

ఇంటివద్ద అతనికి చాలా పనులున్నాయని అమ్మ తెలుసుకుంది- మర్నాడు అతడు వెళ్ళిపోవాలి- మధ్యాహ్నమేమీ తినలేదు కాబట్టి అతన్ని వంటింట్లోకి వెళ్ళి తనకోసం కొంచెం అన్నం తయారుచేసుకొమ్మంది.

అతడు బయటికి వెళ్ళిన తరువాత అమ్మా, నేనూ అతని బాధల బతుకుని తలచుకొని విచారించాం- చాలామంది పిల్లలు, కరువు కాటకాలు, పన్నులు, సైనికులు, బందిపోటు దొంగలు, అధికార్లు, భూకామందులు అందరూ అతన్ని పీల్చి పిప్పి చేశారు- మమ్మీలా నిర్జీవం చేసేశారు.

"మనం మనవెంట తీసుకుపోకుండా వదిలివెళ్ళే వస్తువులన్నీ అతన్ని తీసుకో మందాం- అందులో ఏవి తీసుకుంటాడో అతని యిష్టం" అన్నది అమ్మ.

ఆ మధ్యాహ్నం అతడు కొన్ని వస్తువుల్ని ఎంచుకున్నాడు- రెండు పొడుగాటి బల్లలు, నాలుగు కుర్చీలు, ధూపంవేసే పాత్ర, కొవ్వొత్తిసెమ్మెలు, ఒక త్రాసు- మా పొయ్యిలోని మొత్తం బూడిద కూడా కావాలని, మేము వెళ్ళిపోయిం తర్వాత మళ్ళీ వచ్చి పడవలో తీసుకుపోతానన్నాడు- (మా ప్రాంతంలో పొయ్యిలోకి గడ్డిని వాడుతారు- ఆ బూడిద యిసుక నేలని సారవంతం చేయటానికి ఉపయోగించవచ్చు.)

రాత్రి మేము మళ్ళీ మాట్లాడుకున్నాం- కాని ఏమంత ముఖ్య విషయాలు కావు- మరునాడు ఉదయం అతడు షుయా-షెంగ్‌ని తీసుకొని వెళ్ళిపోయాడు.

మరో తొమ్మిది రోజుల తరువాత మేము వెళ్ళిపోయే సమయం. జున్-టు ఆ ఉదయం వచ్చాడు- అతనితో షుయా-షెంగ్ రాలేదు. పడవను కనిపెట్టుకొని ఉండటానికి ఒక ఐదేళ్ళ అమ్మాయిని మాత్రం వెంటబెట్టుకొచ్చాడు- ఆ రోజంతా యింట్లో మేము పనుల్లో మునిగి ఉన్నాము- మాట్లాడేందుకు సమయం చిక్కలేదు- ఆరోజు చాలామందివచ్చారు- కొందరు సామానులు తెచ్చివ్వడానికి, కొందరు వీడ్కోలు చెప్పడానికి- మరికొందరు యీ రెండింటికీ. మేము పడవలో బయలుదేరి వెళ్ళే సరికి సాయంకాలమైంది. అప్పటికి మా యింట్లో సామానులు పెద్దవీ, చిన్నవీ. పాతవీ, పాడైపోయినవీ, మంచివీ, ముతకవీ అన్నీ ఖాళీ అయిపోయినయ్.

మేము సందెవేళ బయలుదేరి పోతుంటే నదికి రెండువైపులా ఆకుపచ్చని పర్వతాలు, ముదురు నీలవర్ణంలో వెనక్కి కదలిపోతున్నట్లనిపించినై.

హంగ్-ఎర్, నేనూ పడవ కేబిన్ కిటికీని ఆనుకొని బయట అస్పష్టమైన దృశ్యాన్ని చూస్తున్నాము- ఉన్నట్టుండి హంగ్-ఎర్ యిలా అడిగాడు "మామయ్యా మనం మళ్ళీ మన వూరికి ఎప్పుడు వెళ్ళదాం?"

"మళ్ళీ వెనక్కి పోవడమా? అంటే నీవు యీ ప్రాంతాన్ని వదిలిపోకుండానే వెనక్కి పోవాలనుకుంటున్నావా?"

"షుయా-షెంగ్ నన్ను తన యింటికి ఆహ్వానించాడు...." అతడు తన నల్లని కళ్ళని విశాలంగా తెరచి ఆతురతగా అన్నాడు.

అమ్మా నేనూ కొంచెం విచారపడ్డాం. జున్-టు మళ్ళీ జ్ఞాపకమొచ్చాడు- మా ప్రయాణపు సామానులు సర్ది కట్టడం మొదలుపెట్టిన నాటి నుండీ చిక్కుడు పెరుగు

శ్రీమతి యాంగ్ రోజూ మా యింటికి వచ్చేదని అమ్మ చెప్పింది. మొన్న బూడిద కుప్ప తవ్వి ఒక డజను గిన్నెలూ, ప్లేట్లూ బయటికి తీసింది. వాటిని గూర్చి కొంత వాదం జరిగింది. బూడిదకోసం యిక్కడికి తిరిగి వచ్చినప్పుడు యింటికి తీసుకుపోవచ్చునే ఉద్దేశంతో జున్-టు వాటిని యిక్కడ పాతిపెట్టి ఉంటాడని ఆమె అదేపనిగా నొక్కి చెప్పింది. ఈ విషయం కనిపెట్టినందుకి శ్రీమతి యాంగ్ తనలో తాను భలే సంతోషపడింది. ఆ తరువాత ఒక కోళ్ళమేత బోను తీసుకొని అక్కడి నుండి తొందరగా జారుకుంది. ఆమె పాదాల సైజుతో పోలిస్తే నిజంగా ఆమె అంత వేగంగా పరుగెత్తడం ఆశ్చర్యమే.

నేను నా పాత యింటిని వదిలి చాలా దూరం వెళ్ళిపోతున్నాను. అక్కడి పర్వతాలూ, నదులూ వెనక్కి పరుగెడుతూ క్రమంగా నాకు మరింత దూరమైపోతున్నాయి. అయితే నేను విచారపడలేదు. కాని నా తోటి వారి నుండి నన్ను వేరు చేస్తూ నా చుట్టూ ఒక కనిపించని గోడ వున్నట్టు అనిపించింది. అది నన్ను పూర్తిగా కుంగదీసింది. పుచ్చ చెట్ల మధ్య మెడలో వెండి గొలుసుతో అప్పటి ఆ చిన్న వీరుని ఆకారం పగటి వెల్తురులా నా మనసులో స్పష్టంగావుండేది. కాని హఠాత్తుగా యిప్పుడు అది చెదిరిపోయి నన్ను మరీ కుంగదీసింది.

అమ్మ, హంగ్-ఎర్ నిద్రపోయారు.

పడవ కింద అలల శబ్దాన్ని వింటూ నేను పడవలో ఒరిగాను. నా మార్గాన నేను వెళ్ళుతున్నానని నాకు తెలుసు. నాకూ జున్-టుకి నడుమ అడ్డు గోడ ఉన్నప్పటికీ పిల్లల్లో మార్పు లేదు. చాలా వరకు ఒకేలా ఉన్నారు. హంగ్-ఎర్ యిప్పుడు షుయీ-షెంగ్ గురించి ఆలోచించడం లేదా? వాళ్ళు మా లాగా ఉండరని ఆశిస్తాను. వారిమధ్య అడ్డు గోడలు పెరగనివ్వరనీ అనుకుంటున్నాను. నాలా తొక్కుడు యంత్రం లాంటి బతుకు కానీ, జున్-టు లాంటి అత్యంత బాధామయ జీవితం కానీ మరి కొందరిలా తమ శక్తిసామర్థ్యాలు చెడు మార్గాన ఉపయోగించే వ్యర్థ జీవితం కానీ వారిది కాగూడదనీ నేను భావిస్తాను. మనం పూర్వం ఎన్నడూ అనుభవించని ఒక నూతన జీవితాన్ని వారు అనుభవించాలి.

నా యీ ఆలోచన, యీ ఆశ, నన్ను అకస్మాత్తుగా భయపెట్టింది. జున్-టు ధూపం పాత్ర, కొవ్వొత్తి స్టెమ్మలు.... అడిగినప్పుడు అతడు యింకా విగ్రహాల్ని పూజిస్తున్నాడనీ, వాటిని తన మనసులోంచి దూరంచేసుకో లేకపోతున్నాడనీ నేను లోలోపల నవ్వుకున్నాను. కాని యిప్పటి నా 'ఆశ' నేను సృష్టించుకున్న 'విగ్రహం'

ప్రాణాల్ని రక్షించే పాఠం

మీ ఆస్తిపాస్తుల అస్తిత్వానికి
అక్కరయ్యే అమాయకత్వం
జనాల్లో అంతమవకుండా
చూసుకోండి
కంటికి రెప్పలా కాపాడుకోండి
రాబోయే ముప్పుకు మొక్కుకోండి
మీ రక్షణకు
అత్యవసరమయిన సహనం
జనాల్లో నశించకుండా
అరక్షణం ఆలస్యం కాకుండా
తక్షణం రక్షించుకోండి
చేతులు కాలకముందే
ఆకులు పట్టుకోండి.

— పి. శరత్ కుమార్

చాటింపు

జాగ్రత్త! జనులారా!
రేపే మహాసభ-
కాళ్ళొత్తించుకొనేవారు
కాళ్ళొత్తేవారి గురించి
లెక్చర్లూద వస్తున్నారు
వాడి దొంగ మాటల వలల్లోకి
మీ చేతులు జార్చకండి!
దొంగకు దొంగ
సన్మానం చేస్తుంటే
తప్పట్లు చరవకండి!
వాళ్ళంతా
నోరూరించే విషపు మిఠాయిలు
కన్నెలను చెరిచే దుష్టులు
కన్నులను పొడిచే చిలకలు
జాగ్రత్త!

— చక్రవర్తి

కాక మరేమిటి? కాకపోతే రెండింటికున్న తేడా యేమిటంటే అతడు అనుకున్నది అతనికి అందుబాటులో వుంది- నేననుకున్న ఆశ అంత సులభంగా లభించేది కాదు.

నేను కునుకుపాట్లు పడుతున్నాను- విశాలమైన ముదురు ఆకుపచ్చ సముద్ర తీరం నా కనుల ముందు వ్యాపించి ఉంది- పైన గుండ్రని పసిడివన్నె చంద్రుడు ముదురు నీలాకాశంలో వేలాడుతున్నాడు.

నేను ఆలోచించాను. ఆశ- అది భూమిచుట్టూ ఉన్న బాటలాంటిది- నిజానికి ప్రారంభంలో భూమి మీద బాటలనేవి లేవు- కాని చాలామంది ఒక్క మార్గంలో నడిస్తే బాట ఏర్పడుతుంది.

[రచనా కాలం జనవరి 1921]

క్రాంతి

ఇది (ఎన్నేండ్లదో) చీకటి
ఇట వెల్తుర్ను మింగే మబ్బులు....
మాట్లాడే వెలుతురు పిట్టల
బంధించడానికి చీకటి కొట్లు....
గచ్చు నేల - చిరుగుల దుప్పటి

*　　*　　*

ఇది యజ్ఞం
వెల్తురు లోయ
చీకట్లను చీల్చే కిరణం....
నమ్మకాలు నమ్ముల్ని నడిపిస్తున్నాయి

*　　*　　*

ఆశయం అతుకుల వ్యవహారం కానేకాదు
కల్సినపుడు కడుపు దేవుతుంది
కన్నీరుకార్చే కళ్ళు కలిసి ఎర్రబడుతాయ్
ఎర్రబడ్డ కళ్ళల్లో
ఎర్ర రాజ్యపు ఆకాంక్షలు కదుల్తాయి

*　　*　　*

విశ్వాసం ముందుకడిగేయిస్తుంది....
ఎదురు దెబ్బలు వజ్ర సంకల్పాన్ని
కలిగిస్తున్నాయి
మార్పు గాయాల పుండ్లమీది నుండి
వీచే తూర్పు గాలి....
మహా సంకల్పాన్ని నూరిపోస్తోంది.

— అల్లం నారాయణ

ఆకలి అంటే....

మైకులో అరుస్తున్నాడు నాయకుడు
తక్షణమే ఆకలిని అరికట్టేస్తానని
మైకంలో ఉన్నట్టున్నాడు వాడు
లేకపోతే
ఆకలి అంటే
ముచ్చటైన మూడక్షరాలనుకున్నాడేమో
ఎప్పుడైనా పస్తులుండి చస్తేగా....!

— యం. అరుణ్ కుమార్

కన్నీటి పాట

బతుకంతా కష్టాలు చందమామ
గుండెనిండ గాయాలు చందమామ
కండ్లల్లో కన్నీల్లు చందమామ
ఎన్నాల్లు యీ బాధ చందమామ
పొద్దుపొడిసె పొద్దుగూకె చందమామ
ఎద్దు సాకిరి మిగిలిపాయె చందమామ
కండలన్నీ కరిగిపాయె చందమామ
రగతమంతా సెమటాయె చందమామ
ఎముకలన్నీ యిరిగిపాయె చందమామ
ముద్ద నోటి కందదాయె చందమామ
ఆకలెట్ల తీరేది చందమామ
బతుకెట్ల గడిసేది చందమామ
కూడులేదు గూడులేదు చందమామ
కట్టుకోను బట్టలేదు చందమామ
దీపానికి సమురులేదు చందమామ
చీకటోల్లం చితికినోల్లం చందమామ
బతక నేర్వని బంజరోల్లం చందమామ
కారుకూతలాడే కామందు చందమామ
ఓట్లకోసం వస్తాడు చందమామ
ఓటేస్తే నోటిస్తనంటడు చందమామ
కూలి డబ్బు లివ్వనోడు చందమామ
మా బతుకు బాగు సేస్తనంటడు ,,
నమ్మలేము నమ్మలేము చందమామ
పాము నీడ సేరలేము చందమామ
ఎదిరించి నిలస్తాము చందమామ
పోరు సేసి గెలుస్తాము చందమామ

— సి. రామచెంద్రారెడ్డి

ప్రజా చైతన్యానికి ఇరుసు - భూమి సమస్య

వరవరరావు

'ప్రజల మనిషి' నవలలో ప్రధానమైన సమస్య భూమి సమస్య. తెలంగాణాలో ప్రజల్లో వచ్చిన చైతన్యం, ఆ క్రమంలో ఏర్పడిన ఉద్యమాలు అన్నీ కీలకమైన భూమి సమస్య చుట్టూ తిరిగినవే. కంఠీరవం ప్రజల మనిషిగా రూపొందిన క్రమంలో కూడ నేపథ్యంలో అతని చైతన్యానికి ఉత్తేజం, ఉద్దీపనా కూడ భూమి సమస్యే. భూస్వామ్య సమాజం ఒక వికృత దశకు చేరుకొని ప్రజల జీవన విధానాన్ని దుర్భరం చేసిన వాతావరణం మనకీ నవలలో కన్పిస్తుంది. గ్రామాలు ఒక మేరకు స్వయంపోషకమైన యూనిట్లుగా ఉండడానికి ప్రయత్నం చేసిన రోజుల్లో పూజారి, వైష్ణవులు, కమ్మరి, వడ్రంగి మొదలయిన వృత్తుల వాళ్ళు ఎంతో కొంత మడులూ, మాన్యాలూ కలిగివున్నట్లు, రఘునాథాచార్యుల కుటుంబమూ, వెంకటేశ్వర్లూ (వెంకటేశ్వర్రావు- ఊరు విడిచిపోయిన బ్రాహ్మణుని కుమారుడు, వకీలు), రామభూపాల్‌రావు తండ్రి కాలంలో సుఖంగా జీవించినట్లు ఈ నవలలో కనిపిస్తుంది. ఎంతో మంది సన్నకారు రైతులు అగ్రవర్ణాలవారి భూములు కౌలుకు చేసుకునే బతుకుతుండేవారు- ఇంకా తక్కువ కులాల సంగతి చెప్పనక్కరలేదు- వెట్టియే వాళ్ళ జీవనాధారం- భూమి గలవారు స్వంత వ్యవసాయం చేయరు- భూమిని కన్న తల్లికన్నా గూడ ప్రియంగా పట్టుకొని దినమూ రాత్రి కష్టించేవారు ఆ భూమిమీద ఏ అధికారమూ లేని వాళ్ళు. నవల ఆరంభం దొర ఇంట్లో పెండ్లికి కోటయ్య తోటలో పూసిన పూలు, కాసిన కాయలూ పంపించడంతో, దొడ్డిలోని పశు సంపదకు తల్లిఐన ఆవును పంపించటంతో ప్రారంభమై ఆ వూరిలోని రైతాంగమంతా ఎట్లా తమకున్నదంతా దొరకే దోచి పెట్టాల్సి వచ్చిందో వివరిస్తుంది- భూస్వామ్య సంస్కృతిని కాపాడడానికి బహుమానాలు పొందిన వైష్ణవ కుటుంబం విస్తళ్ళు కుట్టడానికి, వంటలు చేయడానికి కుదించబడి భూమి కోల్పోయి ఆచార్యత్వాన్ని కోల్పోయింది- అయినా రఘునాథాచార్యులకు, వెంకటాచార్యులకు యాచకత్వమే ఆచార్యత్వముగా కన్పించింది కాని కంఠీరవానికి మాత్రం కొమురయ్య లాంటి కష్టజీవుల జీవితమే అర్థవంతమైన జీవితమనిపించింది.

ఈ కొమురయ్య కుటుంబం ఎదుర్కొన్న సమస్యలు నిజానికి ఈ గ్రామంలో ప్రజా చైతన్యం రూపొందడానికి కారణమైనవి. కోటయ్య కాలంలో దొర ఆవును

తీసుకున్నాడు- అక్కడ అగలేదు- కోటయ్య చనిపోగానే కొమురయ్యను పిలిపించి ఆయన అప్పటిదాకా కౌలుకు చేస్తున్న భూమిని ఇక నుండి కౌలుకు చేయడానికి వీలు లేదని చెప్పాడు. పోనీ ఆ భూమి దొరది కూడ కాదు- ఎన్నడో ఆ ఊరు వదిలి వెళ్ళిపోయిన బ్రాహ్మణ కుటుంబానిదది. ఆ మాటే కొమురయ్య అడిగాడు- ఊరికి పెద్దగా ఎన్నడయినా ఎవరికైనా తాను జవాబుదారీ అవుతానని రామభూపాల్‌రావు పెద్దధర్మకర్తృత్వ సిద్ధాంతం పల్లిస్తాడు. అయితే అపును తన తండ్రి కోటయ్య ప్రశ్నించకుండా పంపించిన నాడు కొమురయ్య పసి మనసులో వున్నది ఆవేదనా, సందేహాలు, ప్రశ్నలు మాత్రమే- ఇవాళ కొమురయ్య ఒక యువకుడు- బిడ్డ తండ్రి- దొరనే ప్రశ్నించగల చైతన్యానికి ఎదిగాడు- "భూమి గురించి కౌలు గురించి ఆ బామ్మనాయనతోనే మేం మాట్లాడుకుంటాం-" "అరి జాడ జవాబే లేకపాయె కౌలు ఎవరికి కట్ట?" అని దొరకు జవాబు చెప్పగల్గుతాడు. అందుకే వెంటనే రామభూపాల్‌రావు ఏ చర్య తీసుకోలేక "ఊఁ కౌలు తీసుకునేవాడు లేడు కాబట్టి భూమి నీదంటావు- అంతేనా, సరే పో తరువాత మాట్లాడుకుందాం" అని ధిక్కార భావాన్ని తొలిసారిగా చూచిన అనుభవంతో తీవ్ర ఆలోచనలో పడతాడు.

ఈ దశలో ఇంట్లో అన్నతో జరిగిన కలహంలో ఊరు విడిచి వెళ్ళిపోతాడు కంఠీరవం- వెళ్ళిపోయే ముందు కొమురయ్య ఇంటికి వెళ్ళి కొమురయ్య సహాయంతోనే వెళ్ళిపోతాడు- ఆర్థిక పరిస్థితులే సాంఘిక చైతన్యంలో కూడ పాత్ర నిర్వహిస్తాయనడానికి ఈ ఘట్టం కూడ నిదర్శనంగా వున్నది. కంఠీరవం వెళ్ళి చెరువు గట్టున ఏడుస్తూ కూర్చుంటాడు- ఆయన చుట్టూ చేను కాపర్లు చేరి ఓదారుస్తారు- కంకులూ దోసకాయలూ తెచ్చిపెడతారు- కానీ తాము మంచినీళ్ళు తెస్తే తాగుతాడా అనే సందేహంలో పడతారు- ఎందుకు తాగను అని పరధ్యానంలో అంటాడు- కానీ వాళ్ళు తెస్తే తాగడానికి అతనికి మనస్కరించదు- తనకంత ప్రేమగా సజ్జలు, కంకులు, దోసకాయలు తినిపించిన వాళ్ళతో ఆ విషయం చెప్తే బాగుండదని కాలువకే వెళ్ళి నీళ్ళు తాగుదామంటాడు.

రైతులు క్రమంగా శిస్తులు వెళ్ళక తమకున్న చేను చెలుక అమ్ముకొని జీతగాళ్ళుగా మారిన స్థితి కూడ (ఈ నవలకు ముందు కాలంలో 'మాలపల్లి'లో తరువాత కాలంలో కాళీపట్నం రామారావుగారి 'యజ్ఞం' కథలో కూడ ఈ విషయాలు వివరంగా

చూస్తాం) ఈ ఘట్టంలోనే మనకు ఉదాహరణప్రాయంగా కన్పిస్తుంది.[1] ఈ సంభాషణలూ ఈ ఘట్టం ఈ నవలలో ఒక ముఖ్యమైన మలుపుగా విశ్లేషించవచ్చు. ఇంకా బ్రాహ్మల భూమిని కౌలుకు చేయొద్దని దొర అన్నప్పుడు కొమురయ్య కంతా గందర గోళంగా కన్పించింది. ఇప్పుడు తనవంటి రైతు కనకయ్య శిస్తు కట్టలేక స్వంత భూమిని అమ్ముకొని తన భూమిలో తానే జీతగాడుగా పనిచేస్తున్నాడు- ఆ వూళ్ళో రామభూపాల్‌రావులు, హైదరలీలు, కోమటి శంబయ్యలు మాత్రమే మిగిలి కష్టం చేసుకునే వాళ్ళంతా కష్టాల పాలయ్యే రోజులు వచ్చాయి. ఊళ్ళోకి పోదాం అడివిలో పడివుండడానికి ఏమొచ్చింది అని కొమురయ్య అన్నప్పటికీ కంఠీరవాలు, కొమురయ్యలూ ఊళ్ళో వుండలేని స్థితి రాబోతున్నది- కంఠీరవం కనకయ్య మాటలు శ్రద్ధగా వినడంలో 'ప్రజల మనిషి' రూపొందుతున్నాడు- "తురక పంతులు శిక్షణా, శూద్రుల సావాసం- పెద్ద బుద్దులు ఎట్లా వస్తాయి" అని వెంకటాచారి తమ్ముణ్ని గురించి అసహ్యించుకున్నప్పటికీ నిజానికవే కంఠీరవం చైతన్యాన్ని రూపొందించినవి.

రామభూపాల్‌రావు కొమురయ్య భూమి వెంకటాచార్యుల దొంగ వాఙ్మూలం అతని తొత్తులైనవారి కుటిల సాక్ష్యాలతో తన పేర రాయించుకొని రెండేండ్లు గడిపాడు. వెంకటాచార్యులు తండ్రి దగ్గర నుంచి తీసుకున్న భూమి తిరిగి ఇస్తానని వాగ్దానం చేశాడు- కానీ అతనెట్లాగూ స్వంత సేద్యం చేయడు కాబట్టి రామభూపాల్‌రావు కౌలు పద్ధతిన సేద్యం చేయిస్తానని చెప్పాడు- ధాన్యమో డబ్బో తోచినంత ఇచ్చేవాడు.

---

1. కొమురయ్య ఆశ్చర్యంగా కనకయ్యను చూచాడు.

"ఏంది కనుకయ్యా నువ్వు ఈ చేనుకాడ వున్నావు" అన్నాడు.

"కోమటి శంబయ్యది ఈ చేను నేను జీతానికి వున్నాను"

"మీ చేనేమయింది ?"

"మా చేను అమ్మినంగదన్నా ! ఏ ఏటి కా ఏడు శిస్తు ఎళ్ళడమే కష్టమయింది- మా అయ్య చచ్చే ముందే అమ్మేసి కోమటి శంబయ్యకు బాకీ కట్టినం- శంబయ్యే పాపమని జీతానికి వుండమన్నడు-" కనకయ్య అంటూ కండ్లకు నీళ్ళు తీసుకున్నడు.

"సరే నాదేంది గానీ అయ్యగారి సంగతేందో కనుక్కో- ముంజాత" అన్నడు కనకయ్య.

కంఠీరవం కనకయ్య మాటలు శ్రద్ధగా వింటూ తన దుఃఖాన్ని ఆపుకున్నాడు.

"ఊళ్ళోకి పోదాం పద ఏమొచ్చింది అడవిలో పడివుండడానికి" కొమురయ్య కంఠీరవాన్ని అన్నాడు.

నిజమైన ప్రతిఘటన కొమురయ్య భూమిలో రామభూపాల్‌రావు అరకలు కట్టించడం దగ్గర వచ్చింది. తమ భూమిని కాపాడుకోవడానికి రైతు లెట్లా ప్రాణాలకు తెగించి నిలుస్తారో ఆ సమయంలోనే వాళ్ళ నిజమైన చైతన్యం ఎట్లా బయటపడ్తుందో ప్రజల మనిషి నవలలోని తొమ్మిదవ అధ్యాయమంతా నిదర్శనమే. కొమురయ్య తల్లి అన్నమ్మ అరకల కడ్డం నిలిచి దున్నకుండా ఆపింది. అయితే ఆ వూళ్ళో ఇంకా అన్నమ్మలాంటి వాళ్ళ ధైర్యమూ, సాహసమూ ఒంటరివే. అందువల్లనే వాళ్ళు ఓడిపోయారు. కాని ఆ సంఘటన ఆ వూళ్ళో కాపు కులస్తులందరిలో వ్యతిరేకత కొమురయ్యను కట్టేసి కొట్టడంతో తీవ్రమైంది.2

గ్రామంలో ఈ పరిణామం జరుగుతున్న కాలంలో నిజామాబాద్‌లో కంఠీరవాన్ని గ్రంథాలయం తీర్చిదిద్దుతున్నది. తెలంగాణలో వాతావరణం ఇట్లావున్న సమయంలో కంఠీరవం గాంధీజీ ఆత్మకథ చదివాడు. జాతీయోద్యమ ప్రభావంలోకి వచ్చాడు.

కొమురయ్య భూమి లాగుకున్న రోజుల్లో "ఈ భూమితోనే పోలేదు కోటయ్య కౌలుకు తీసుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు ఏమి ఇవ్వకుండా కూర్చున్నదంతా కక్కాల్సి వస్తుంది. తలె ముంత ఇల్లు, గొడ్డు గోదా వేలం వేయిస్తా" అని ఉక్రోషాన్ని వెళ్ళగక్కిన రామభూపాల్‌రావు అంజుమన్ ఇత్తేహాద్‌లు, ముసల్మీన్ పరివర్తన కార్యక్రమం చుట్టుపట్ల తీవ్రంకావడంతో ఆవేదన పొందాడు. హరిజనులు మహమ్మదీయులుగా మారిపోతే గ్రామంలో తన పలుకుబడి తగ్గిపోయి హైదరలీది పైచేయి అవుతుందని ఆందోళన చెందాడు. హరిజనులపట్ల కాపుకులస్థుల పట్ల తన ప్రవర్తన మార్చుకోవాలనుకున్నాడు. ఊళ్ళో చెరువు లోతట్టు భాగం తనదని ఇదువరకటిలా చెప్పుకునే సాహసం చేయలేకపోయాడు. ఇదే కాలంలో రైతులలో సంఘటిత శక్తి

2. గొట్టం కొమురయ్య అనుభవంలోవున్న తోట బావి రామభూపాల్‌రావు హరించి వేయడం రామభూపాల్‌రావు చేసే అన్యాయపు పనుల్లో ఒక్కటిగా గ్రామ ప్రజలు భావించినా కొమురయ్యను గుంజకుకట్టి కొట్టడం భరింపరాని అవమానకరమైన విషయంగా కాపు కులంవాళ్ళు బాధపడ్డారు.

ఒకనాడు కొంతమంది రైతులు చంద్రయ్యఇను రైతుచేనులో కూడినారు. చాల సేపు చర్చోపచర్చలు చేసినారు. రామభూపాల్‌రావు చేష్టలను అందరూ విమర్శించినారు. అందరూ కోపం వెలిబుచ్చారు. కాని అతని చర్యలను అడ్డుకోవడ మెట్లాగో తోచలేదు. పరితాపంలో ఎక్కడివాళ్ళక్కడ చెదరిపోయారు. అప్పుడప్పుడూ ఒకరో ఇద్దరో రైతులు కూర్చున్నప్పుడల్లా రామభూపాల్‌రావు విషయం చర్చించడం అలవాటయి పోయింది.

కూడ పెరిగిపోయింది- ఈ ప్రజా చైతన్యం రూపొందే క్రమాన్ని రచయిత ఒక ప్రాసెస్‌గా ఒక క్రమంలో మంచి పునాదితో నిర్మాణంతో అభివృద్ధి పరుస్తాడు.

గ్రామంలో కొమురయ్య భూమి సమస్యతో రగుల్కొన్న ప్రజా చైతన్యానికి పట్టణంలో గ్రంధాలయోద్యమంలో జాతీయోద్యమ చైతన్యంతో రూపొందిన కంఠీరవం పరంధామయ్యల సామాజిక చైతన్యం సమన్వయ మైనప్పుడు దిమ్మగూడెం గ్రామంలో సంఘర్షణ ప్రారంభమయింది. కంఠీరవం గ్రామంలో అన్నలాంటి దుర్మార్గుణ్ణి రామ భూపాల్ రావువంటి దొరను చూశాడు కానీ గ్రంధాలయోద్యమంలాంటి సంస్కరణ ఉద్యమానికి కూడ అడ్డుపడుతున్న ప్రభుత్వాన్ని దాని స్వభావాన్ని నిజామాబాద్‌లో తన అనుభవంద్వారా తెలుసుకున్నాడు.

మత పరివర్తనలో కూడా దానివైపు ఆకర్షింపబడుటకైనా దాన్ని ప్రశ్నించడానికైనా దిమ్మెగూడెం గ్రామంలో భూమిసమస్యయే కేంద్రమయింది. "మీతో. పొద్దస్తమానం పని చేయించుకొని కడుపు నిండని కూలీ జీతాలు ఇస్తున్నారు" అని అంజుమన్ ప్రచారకుడు చెప్తే "ఇగ హైదరలీ ఎంత జీతం ఇస్తాడో చూస్తాంకద" అనిరైతుల్లో ఒకడు గొణిగాడు. దొర గుంజుకున్న భూములూ తీసుకున్న లంచాలు ఇప్పిస్తారా! అని ఒక గొండ్లముసలి ప్రశ్నించాడు. హైదరలీకూడా న్యాయంచేయడని తన భూమి విషయంలో స్వయంగా అనుభవమున్న కొమురయ్య ధైర్యంగా చెప్పుతాడు. నిజమాబాద్‌లో వుండగానే కొమురయ్య భూమిని రామభూపాల్‌రావు ఆక్రమించుకున్న విషయం కంఠీరవానికి తెలిసింది. ఆ గ్రామంలో ఈ మత పరివర్తన కార్యక్రమం సందర్భంలో కంఠీరవంవచ్చి కొమురయ్యను మిగతాజనాన్ని కూడగట్టాడు. అంజుమన్‌నాయకుని ప్రశ్నించడంలోనే అరెస్టయ్యాడు. ఆయనతో పాటే కొమురయ్య కూడ అరెస్టయ్యాడు. ఇక్కడ మాత్రం అంజుమన్ నాయకులతోచేసిన చర్చలలో కొమురయ్య ముఖ్యంగా గ్రామంలో రామభూపాల్‌రావు, హైదరలీలు చేసిన దౌర్జన్యాలను ప్రశ్నించాడు- కంఠీరవం మతాల గురించి వాటి పుట్టుక ప్రయోజనం గురించి అధికార ప్రాబల్యంతో బలవంతంగా జరుగుతున్న మత పరివర్తన గురించి ప్రశ్నించాడు.

మత పరివర్తన వల్ల గూడ ముందుకు వచ్చినవి భూమి సమస్యలు, ఆర్థిక సమస్యలే. తురకలుగా మారిన హరిజనులకు నీళ్ళు పుట్టకుండా తిప్పలుపెట్టి వత్తిడి తేవాలి అన్నదే రామభూపాల్‌రావు, వెంకటాద్రి చేసిన ఆలోచన.

మహమ్మదీయులుగా మారిన హరిజనులు జీతగాండ్లుగా పనిచేయడానికి వెనుకాముందాడారు- అయితే ఏమి పనిచేయకుండా ఎన్నాళ్ళు ఏ విధంగా బతకడం? వెంటనే

చదువులూ, ఉద్యోగాలూ, భూములూ, పొందడం సంభవమా? ఏ భూములు ఏవిధంగా లభిస్తాయి. ఎవరివల్ల, ఎవరివి, ఎప్పుడు, ఏ విధంగా భూములు హరించబడ్డాయి? ఇవన్నీ ఆలోచిస్తున్నకొద్దీ అంతుదొరకని సమస్యలు. క్రమంగా పటేండ్లు, పటువారీలు మహమ్మదీయులే అవుతారని, వ్యాపారాలు, నేతపని మొదలగు పనులన్నీ హిందువులకు బదులు మహమ్మదీయులే చేస్తారని తాను ఊహించినవి మతప్రచారకుడు హరిజన వాడలో పాక వేసుకొని చెప్పాడు. కానీ హరిజనులు ముస్లింలుగా మారింది పటేల్, పట్వారిగిరీలు చేయడానికి, వ్యాపారాలు చేయడానికి కాదు- కేవలం పొట్టకూటి గ్యారంటీకి చేరారు- కొంతమందికి వున్న జీతాలు కూడ పోయాయి. మహమ్మదీయులైన హరిజనులు గ్రామంలోకి పనివుండి వెడితే కొందరు తిరిపోయి చూసేవారు. అంతేకాదు జీతాలు పెట్టుకోకపోవడమేపోయి పాత బాకీలు వసూలుచేసే వత్తిడి కూడ ప్రారంభమయింది- "ఈ మాదిగోళ్ళ జీతాలు, నాతాలు, తెగలు, కళ్ళాలు, మానుకొని ఏంచేస్తరట" అని వెంకటాద్రి ఎగసనచేశాడు- మొగవాళ్ళు ఇళ్ళల్లో వుండి మొహం చెల్లక ఆడవాళ్ళను కూలీలకు పంపారు- "జుట్టూ, బొట్టూ, మొలతాడు లేనిది మన కళ్ళాలలోనికి వస్తే పొలి తిరగనిస్తమా మరి ఆ ఆడోళ్ళను మాత్రం కూలి కెందుకట పిలిచేది" అని రాంభూపాల్‌రావు సలహాదారుడు వెంకటాద్రి రైతు పెద్ద చంద్రియ్యతో హరిజనులపై ఆర్థిక దిగ్బంధం ఆలోచన చేశాడు.

కోర్టులో కంఠీరవం తనవాదం తాను చేసుకోవడమే కాకుండా సాక్షులను తానే ప్రశ్నించాడు- అతడు హైదరలీకి వేసిన ప్రశ్నలో మొదటిసారిగా భూమి సమస్యను అర్థం చేసుకోవడంలో కంఠీరవం కొమురయ్యలాంటి కష్టజీవుల అవగాహనకు దగ్గరికి వస్తున్న విషయం అర్థమవుతుంది.

హైదరలీపై కంఠీరవం ప్రశ్నలు ప్రారంభించాడు- రామభూపాల్‌రావు దొర గారి పెద్ద గుమాస్తా హైదరలీ దూదేకుల వాండ్ల భూమి ఆక్రమించుకున్నాడని కనీసం వాండ్లకు పరిహారం కూడ ఇవ్వలేదని బయటపెడతాడు- "హరిజనులను మహమ్మదీయులనుచేసి ఉద్ధరించ బయలుదేరిన ఈ పెద్దమనిషి అన్యాయంగా తోటి మతంవాండ్లయిన దూదేకులవారి భూమిని హిందువయిన ఒక దొర ఆసరాతో హరించాడని మీరు తెలుసుకోవాలె-" హైదరలీ జీతగాండ్లలోకూడ హరిజనులు వున్నారని వారంతా మహమ్మదీయులైయ్యారా? అని ప్రశ్నిస్తాడు.

"సరె మీరు అంజుమన్ నాయకులు హిందువులు హరిజనులపై అన్యాయం చేస్తున్నారని అన్నారు- మరి మీరు దొరవారి గుమాస్తాగా వ్యవసాయదారుగా హరి

జనులైన జీతగాండ్లకు అందరికంటె ఏమైన ఎక్కువ సౌకర్యాలు చేకూర్చారా ?" అని హైదరలీని కంఠీరవం ప్రశ్నించాడు.

మస్కీన్‌సాబ్‌గా మారిన మల్లిగాడు అనే హరిజనుని కూడ కంఠీరవం సాక్షిగా ప్రశ్నిస్తాడు- సర్కారు భూములూ, కొలువులూ ఇప్పిస్తానంటె బతుకులు బాగయితాయని తురకమతంలో చేరామని కాని జుట్టూ బొట్టూ మొలతాడు లేకుంటె రైతులు కళ్ళాలకాడికి రానివ్వడం లేదని న్యాయం కోసం న్యాయాధిపతి దిక్కు చూస్తాడు ఆ హరిజనుడు.

కంఠీరవం తన ప్రకటనలో "అందరివలెనే గ్రామ ప్రజలను పీడిస్తున్న హైదరలీ మతోద్ధారకునిగా నటిస్తున్నాడు- ఆర్థికంగా అవస్థలపాలైన పేదల అమాయకత్వాన్ని ఊతగా తీసుకొని హరిజనులపై మొసలికన్నీరు కారుస్తున్నాడు-" "మీరు, మీ ప్రభుత్వం కొత్త కొత్త సౌకర్యాలు కొత్త వాండ్లకు చేయడంకంటె ప్రభుత్వము ప్రజలయెడ నిర్వర్తించాల్సిన కర్తవ్యమేమిటో తెలుసుకొని వ్యవహరిస్తే అంతా హాయిగా వుంటారు- మతప్రసక్తి అనవసరం" అని చక్కని అవగాహనతో చెప్తాడు.

భూమి సమస్య మళ్ళీ రామభూపాల్‌రావు విజయదేవ్ అనే ఆర్యసమాజ ప్రచారకుణ్ణి గ్రామంలోకి తేవడంతో ముందుకు వస్తుంది- హిందువులు తురకలుగా మారడం ఎట్లా వాళ్ళ బతుకుల్ని బాగుచేయలేకపోయిందో తిరిగి వాళ్ళను హిందువులుగా చేయడం కూడ వాళ్ళ బతుకుల్ని బాగుచేయలేకపోయిందనేది విజయదేవ్ గ్రహిస్తాడు- అసలు సమస్య భూస్వామ్య విధానంలో, దొరల పెత్తందారీతనంలో వుందిగాని మతంతో లేదని గ్రహించినందువల్లనే రామభూపాల్‌రావు తెచ్చిన విజయదేవ్ దొరకు శత్రువై ప్రజల పక్షం చేరుతాడు.

సరిగ్గా పంటల కాలంలోనే హరిజనులు పరివర్తన పొందడంతో వారి ఆర్థిక జీవితం దెబ్బతిన్నది- అదే అదనుగా రైతుల నుంచి హరిజనులకు పనులూ, కొలువులూ యథాప్రకారం ఇప్పిస్తానని చెప్పి వెంటనే ఒక్కొక్కరికీ ఐదు సేర్ల వడ్లు కొలిపించి విజయదేవ్‌తో శుద్ధి సంస్కారం చేయించి హిందువులుగా మార్చాడు రామభూపాల్‌రావు.

జెయిలు నుంచి విడుదలయి వచ్చిన కొమురయ్య దిమ్మగూడెంలో కంఠీరవం ఆదేశం ప్రకారం రాత్రి పాఠశాల, గ్రంథాలయం, భజన మొదలగు కార్యక్రమాలు నిర్వహించడానికి పరంధామయ్య అనే కార్యకర్తను తీసుకవచ్చాడు- హిందూ మహాసభీయ మత ప్రచారంలో ఆ గ్రామ ప్రజల జీవితంలో ఒక వింత మనస్తత్వం ఆలోచనాస్థితి, చైతన్యమూ ఏర్పడ్డవి- దానికి గ్రంథాలయమూ రాత్రి పాఠశాల, భజన

పరంధామయ్య కృషి తోడయి ప్రజల చైతన్యస్థాయి పెరిగింది. రామభూపాల్‌రావు పరిపాలనా వ్యవహారాల విషయంలో పరంధామయ్యతో రైతులు, గుసగుసలు మొదలు పెట్టారు. ప్రజల నుండి లంచాలు, మామూళ్ళు గుంజడం, బెదిరించి ప్రతిఫలం లేకుండా పనులు వెళ్ళదీసుకోవడం మొదలగు వాటితో పాటు అందరినీ కలచివేసిన కొమురయ్య భూమిసమస్య విజయదేవ్ దగ్గర ప్రస్తావించి దొరదగ్గర మన్నన గౌరవం వున్నందున అతనిని సామరస్యంగా పరిష్కరించమని కోరారు. విజయదేవ్ మత విషయాలలో తాను చెప్పినట్లల్లా వింటున్న రామభూపాల్‌రావు మౌలికమైన భూమి సమస్య విషయంలో కూడ అలాగే అంటాడని అమాయకంగా నమ్మాడు. కాని అది విజయదేవ్ శక్తికిమించిన ప్రవర్తనగా రామభూపాల్‌రావుకు తోచింది.

వ్యవస్థలోని వర్గ సంబంధాలలో మౌలికమైన తేడాలు రాని మేరకు దోపిడీ వర్గాలు కొన్ని విషయాలను సహిస్తాయి. కొన్ని మార్పులను సహించడమేకాదు ఆహ్వానిస్తాయి. అట్లే రామభూపాల్‌రావు ఆర్యసమాజ్‌ను ఆహ్వానించాడు కానీ గ్రామ వ్యవహారాల్లో అందులోనూ భూమి వ్యవహారాల్లో విజయదేవ్ జోక్యం రామభూపాల్‌రావుకు జెర్రులు పాకినట్లయింది. అతడు ప్రజలకు చెప్పదగ్గ వాడేకానీ తన విషయంలో జోక్యం చేసుకోదగిన వాడు కాడని అతని భావన.3

---

3. 'చిల్లర దేవుళ్లు' నవలలో కూడ సారంగపాణితో తన కూతురు మాట్లాడటమే కాదు అతని దగ్గర వీణ నేర్చుకోవడానికి కూడ దొర అనుమతిస్తాడు. అతనికి భార్య ఎదురుపడడం కూడ అడ్డు చెప్పడు. పట్టణం నుంచి కెమరా తెప్పించి వాళ్ళ ఫోటోలు తీయిస్తాడు. ఊళ్ళో కరణంతోనూ మరొకరితోనూ తనకున్న వ్యవహారాలు కూడ అతనితో చర్చిస్తాడు. ఒకరకంగా అతనిని తన కుటుంబంలో సభ్యుడుగా, సలహాదారుడుగా కూడ చూసుకుంటాడు. కానీ తోటలో చింతకాయల దొంగతనం చేసిన హరిజనులను దొర గొడ్లలా బాదినపుడు సారంగపాణి జోక్యం చేసుకున్నందుకు ఊరువదిలి వెళ్ళిపోవల్సివస్తుంది. అట్లే ఇంట్లోవున్న దాసిపిల్ల వనజపై సారంగపాణి సానుభూతి కూడ ఆమె తన బాధల నెంత మౌనంగా అనుభవిస్తుందో అంత విద్యావంతుడు స్వతంత్రుడు సారంగపాణి కూడ అంతే గోప్యంగా దాచుకోవల్సివస్తుంది. దొరలతో పెత్తందార్లతో భూస్వామ్య వ్యవస్థలో మేధావులకు విద్యావంతులకు వుండే గౌరవ, చనువు, స్వాతంత్ర్యం ఫ్యూడల్ సంబంధాలను ప్రశ్నించనంత వరకే, లేదా ఈ ఫ్యూడల్ సంబంధాలను కాపాడడంలో ఆర్యసమాజ్ ప్రధానిలాగా దొరలకు అండగా నిలిచినపుడుమాత్రమే వీరి పెద్దరికం దక్కుతుంది. అందుకే కొమురయ్య విజయదేవ్‌ను 'దొరల మనిషి'ని అనుమానించాడు. దెప్పాడు. విజయదేవ్ బల్లెంతో పొడిచినంత బాధపడ్డాడు.

మతబంధం గట్టిది కాదని వర్గబంధం గట్టిదని ఆర్యసమాజీయుడైన విజయదేవ్ గ్రామంలో రైతులతో వుండడంవల్ల ఆ ప్రత్యక్ష అనుభవమూ, చైతన్యము నుంచి గ్రహించినట్లుగానే హైదరలీతో అంజుమన్‌లోకి మతపరివర్తన కారణంగా సంబంధాలు చెడగొట్టుకోవడం తప్పయిందని రామభూపాల్‌రావు పశ్చాత్తాపపడ్డాడు- అట్లే రామభూపాల్‌రావుతో విడిపోవడం తప్పు పనయిందని హైదరలీ పశ్చాత్తాపపడ్డాడు- తిరిగి రామభూపాల్‌రావు చెలిమిని సంపాదించి వెంకటాద్రి సలహాలను రామభూపాల్‌రావు ఆజ్ఞలను కార్యరూపంలో పెట్టే భాగ్యం తిరిగి కలగాలని హైదరలీ ఆలోచించడం మొదలు పెట్టాడు.

చారిత్రిక శక్తుల పురోగమనంలో ప్రజలపాత్ర రాటుదేలినాకొద్దీ వర్గాల సంఘర్షణ తీవ్రతరమవుతుంది.

'లోగా కుమ్మరి దుర్గయ్య చెరువు లోతట్టులో మన్ను తోడుకుంటుండగా దొరోరు అటకాయించిను'- చెరువు హర్రాజు కాకముందే దొర ఎట్లా అటకాయించాడనే ఆలోచన నుంచి అసలు ఈ పర్యాయం చెరువు హర్రాజులో ప్రజలు కూడ పాల్గొనాలని రాత్రి గ్రింథాలయంలో కూడి అందరు నిర్ణయించుకున్నారు- లోగా చెంద్రయ్య రైతు చేనులో కూడినపుడు రైతుల్లో రామభూపాల్‌రావు పట్ల కోపం కన్పించింది. కాని వారికి అతని చర్యను అడ్డుకోవడమెట్లాగో తోచలేదు- పరితాపంలో ఎక్కడివాళ్ళక్కడ చెదిరిపోయారు- కాని కోపం రాజుకుంటూనే వున్నది- ఒకరో ఇద్దరో రైతులు కూర్చున్నప్పుడల్లా చర్చలు సాగుతూనే వున్నాయి- ఈనాటికి ప్రజా చైతన్యానికి ఒక సంఘటిత రూపం ఏర్పడింది- వాళ్ళు తమ కోపానికి ఒక కార్యరూపం ఇవ్వ గలుగుతున్నారు.

విజయదేవ్‌కు బుద్ధి చెప్పించటానికి రామభూపాల్‌రావు పట్టణం నుంచి ఆర్య సమాజ్ ప్రధానిని పిలిపించాడు- అతడు ఆ గ్రామ రైతులకు రామభూపాల్‌రావును "భ్రష్టమవుతున్న ధర్మాన్ని కాపాడుటకు ధర్మాత్ముడుగా నిజంగా ఆ రాముడు భూమిని పరిపాలిస్తున్నా డనిపించేలా" హిందూమతాన్ని ఉద్ధరించాడని చెప్పాడు. రైతులు ఒకరినొకరు చూసుకున్నారు.

కానీ విజయదేవ్ అనుభవం భిన్నంగా వున్నది "మా ప్రధాని గారికి పల్లెటూరి విషయాలు అంతగా పరిచయం లేదు- వారికి మన ప్రాంతం, వాతావరణం కూడ కొత్త- ఈ వూరిలో రామభూపాల్‌రావుగారు నంది అంటె నంది, పందంటె పంది.

ప్రజలు పండించే పంట పిండే పాలు సమకూర్చే నెయ్యి పొలంచేసిన భూమి పెంచ బడు పశువులు అందమైన స్త్రీలు అన్నిటిపై రామభూపాల్‌రావుగారి లేక అతని తొత్తుల కన్ను వుంటుంది– ఎప్పుడు వశం చేసుకుందామని ఆలోచిస్తుంటారు– కొద్దిలో చెప్పా లంటె అందరూ బానిసలుగా బతుకుతున్నారు. పరిస్థితులు ఈ విధంగా వుంటే ఏ గ్రామంలో ఏ దేశంలో ధర్మం నిలువదు– సభ్యత వర్ధిల్లదు– నీతికి స్థానంవుండదు. కుళ్ళు, కుతంత్రం, కుట్రలు చెలామణి అవుతుంటాయి. ఈ గ్రామంలో రామభూపాల్ రావుగారు, హైదరలీగారు, వెంకటాద్రిగారు తప్ప మిగతా వాళ్ళంతా పశువులని వారి అభిప్రాయం– మొత్తం గ్రామ జీవితం తల్లక్రిందులు కావడానికి నేను మీవొద్దకు రావడానికి రామభూపాల్‌రావుగారు, మా ప్రధాని నాయకత్వం వహించడానికి కారణ మైన హైదరలీ తిరిగి రామభూపాల్‌రావు కుడిబుజంగా ఏర్పడడానికి అవకాశం ఏర్పడు తున్నది"– ప్రధానికి ఈ పరిస్థితికంతా ప్రభుత్వమే కారణ మనిపిస్తున్నది– ఆ ప్రభు త్వంకూడ పర మత ప్రభుత్వం కావడమే కారణమనిపిస్తున్నది– హిందువుల చేతు ల్లోకి రాజ్యంవస్తే ప్రజలంతా బాగుపడతారని ప్రభుత్వ యంత్రాంగం బాగుపడుతుం దని ప్రధాని అభిప్రాయం– "రూపాయికీ, అణా, రెండణాల ప్రకారం మామూళ్ళు పెండ్లికి కట్నాలు కచ్చడానికి ఎడ్లు కమ్మని నెయ్యి బలంగల భూములు ఆఖరుకు చెట్లపాదుల కూరగాయలు అంతదూరమెందుకు మన ప్రధానిగారు రాత్రి పడుకోవడా నికి మంచం ఎవరింటికాడ తెచ్చిందో తెలుసుకోరాదిరి– ఇయన్నీ మా నెత్తిన కొట్టి తీసుకొమ్మని సర్కార్ అంటుందా, ఖానూన్ వుందా– మీ అంత తెలియకపోయినా జరజర మాకుకూడ ఎరుకవుతున్నది లేరి" చంద్రయ్య నిలుచుండి ఎడమచెయ్యి రొంటి మీద పెట్టుకొని కుడిచెయ్యిని ఆడిస్తూ గట్టిగా అన్నాడు– ప్రజల్లో అలజడి ప్రారంభ మయింది– ఇగ అక్కడ నుంచి అది ప్రజాకోర్టుగా మారింది. తన దగ్గర నుంచి బంగారంలాంటి భూమిని దొర అన్యాయంగా లాగుకొన్నవిషయం కొమురయ్యచెప్పాడు.

"మొన్న చెరువులో మన్ను తోడుతాంటె సుంకరోడొచ్చి అటకాయించె– పేరు కేమొ ఇంత సవట బిళ్ళ ఒకటి ఇచ్చినమంటిరి– సంజుకుంటె కుంచెడు వడ్లు ఎళ్ళవు– పొద్దుమూకులు అయినప్పుడూ కానప్పుడూ దిక్కుమాలిన చాకిరీ చేస్తుంటిమి– కుమ్మ రోడు ఇన్ని కుండలు చేసుకనన్న బతుకుతడని దొర అనుకోడాయె" కుమ్మరి దుర్గయ్య ఫిర్యాదు.

తన అప్పు ఎగ్గొట్టిన విషయం కోమటి శంభయ్య గొణిగాడు– ఇస్లాం హిందూ మత పరివర్తనలో నలిగిపోయి ఎక్కడివాళ్ళక్కడే వున్న హరిజనుల సమస్యను ఒక

హరిజనుడు చక్కగా వివరించాడు- "జుట్టూ మొలతాడుపోయి బతుకులు బాగయితయని తురకాయన చేసిన ఆరాటం అంతింత గాదు- అప్పుడు ఏమిచిత్రమో అది, వూరి జనమంతా దొరపట్టయిపోయిన్రు- వున్న వూళ్ళె కూటికి చచ్చేరోజొచ్చె- అప్పుడు మరి దొరోరు పిలిపిస్తెనే విజయదేవయ్యగారు వచ్చి నిప్పుచేసి నెయ్యిపోసి ఏమేమొ సదివి మళ్ళీ మేము ఎప్పటాల అయినమని చెప్పిరి- సరె అది పోనీయిరి గానీ మళ్ళీ మా బేగారి తన్నులు తరవడం మాకొచ్చింది గానీ ఒక మాటడుగుత పొద్దస్తమానం చలికీ, ఆనకు వడగాడ్పుకు బందెరుదొడ్డికాడ నీలిగి నీలిగి చస్తే దయపుడితే రొండు పైసలు చేతులేసిరి లేకుంటే అంగుష్టి ముద్రలతోనే అయిపాయె- అసలు ఖనూనేంది దొర చేస్తున్నడా? సర్కార్ చేయమంటున్నరా?"

ఒక బెస్త పకీరు దొర హైదరలీ మూతులు కలపడానికి చూస్తున్నారని మళ్ళీ తమ చావలకు తిప్పలొస్తదని ఎవరీసంగతి అడగరేమిటని తన ఆందోళన వ్యక్తం చేశాడు- ప్రజలందరిలో ఆలోచనలూ, ప్రశ్నలూ రేకెత్తిన అదను చూసుకొని "ప్రధానిగారు తురకా, హిందూ అంటున్నారు మరి ఇప్పుడు కష్టాలు చెప్పుకున్నోళ్ళంతా హిందువులేనైరి దొర హిందువేనాయె మానుకుంటె ఎవడన్నా కొట్టొచ్చిండా" అని పరంధామయ్య ప్రశ్నించాడు.

"సర్కారు మనుసులు తురకయినా మనోడయినా చేసే గోల ఆరాటం తిట్లు, కొట్లూ, అదికావాలె ఇదికావాలె అని అల్లుండ్లోలె అన్నీ సాగించుకొని పొట్టపగులమెక్కి మిగిలింది మూటలు కట్టుకోని పోతర్- మనం సూడటంలేదా" అని చాకలి సర్వయ్య గొంతు సరాయించుకొని అన్నడు.

"అఁ హిందుపేందో, తురకేందో హైదరలీ బీట్లకుపోయినా దొరగారి ఏనెకు పోయినా రైతుల గెట్లపంటిపోయినా జీవాలను అడుగుపెట్టనీయరు- మా తాత ముత్తాతల కాలంనుంచి గొల్లోళ్ళు వున్నరాయె ఒక్కడన్నా పాపమన్నరా?" అని గొల్ల వీరయ్య జకుముకు కొట్టి చుట్ట ముట్టించాడు. ఈ ప్రజాచైతన్యాన్ని చూసి "వీటన్నిటికీ రామభూపాల్‌రావుగారే కారకుడని పండిత విజయదేవ్ మీ నెత్తికెక్కించారన్న మాట" అన్నాడు ప్రధాని. "ఇవన్నీ నేర్పితే వస్తాయండీ- బాధలు పడలేక పడలేక, కడుపులు మండీ మండీ, దేవుడా అని మొత్తుకుంటుంటె, మీరీవిధంగా మాట్లాడటం తమాషాగా వున్నది" అని పరంధామయ్య హేళనచేశాడు. రామభూపాల్‌రావు నుంచి దృష్టిని తప్పించాలని పాయగా ప్రాంతాలు జాగీర్లు వదిలి పల్లెటూరి దొరవెంట పడితే ఏమొస్తుందన్నాడు ప్రధాని- విజయదేవ్ మాటల్లో చెప్పాలంటె ప్రజల కష్టాలగురించి

ప్రజలు ఆలోచించుకున్నారు– ప్రధానిగారికి వారి స్వంత అభిప్రాయాలున్నాయి– అవి కావాలనగానే రావు వద్దనగానే పోయేవికావు.

కంఠీరవం జైలుకు వెళ్ళగానే అర్థంచేసుకున్నది కూడ జైలుకువచ్చిన అత్యధిక సంఖ్యాకులు భూమి సమస్యపై ఆర్థిక అసమానతలు కారణంగానే వచ్చినవారని. దీర్ఘ శిక్షల వాండ్లలో ఎక్కువమంది రైతులే. గ్రామాధికారుల కుట్రలకు గురియై విసిగి వేసారి రెచ్చిపోయి చేసిన హత్యలు ఒకరికి, ఒకరికి విద్వేషాలు కల్పించి ఒకరికి సాయంగా నిలబడి చేయించిన హత్యలు– డబ్బునే ప్రధానంగా తలచి దాంపత్య విలువలను, కుటుంబ కట్టుబాట్లను, పరహితమును పాటించక జరిగే అవకతవకలను అరాచక పరిస్థితులను ఎదుర్కొనుటకై చేసిన సాహస చర్యలే దీర్ఘ శిక్షలకు ప్రధానంగా వెనుకనున్న చరిత్ర అని కంఠీరవం తెలుసుకున్నాడు– సమాజ స్వరూపమును, పరిపాలన యొక్క భయంకర దృశ్యమును తలుచుకొని బెంగపడ్డాడు– ప్రస్తుత వ్యవస్థను సహించి సాగనివ్వటం మహా పాపమని నిశ్చయించుకున్నాడు– మేధావులు ఏమి చేస్తున్నట్టు– తనలో తాను మథనపడ్డాడు. (ప్రజల మనిషి – పేజీ 168)

దిమ్మగూడెం గ్రామంలో ప్రజా చైతన్యము పెరుగుతున్నట్లుగానే జైల్లో కంఠీరవం చైతన్యం కూడ పదునెక్కుతూ వచ్చింది– "....విధిగా పని చేయాలన్నట్లే విధిగా ఆహారం తినడం కూడ ఖానూను ప్రకారం తప్పదు– జేల్లో ఇవన్నీ చెప్పుకొని గర్వించతగ్గవే– అన్నిచోట్ల, అందరూ ఆచరించాల్సిన విషయాలే– కాని ఇట్టి వ్యవస్థ బయట కూడ వుంటే మొత్తం సమాజమే బాగుపడుతుంది."[4]

తన జైలు జీవితం వృథాకాలేదని చెప్తూ– "....ఒకవైపు సమాజపు నగ్న స్వరూపం, పరిపాలనా యంత్రం యొక్క భయంకర స్వరూపం స్పష్టంగా చూడగలిగాను– రెండోవైపు ఆదర్శ సమాజ నిర్మాణానికి ప్రాతిపదిక సూత్రాలను తెలుసుకున్నాను. జేలుకు రాకముందు నాలోవున్న అస్పష్టమైన భావాలు, ఇప్పుడు చాల గట్టిపడ్డాయి" అంటాడు కంఠీరవం. కంఠీరవం చైతన్యమిట్లా పదనెక్కింది–

ఇక దిమ్మగూడెంలో ప్రజల్లో చైతన్యం పెరిగింది– రామభూపాల్‌రావంటే బెదురు పోయింది– ప్రజలు తమ నిత్యజీవితంలో రామభూపాల్‌రావు వల్ల పొందే చిక్కులు పోగొట్టుకోవాల్ననే తహతహ ఎక్కువ కాసాగింది– గ్రంథాలయం ఆ ఊరి

4. అట్లని జైలువ్యవస్థను కంఠీరవం సమర్థిస్తున్నాడనికాదు– "....కానీ మీరు జేలు నేరాల కింద క్రమశిక్షణ, కట్టుబాట్ల పేరుతో చేసే మీ హింసా చర్యలు, వాటి ననుమతించే మీ జేలు నియమాలు మాత్రం మనిషిని నిలువునా నాశనం చేస్తాయి."

ప్రజల ప్రధాన కేంద్రమైంది. రాత్రి పాఠశాలతోపాటు పగటి పాఠశాల కూడ నడుస్తున్నది. విజయదేవు పరంధామయ్యల నాయకత్వం, చంద్రయ్య కొమురయ్యల ముందడుగు, ధైర్యం, పట్టుదల గ్రామ ప్రజలకు పెట్టని కోటగా పనిచేస్తున్నాయి. గ్రామ ప్రజల్లో వుండే అమాయకత్వం, నిరాశ నిస్పృహలు తొలగసాగాయి. ప్రభుత్వ పన్నులు చెల్లించేప్పుడు మామూళ్ళు యివ్వటం పూర్తిగా ఆగిపోయింది. బహీఖాతాలపై రసీదులు రాయించుకోవడం విధిగా జరిగేది. బేగారి నియమాల ప్రకారం పనివాండ్లకు కూలి డబ్బులు సాధించుకోవడంలో పట్టుదల ప్రదర్శించారు. గ్రామాలకు వచ్చే అధికారుల నుండి మొదలే డబ్బు తీసుకొని వారికి కావల్సిన తినుబండారాలను అందించటం మొదలైంది. (పే॥ 181, 182)

ఎట్లా ప్రజల్లో ఐక్యత పెరిగిందో, చైతన్యమూ సంఘటనా శక్తి, ప్రతిఘటనాశక్తి పెరిగాయో అట్లా ప్రజాశత్రువులైన రామభూపాల్‌రావు, వెంకటాద్రి, హైదరలీ కూడ ప్రతివిషయం ఐక్యంగా ఆలోచించడం, కామారెడ్డి, నిజామాబాదు అధికారులతో సంబంధాలు పెంచుకోవడం జరిగింది. వ్యవసాయం, పోలీసుశాఖ వ్యవహారాలకు సంబంధించిన ప్రభుత్వ నియమాల, చట్టాల మార్పులు, వివరాలు పట్టిపట్టి పరిశీలించడం, వానికి వ్యతిరేకంగా ఎవరు చేస్తారో కనిపెట్టి వారిపై చర్య తీసుకోవడం, న్యాయస్థానాల వెంట తిప్పటం మొదలుపెట్టారు.

ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న దానికంటె ఎక్కువ భూమిని దున్నారని, వాసజాలు నీళ్ళు వాడుకుంటున్నారని, గెట్టులను దున్నారని, కొలతరాళ్ళు పడిపోయాయని, అనుమతిలేకుండా ఇండ్లను మార్చి కడుతున్నారని, దున్నలకు ఎద్దులకు మూతాడు కట్టలేదని, కొమ్ములకు బొడ్డెలు వేయించలేదని, ఈ విధంగా ప్రజలను ఇబ్బంది పెట్టడం మొదలైంది. రామభూపాల్‌రావు ఈ చర్యలవల్ల గ్రామీయుల్లో అనుభవము, బాధ్యతలను గుర్తించడం అధికమైంది. (పే॥ 182)

ఈ సమయంలోనే నిజామాబాదులో ఆంధ్ర మహాసభ జరిగింది. కాని దీని ఆహ్వాన సంఘంలో రామభూపాల్‌రావు పేరుచూసి దిమ్మగూడెం ప్రజలు నోరుతెరిచారు. ఆర్యసమాజ ప్రధానివలెనే ఆంధ్ర మహాసభ పెద్దలు వ్యవహరిస్తున్నారని. అయితే వీళ్ళు గ్రామ వ్యవహారాలు తెలిసి కూడ కండ్లు మూసికొని ఉండడం పరంధామయ్యకు అన్యాయమనిపించింది.

నిజామాబాదు మహాసభకు రామభూపాల్‌రావు కచ్చడం, పనివాండ్లు, ఆడబాపవాండ్లతో వెళ్ళాడు. ప్రత్యేకంగా భోజనవసతి ఏర్పాటు చేసుకున్నాడు. పరంధా

మయ్య, విజయదేవులు, కొమురయ్య చంద్రయ్యలు కూడ వెళ్ళారు- గ్రామ సమస్యలపై జరిగిన చర్చలు వారికి చాల నచ్చాయి. కాని రామభూపాల్‌రావు సభలో పాల్గొనడమే వాండ్లకు అయోమయమనిపించింది. అందులో తమ స్థానమేమిటో తెలియక తికమకపడ్డారు.

'ప్రజల మనిషి' నవలలో భూమి సమస్య ప్రజల చైతన్యానికి భూమిక అని చెప్పడానికే ఇంత వివరంగా ఉదహరిస్తున్నాను. దీనికి శిఖరాయమానమూ, ఈ చైతన్యం ఆచరణరూపం తీసుకొని ప్రజా ప్రతిఘటనకు దారితీసిన ఘటన ఆ సంవత్సరం దిమ్మగూడెంలో జరిగిన చెరువు, చింతల హర్రాజు. దీనిని కూడ ఒక స్థాయిలో అభివృద్ధిని చిత్రిస్తాడు.

ప్రతి సంవత్సరం దిమ్మెగూడెంలో జరిగే చెరువు, చింతల హర్రాజుల్లో గ్రామ ప్రజలు కూడ పాటపాడాలని అనుకోవటమే కాని సమయానికి డబ్బు చేకూరక ముందడుగు వేయజాలలేదు- కాని ఆ సంవత్సరం మొదటినుండే జాగ్రత్తపడి డబ్బులు భద్రపరచుకొని సమయానికై నిరీక్షించసాగారు.

రామభూపాల్‌రావు, గిర్దావరు, వెంకటాద్రి, హైదరలీ కలిసి మామూలుగా ఆ సంవత్సరం కూడ రామభూపాల్‌రావుపేర పాటను ముగించారు- దొంగ పంజునామా జరిపారు- తొత్తులను సాక్షులుగాను పంజులుగాను పేర్లు రాశారు- వారిలో వారే చేతి ముద్రలు వేశారు- అంతా ఎవరికి తెలియకుండానే జరిగిపోయింది.

రామభూపాల్‌రావు నాగండ్లు చెరువు లోతట్టులో దున్నడం సాగగానే ఊళ్ళో కలవరం బయలుదేరింది- వెంటనే పరంధామయ్య విజయదేవులు రైతులను ఇతర ప్రజలను తీసికొని చెరువులోకి వెళ్ళి నాగండ్లను విప్పేశారు- దున్నడం ఆగిపోయింది- ఆ సంగతి తెలిసి రామభూపాల్‌రావు వణికిపోయాడు- ప్రజల సాహసానికి నిర్విణ్ణుడయ్యాడు- వెంటనే వెంకటాద్రిని కామారెడ్డికి పంపాడు- గ్రామంలో అశాంతిగా వుందని ప్రజలంతా దొమ్మీకి సిద్ధపడ్డారని, రామభూపాల్‌రావు ప్రాణం అపాయంలో వుందని పోలీసులకుచెప్పి పోలీసు సిబ్బందితో, మేజిస్ట్రేట్‌తో మరునాడు దిమ్మగూడెం చేరుకున్నాడు.[5]

---

5. ఒక్కసారి ఇక్కడ కొమురయ్య తోట భూమిలో రామభూపాల్‌రావు అరకలు కట్టినపుడు అన్నమ్మ ఒక్కతిగా అడ్డుపడిన ఘటన గుర్తుకు తెచ్చుకొని వచ్చిన ఈ మార్పును బేరీజు వేసుకోవాలి- అక్కడ హైదరలీ, దొర కొమురయ్యను కట్టేసి కొట్టి

— (మిగతా ఫుట్‌నోట్ పక్క పేజీలో)

ఆ వాతావరణంలో గ్రామ ప్రజల ఉద్రిక్తత హెచ్చిపోయింది. మేజిస్ట్రేట్, పోలీసులు రామభూపాల్‌రావు గడీలో ఉపాహారాలు, సమాలోచనలు జరుపుతుండగా ఊరి ప్రజలంతా ఆడమగ అంతా చెరువులో గుమిగూడారు. ఆడవాండ్లు పిల్లలతో ఒక చోట, మగవాండ్లంతా ఒక చోట గుంపుగా చేరారు. గ్రామమంతా నిర్మానుష్యమైంది.

మేజిస్ట్రేట్ పోలీసు సిబ్బందితో చెరువు లోతట్టుకు వచ్చి ప్రజలందరినీ చూచి నివ్వెరపోయాడు. "ఈ పరిస్థితి నాకే కొత్తగా వుంది. ప్రజలీవిధంగా కట్టుబాటు కొచ్చారా ?" తనకు తానే అనుకున్నాడు. వాళ్ళు 144వ సెక్షనుకు పోలీసులకు కూడ భయపడలేదు.

"ఈ చెరువు హర్రాజు ఎప్పుడు జరిగిందో ఎవరికి తెల్వదు. అన్యాయంగా రామభూపాల్‌రావు ఒక్కడే ప్రతి సంవత్సరం చెరువులో సేద్యం చేసుకుంటున్నాడు." — విజయదేవు.

"హర్రాజు ఫలానా తారీఖుని జరుగుతుందని చావిడికి నోటీసు కూడ అంటించ లేదు. ఊళ్ళో దండోరా కూడ చాటించలేదు." — పరంధామయ్య.

"సర్కారువి తనకే కావాలి, మందివి తనకే కావాలి." — కొమురయ్య.

"ఊళ్ళోకి వచ్చినోరు మమ్మల్ని కూడ విశారించకూడదా. దొర ఏది చెప్పితే అదే మీకు నమ్మకమైతే ఎట్లా పాడైద్ది." — చంద్రయ్య.

విజయదేవు పరంధామయ్యలయినా ఖానూనుప్రకారం హర్రాజు జరుగలేదన్న న్యాయశాస్త్రపరమైన పరిమితుల్లో వుండిపోయారుగానీ కొమురయ్య చంద్రయ్యలు దొర పెత్తందారీ దురాక్రమణ స్వభావాన్ని, ఆయనింట్లో కుడిచి ఆయన మాటలు నమ్మి ఆయనకు మద్దతుగా వచ్చే అధికారుల స్వభావాన్నే ప్రశ్నించారు. వీళ్ళ మాటల్లో వర్గచైతన్యం ధ్వనిస్తున్నది.

మేజిస్ట్రేటు శ్రద్ధగా వాండ్ల మాటలను వింటున్నాడు. పోలీసులను వరుసగా కొద్దిదూరంలో నిలబెట్టి, పోలీసు అధికారి మేజిస్ట్రేట్ పక్కకు విధేయుడుగా నిలుచున్నాడు. ప్రజలను ప్రతీకారంతో చూచాడు.

(ఫుట్‌నోట్ పక్క పేజీ తరువాయి)

ఆ కుటుంబ ప్రతిఘటనను ఓడించారు. కాని ఇక్కడ అసలు ప్రజల ప్రతిఘటనను తానుగా ఏమిచేయడానికీ దొరకు సాహసం లేకపోయింది. రాజ్యాంగ యంత్రం ఎందుకోసం వుందో దొరల, భూస్వాముల ప్రయోజనాలు కాపాడడం దానికెంత ముఖ్యమో ఇది దాఖలాగ వుంది.

"అవన్నీ నాకు తెలుసు- హర్రాజుకు సంబంధించిన కాగితాలన్నీ చూచాను- వాటి వివరాలు మీకుచెప్పితే లాభంలేదు- ఏది ఎట్లున్నా మీరీవిధంగా ఉద్రేకంతో ఉండటం గ్రామ శాంతి దృష్ట్యా చాల ప్రమాదకరం. కాబట్టి మీరు వెంటనే చెదిరిపోవడం మంచిది- మీకు అయిదు నిమిషాలు అవకాశమిస్తున్నాను- ఈ సంగతి మీ ఆడ వాండ్లకు చెప్పి ఇండ్లకు పంపించండి" అధికార ధ్వనిలో మేజిస్ట్రేట్ అన్నాడు.

ప్రజలకు ఏమీ తెలియదనుకునే అధికార అహంకార అంధకారము, భూమి సమస్యను శాంతి భద్రతల సమస్యగా మార్చి పక్కదారి పట్టించే కుట్ర, చివరకు బెదిరింపు మామూలే.

కాని ప్రజల కిప్పుడు సంఘటిత చైతన్యం వుంది- సమస్య పట్ల స్పష్టతవుంది- నాయకత్వం వుంది- వాళ్ళు నిలిచి ప్రశ్నిస్తున్నారు.

"గ్రామ క్షేమం, ప్రభుత్వ కర్తవ్యాలను మేము మరచిపోలేదు- కాని రామ భూపాల్‌రావు ప్రజలను ఈ విధంగా రెచ్చగొడ్తుంటె అతడిని అదుపులోపెట్టక మమ్ము లను బెదిరించడం ఎంతవరకు న్యాయం?" అని కనుక శాంతి భద్రతలపై ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి వుంటే అదుపులో పెట్టాల్సింది ప్రజలను కాదు ప్రజలను రెచ్చగొడు తున్న రామభూపాల్‌రావునని స్పష్టం చేసారు.

ప్రభుత్వం తన కర్తవ్యాన్ని మరచిపోతే ఇంక ప్రజలే తమ కర్తవ్యాన్ని ఎంచుకొని నిర్వహిస్తారని కూడ హెచ్చరించారు.

"దొరకింద నలిగి నలిగి, విసిగి వేసారి, ఎండు గడ్డివలె ఉన్నారు ప్రజలు- వాండ్లపై మీరు తుపాకులు కాలుస్తారా? ఎండుగడ్డి కాల్తె ఏమవుతుంది? కాబట్టి మీరు శాంతంగా ఆలోచించండి- ప్రస్తుతం ఈ భూమిని ఎవరు దున్నకుండా ఆపి వేయండి- హర్రాజు ఎప్పుడు జరిగింది? ఎవరు పంజులు? ఎవరు సాక్షులు? ఇవన్నీ విచారణ జరగాలి?"

ప్రజలు మొదటిసారిగా గెలిచారు- మేజిస్ట్రేట్ వాళ్ళ డిమాండ్ అంగీకరించక తప్పలేదు- "సరే, మీరన్నట్లే దున్నడం ఆపేస్తాను" అని బిలకానికి బెదిరించాడు- మూడు రోజులు 144 సెక్షన్ విధించాడు.

నాటి సంఘటన దిమ్మెగూడెం ప్రజలకు మరువరాని విషయమైంది- అంత మంది పోలీసులు ఒకవైపు; మొత్తం గ్రామం ఒకవైపు బలాబలాలు చూచుకోవడం,

రామభూపాల్‌రావు చెరువు దున్నడం ఆగిపోవడం, గ్రామీయులకు పట్టరాని ఊహింప జాలని సంతోషం కలిగింది.

ఈ వార్త పత్రికలకు కూడ ఎక్కింది– ఆ వార్తాపత్రిక దిమ్మెగూడెం వచ్చిన నాడు గ్రంథాలయమంతా జనంతో కిటకిటలాడింది, ఆ వార్తను కత్తిరించి ఒక అట్టకు అతికించి గ్రంథాలయం గోడకు వేళ్ళాడగట్టారు– ఎన్నోసార్లు చదివి వినిపించారు.

చెరువు హర్రాజు విషయంలో తహశీలు కచేరీలో విచారణ జరిగింది– అయితే తహశీల్దారు ఈ సంఘటనను పూర్తిగా స్వప్రయోజనానికి, రామభూపాల్‌రావును లొంగదీసుకోవడానికి వాడుకున్నాడు– మత ప్రయోజనానికి వాడుకున్నాడు.

"మీకు అగౌరవం జరిగినా అప్రతిష్ట కలిగినా ప్రభుత్వానికి కలిగినట్టే– ఇది మీకు మాత్రమే సంబంధించిన విషయమనుకోకండి– ....అసలు సంగతేమంటే మీ గ్రామ క్షేమం, మీ ప్రతిష్ఠను కాపాడటానికైనా మీరు హైదరలీ కలిసి వుండటం చాల మంచిది–" అని వాతలు పెడుతూనే రామభూపాల్‌రావు స్థానంలో ఆరు నెలలపాటు హైదరలీని పట్వారీగా నియమించాడు– గిర్దావరును ఉద్యోగం నుండి తాత్కాలికంగా తొలగించాడు– ఆ సంవత్సరం చెరువు హర్రాజు తిరిగి జరగదని గ్రామీయులకు తెలిసింది.

అదే సమయానికి కంఠీరవం విడుదలయ్యాడు.

దిమ్మెగూడెం చెరువు సంఘటన వార్తను చదివి (జెయిలు నుంచి విడుదలయి వచ్చాక వెంకటేశ్వరరావు వకీలు ఆఫీసులో పాత పత్రికలు తిరగవేసి) కంఠీరవం సంతోషంతో ఉబ్బిపోయాడు– పరంధామయ్య పట్టుదలతో తన గ్రామీయుల చైతన్య స్థాయి అంతవరకు పెరిగిపోవడం కంఠీరవానికి ఎంతో ఆనందం కలిగించింది– ఇక తన గ్రామం వెళ్ళక తప్పదని నిశ్చయించుకున్నాడు.

"దిమ్మెగూడెం నా జన్మస్థానమైంది– నిజామాబాదు నా కండ్లు తెరిపించింది– జేలు యాత్రాస్థలమైంది– ఇట్లా మారుతూ వుంది– ఇంకా ముందేమి కానుందో– ....నా హద్దులు పరిమితంగా ఉండటం సాధ్యం కాకపోవచ్చును– మా గ్రామం చెరువు వార్తను చూచారుకదా ! మా గ్రామ ప్రజలు ప్రశంసనీయమైన పని చేశారు– వారిని కలుసుకొని, కడుపునిండా మాట్లాడాలని ఆతురతపడుతున్నాను."

గ్రామం వదిలాక మొదటిసారి మత పరివర్తన కాలంలో దిమ్మెగూడెం వెళ్ళాడు కంఠీరవం– అంతకుముందే కొమురయ్య భూమిని దొర స్వాధీనం చేసుకున్న సంగతి

విని బాధపడ్డాడు కాని వెళ్ళలేదు- తాను స్వయంగా ఆ విషయంలో ఏమీ చేయలేదు- ఇప్పుడు మాత్రం తన గ్రామీయులు చేసిన భూపోరాటాన్ని పూర్తిగా బలపరుస్తున్నాడు- ఇంత తన గ్రామం వెళ్ళక తప్పదని వారిని కలుసుకొని కడుపునిండా మాట్లాడాలని నిర్ణయించుకున్నాడు- గ్రామానికి వెళ్ళి గ్రంథాలయానికే వెళ్ళాడు- గ్రామీయుల ఉద్యమంలో చేరాడు- రామభూపాల్‌రావు సరిగానే భయపడ్డాడు- "....చెరువు దున్నటం ఆగిపోయి నప్పటి నుంచి చంద్రియ్య, కొమురయ్యలు, వాండ్లను చూచుకొని ఊళ్ళో వాళ్ళు పట్టపగ్గాలు లేకుండా వున్నారు- ఎగిరిపడ్తున్నారు- వాండ్ల పెకలితనానికి మీవాడు 'సై' అంటే ఇంకా శివమెత్తుతుంది వాండ్లకు."

రామభూపాల్‌రావు ఏ పదజాలం ఉపయోగించినా కంఠీరవం ప్రజల చైతన్యానికి ఎగసన వేసాడు- "....ప్రతివారు పరిస్థితులను, మన కష్టాలను, కష్టాల కారకులను అర్థం చేసుకోవాలె- మన బాధ్యతలను గుర్తించి, హక్కులను సాధించుకోవాలె- అప్పుడు మన మీ స్థితినుండి బయటపడ్తాం- ఉత్తమ వ్యవస్థ ఏర్పడుతుంది- మన గ్రామం చెరువు వార్త పత్రికల్లో చూడగానే రెక్కలుంటే ఇక్కడ వాలాలనుకున్నను- మీ పట్టుదల, చైతన్యం వల్లనే అంతటి పనిని సాధించారు, తుపాకులు, పోలీసులు, అధికారము అన్నీ మీకింద పనికిరాలేదు- మీ స్థితిని వారు తెలుసుకోవడానికి ఇదే చాలు."

ఇంతవరకూ భూమి సమస్యపై ప్రజలు చైతన్యాన్ని ప్రదర్శించిన ఘట్టాలో ప్రజలు భూమిని సాధించుకున్న ఫలితాలు లేవు. అన్నమ్మ ప్రతిఘటన ఓడిపోయింది- ప్రజల ప్రతిఘటన హఠ్రాజునాపింది- అయితే ఇవి నిస్సందేహంగా మెట్లుమెట్లుగా ప్రజల చైతన్యస్థాయిని పెంచాయి- ప్రతి ఓటమి గర్భంలో విజయం దాగివుంటుంది- చైతన్యం పోరాటస్థాయిని డిగ్రీలుగా పెంచుతుంది- 99°దాకా నీరు గుణాత్మకమైన మార్పు పొందేది మామూలుగా అర్థం కానట్లే పోరాటంలో వచ్చే గుణాత్మక మార్పు కూడ స్థూలదృష్టికి అర్థంకాదు- గుణాత్మకమైన మార్పు గంతులుగా వస్తుంది.

— (ఇంకా వున్నది)

కథలు కావాలి

ప్రజా జీవితాన్ని, విప్లవ చైతన్యాన్ని సజీవంగా స్పందించే కథల కోసం సృజన రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నది.

జైరాంగారికి కొ. కు. గారి సమాధానం

ఆగస్టు 'సృజన'లో జైరాంగారు నాకురాసిన సమాధానం చూశాను– సుదర్శనం గారి 'భావ'వాదం నిశ్చయంగా తప్పే. మనసుకు స్పృహకలిగించే పదార్థమే వాస్తవం గనక మనసే గొప్పది అన్న ధోరణిని చిన్నపిల్లలు కూడా ఆమోదించరు. ముందు పదార్థం ఏర్పడి, తరవాత పదార్థంతోకూడిన మెదడు సహాయంతో మనసు పనిచేస్తున్నదన్నది కూడా ఎవరూ కాదనరు– సుదర్శనంగారు "పదార్థానికీ మనస్సుకూ సంబంధం లేనట్లు రెండూ పూర్తిగా వేరువేరు అయినట్టు" గందరగోళ పరిచారని విమర్శిస్తూ, అనుకోకుండా జైరాంగారు మళ్ళీ అదే పనిచేస్తున్నారు– చూడండి.

"ఎడారుల్లో తొలినాగరికతలు వెలియడానికి మనస్సు ప్రభావమే కారణమంటారా? పదార్థానికి అతీతంగాఉన్న మనస్సు ప్రభావమా అది?" అని అడుగుతున్నారు.

పదార్థానికి అతీతంగా మనస్సు ఉంటుందని నేననలేదు. కాని సరికొత్త చైతన్యానికి వెనక నూతన మానసిక చైతన్యం ఉంటుంది. ముందు శిల్పంగాని, రచనగాని వచ్చి అటు తరవాత దానికి సంబంధించిన భావం రాదు. తొలినాగరికతలు ఏర్పడిన నాటికి వాటికి నమూనాలేదు– అవి యాదృచ్ఛికంగా వచ్చినవీ కావు. అంటే ఎవరి మనసులోనో వాటి ఉత్పత్తికి తగిన కల్పనా, ప్రేరణా ఉన్నాయన్న మాటేగద. విప్లవ చైతన్యం లేకుండా విప్లవం రాదని మనం అనుకోవటంలేదా? ఇనప ముక్కను అయస్కాంతంగా మార్చాలంటే దానిలోని 'నలుసు' లన్నిటినీ ఏకోన్ముఖం చెయ్యాలి. ఇందులో వితర్కించదగినది ఏమీలేదు.

అసలు పాయింటు ఏమంటే తొలినాగరికతలను భావించిన మనసులు పూర్వానుభవంతో సంబంధం లేకుండా మనుష్యుల తలలోకి దిగినవికావు– భౌతికమైనమార్పులు జ్ఞానంలో కలిగే మార్పులకు కారణాలూ, ఫలితాలూ కూడా అవుతాయి. నేను జైరాం గారిని ఎదురు అడుగుతాను– తొలినాగరికతలకు మనస్సు ప్రభావం కాదంటారా? జైరాంగారు అడిగిన ప్రశ్న ఆయనకు తెలియకుండానే మనస్సునూ, పదార్థాన్నీ, ఏదో ఒక స్థాయిలోనైనా, వేరుచేసి చూస్తున్నాదనుకోవటంలో నేను పొరపడ్డానా?

"వెధవా అనే తిట్టు చేతనత్వంలేని ప్రాణిపై పనిచెయ్యదు– ఉదా: శవంపై."

తిట్టు శవంమీదా, గోడమీదా, నక్షత్రాలమీదా పనిచేసే సమస్య ఎందుకొచ్చిందీ? శవానికి మనసు లేదుగద. నేను మాట్లాడుతున్నది తిట్టుతిన్నవాడి మనసు వాడి శరీర పదార్థంమీద కలిగించే ప్రభావం గురించి. శవం ఉదాహరణ అనవసరం.

"ఒక అర్థాన్ని మరొక అర్థంగా, ఒక సందర్భాన్ని మరొక సందర్భంగా, ఒక విషయాన్ని మరొక విషయంగా తీసుకొని రకరకాల వ్యాఖ్యానాలు అలానే తయారవుతున్నాయి" అన్నారు జైరాంగారు. దీనితో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. ఈ అయోమయం నేను సరిచెయ్యటానికే ప్రయత్నిస్తున్నాను గాని, పెంచటానికి ప్రయత్నించటం లేదు. కాని అందరి గ్రహణశక్తీ ఒకేవిధంగా ఉండదుగదా!

పోరాట బా(పా)ట

ఉదయ్

ఓరోరి పాలేరోడా పాలేండ్ల పాలేరోడా
పాదేండ్ల పోరగాడివి ,, ,,
ఆడుకునే అయిసులోన ,, ,,
ఏడ్పుకుంట ఎడ్లగాస్తివి ,, ,,
బడికి పోయే అయిసులోన ,, ,,
బంతిగొట్టి అడ్లు వోస్తివి ,, ,,
సుక్కపొద్దు నాత్రి లేసి ,, ,,
మక్కజొన్న నీల్లుగడ్తివి ,, ,,
సేతులన్న మురదరకముందె ,, ,,
కాసెబెట్టి కుప్పగొడ్తివి ,, ,,
పటేలిచ్చె ఇరుస జొన్నలు ,, ,,
ఒక్కపూటకైన సాలవాయె ,, ,,
మడికట్టు దున్ని దున్ని ,, ,,
అంబటాల్ల కింటికొస్తె ,, ,,
గంజిలేదు బువ్వ లేదు ,, ,,
మండుకుంట ఎండుకుంట ,, ,,
పటేలుతిట్లు తినుకుంట ,, ,,
ఇరువాలు దున్నవోతివి ,, ,,
ఆరుగాలము రెక్కలిరిసిన ,, ,,
పాటేలు తిట్టవట్టే కొట్టవట్టె ,, ,,
ఊర్లపొంటి కతలన్నిని ,, ,,
సింగులుపెట్టి కాసెవోసి ,, ,,
పటేలుకు మర్లబడితివి ,, ,,
పోరాటము తొవ్వవడ్తివి ,, ,,

ఎర్రి జాతర్లు

వెంకన్న

తెలుగు బిడ్డ మేలుకోవోయి
రైతు బిడ్డ మేలుకోవోయి-

గంగ యమున కృష్ణ పెన్న గోదావరులు
కలవు నీ దేశాన ఎన్నో జీవనదులు
పొంగి పొరలుతు నదులు సంద్రాన
కలువంగా
మంచినీళ్ళే కరువు తాగబోతె నీకు
||తెలుగు||

ఎంతో భూమిని దున్ని చెమటోడ్చి నీవు
మన్ను బంగరు జేసి పంటల్ని దీశావ్
దొరల గుమ్ముల్లోన కనకాలు గురిశాయి
కరువుపై కరువచ్చె కష్టజీవి నీకు
||తెలుగు||

ఈ బొంచె బతుకును వదులుకుందామని
గనులెన్నో ఉన్నయని పనిజేయబోతేను
కూలి గిట్టకపాయె- కూడే సాలకపాయె
చుక్కలంటే ధరలు జీతాల మింగాయి
||తెలుగు||

ఎవరు ఈ దొంగలు దోపిడి దొరలంతా
ఈ భూమి నీదేరా, ఈ గనులు నీయేరా
దోపిడసలే ఇంకా సాగనివ్వద్దురా
సిరులు సంపదలన్ని ప్రజలవని చాటాలి
||తెలుగు||

రాబందుల గూడి బైరాగి వేషాల్తో
సోషలిజమంటు ఘోషపెట్టుకుంట

దేశ సంపదనంతా పందికొక్కుల్లాగా
మెక్కి మేస్తుంటేను చూస్తుకూర్చుంటావా
॥తెలుగు॥

కాలే కడుపుతోటి కన్నీరు కార్చుతు
ఈ బ్రతుకు బండిని ఎన్నాళ్ళు లాగేవు
ఏండ్లు గడిచినగాని ఏమి మిగిలిందోయి
బావుకున్నదేమి చావు సిద్ధమాయె
॥తెలుగు॥

ఆనాడు బందగిరక్తం చింది జ్వాలలులేచి
జాగీర్దారులను తన్ని తగిలేశాయి
కోరన్న మంగన్న రక్తమే చిందింది
భూస్వాము లందరిని పట్నమే పంపింది
॥తెలుగు॥

నిన్న గిరాయిపల్లి, చిలుకల గుట్టల్లో
మన అన్నల తమ్ముల్ల కట్టేసికాల్చారు
మన అక్కల చెల్లెల్ల మనముందచే
మానప్రాణాలన్ని మంట గలిపినారు
నిజం తెలిసి నిద్రపోవద్దు ఇంకా
కెరటాలుగ మనం కదలి సాగాలిరా
॥తెలుగు॥

మన రాజ్యమొచ్చేదాకా రణమే సాగిద్దాం
ఎర్ర జెండకే జై అంటు ముందుకే
సాగుదాం
జాతి వన్నె చిన్నెలే మారాలిరా !
ఇక ముందు ఎర్ర జాతర్లు సాగాలిరా
॥తెలుగు॥

బొయిల్దవ్వే బైరన్న

ఎన్నారెస్

కోల కోల కొల్చుకుంట
వంచిన నడుమెత్తకుంట
పెల్ల పెల్ల కూల్చుకుంట
యించుయించు తొల్చుకుంట
బానమోలె వంగిపాయెరో బైరన్న
బాయిలెన్నొ తవ్వితాడురో బైరన్న

పెటా పెటా ఎండలోన
ఖనేల్ ఖనేల్ గడ్డపార
తట్ట తట్ట యెత్తుకుంట
పట్టి గుట్ట పోసుకుంట
దొరాగారి దొడ్డిలోనరో బైరన్న
నూతులెన్నొ తవ్వితాడురో బైరన్న

ఊరులోన వాడలోన
గుడిలోన బడిలోన
కులము తలము యెంచకుంట
ప్రతి గడపా సొచ్చుకెల్లి
మంచినీల్ల కోసమయ్యెరో బైరన్న
బాయిలెన్నొ తవ్వితాడురో బైరన్న

కూలిపైన లడగబోతె
బైరన్న మావోడనె
బాయినీల్లు చేదబోతె
బైరన్న మాలోడనె
నీవు తవ్విన బాయినీల్లెరో బైరన్న
నీ దూపకు అందపేమిరో బైరన్న

మన చుట్టూ రోజూ మట్టిగరుస్తున్న

మానవతా విలువలు - 1

ముప్పై సంవత్సరాల రాములమ్మ తన ముగ్గురు పిల్లలను బావిలోకి విసిరి తాను కూడ దూకింది. పిల్లలు మునిగి చనిపోయారు కాని నీళ్ళు అంత లోతుగా లేనందున ఆమె చావలేదు. హత్యా నేరానికి, ఆత్మహత్యా ప్రయత్న నేరానికి ఆమె కోర్టుచే విచారించబడింది. హత్యకైనా ఆత్మహత్యకైనా ఆమెను ప్రేరేపించింది ఆకలి. ఆమెది హైదరాబాదు జిల్లా చేవెళ్ళ తాలూకా. కూలి చేసుకొని పొట్టగడుపుకునేది. అదీ సాధ్యంకాలేదు.

మార్చి 30వ తేదీన రెండవ ఆట సినిమా చూసి అహ్మద్‌హుస్సేన్ ఆయన భార్య రమేజాబీ తిరిగివస్తున్నారు. ఆమె వ్యభిచారిణి అనే అనుమానంతో పోలీసులు అటకాయించి పోలీసు స్టేషనుకు తీసుకెళ్ళి మానభంగం చేసారు. ఈ అత్యాచారాన్ని ఎదురించడానికి సాహసించినందుకు పోలీసుల చేతుల్లో తిన్న దెబ్బలకు అహ్మద్ హుస్సేన్ చచ్చిపూరుకున్నాడు.

తమ జీవన పరిస్థితులు కొంచెం మెరుగవాలని ప్రశాంతంగా ఆందోళన చేస్తున్న అంధ విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేసారు,

1400 మంది కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించినందుకు నిరసనగా బైలదిల్లా గని కార్మికులు 30వ మార్చి రోజున సంపూర్ణ హర్తాళ్ చేసారు. నిజానికి జాతీయ గనుల అభివృద్ధి సంస్థ లక్షమంది కార్మికులను తొలగించాలని ఆలోచిస్తున్నది. హర్తాళ్ చేస్తున్న కార్మికులపై పోలీసులు లాఠీచార్జ్ చేసారు. హింసించారు. కాల్పులు జరిపారు. స్త్రీలతోసహా ఎంతోమంది కార్మికులు గాయపడ్డారు. పోలీసు స్టేషన్‌లో అరెస్టు చేసిన స్త్రీల బట్టలూడదీసారు. ఈ సంఘటనతో బైలదిల్లా ప్రాంతమంతటా తీవ్రమైన వాతావరణ మేర్పడింది.

నీ చెమట పారజూసి
నీ నెత్తుటి దారజూసి
బండ గూడ మెత్తబడె
నీరిచ్చి ఓదార్చె
    దొడ్డగుండె కరగదేమిరో బైరన్న
    కటిక మొరం బూమి నయమురో బైరన్న

కొండలైన పిండిగొట్టె
ఆవేశం పిడికిలెత్తి
దొడ్డజాతి పెట్టినట్టి
హద్దులన్ని పడగొట్టె
    ఎలుగెత్తి నడవాలిరో బైరన్న
    నీ జాతి బలం తోడురో బైరన్న
    నీకు అడ్డు అపులేదరో బైరన్న

బస్తర్‌లో గని కార్మికులు నివసించే కిరండల్ ప్రాంతం వెళ్ళి వచ్చిన మోతీ లాల్ వోరా అనే శాసన సభ్యుడు ఈ సంఘటనల గురించి ఇలా చెప్పాడు–

"కిరండల్‌లో వున్న మూడు ముఖ్యమైన కార్మిక ఆవాసాలు కూడ శ్మశానాల్లా గయిపోయాయి– వందలాది గుడిసెలు నేలమట్టం చేయబడ్డాయి– పోలీసులు ఎంతో మందిని పిల్లలతోసహా నిప్పుల్లోకి విసిరేసారు– ఈ అమానుష చర్యకు గురియైన ఒక 12 సంవత్సరాల బాలిక శరీరమంతా కాలిన మచ్చలతో బతికింది– బైలదిల్లా ప్లాంట్ జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు, ఎన్ కె ఎం ఎస్ ముందు కూర్చున్న స్త్రీ కార్మికులు చెరచబడ్డారు– సాధారణంగా స్త్రీలు మానభంగాల విషయాలు చెప్పడానికి, చెప్పుకోడానికి సిగ్గుపడతారు– కాని ఇద్దరు స్త్రీలు ఈ విషయాలన్నీ చెప్పారు– వారిలో ఒకామెను ఆరుగురు పోలీసులు చెరిచారు."

ఇదే సంఘటనపై జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘు ఠాకూర్ ఇట్లా చెప్పాడు–

"అధికారులు ప్రకటించిన దానికన్న మృతుల సంఖ్య చాల ఎక్కువని మేం సేకరించిన సాక్ష్యాలు చూపుతున్నాయి– మృత దేహాలను పోలీసు బస్సులలో తీసుక వెళ్ళి కాల్చివేసినట్లుగా మాకు తగిన సాక్ష్యాధారాలున్నాయి– ఈ పాశవిక చర్యపై ముందుకొచ్చే సాక్ష్యాన్ని పోలీసులు, అధికారులు అణచివేస్తున్నారు."*

ఈ రాజ్యాంగ యంత్రానికి రాములమ్మను పేదరికం నుంచి కాపాడే 'శక్తి' మాత్రమే కాదు ఆమె చేసిన 'నేరాన్ని' సానుభూతిగా అర్థంచేసుకుని క్షమించే శక్తి కూడ లేదు.

చట్టాన్ని అమలు చేయవలసిన అధికారులు ప్రజల దృష్టిని అసలు విషయం నుంచి మరల్చడానికి రమేజాబీని వ్యభిచారిణిగా చిత్రించారు– నిమ్నవర్గాల నుంచి వచ్చిన స్త్రీకి పరాక పురుషునితో కలిసి ఒంటరిగా (జంటగా) అపరాత్రిలు వీధుల వెంట వెళ్ళే హక్కులేదు– ఆమె పేదరాలు గనుక, ఆమె నీతిదప్పిందే అయివుంటుంది!

ఇంక అంధ విద్యార్థులంటారా, వాళ్ళది అరణ్య రోదన– గర్వాంధులు వాళ్ళ మీద కర్రి ప్రయోగిస్తే నోరున్న మేధావులు నిరసన తెలుపలేదు.

---

* బెల్లంపల్లి బొగ్గు గనుల్లో కొత్తగా పెళ్ళి చేసుకున్న ఒక కార్మికుడు చన్నీళ్ళకు వేన్నీళ్ళతోడని భార్య రాజేశ్వరిని ఆఫీసర్ ఇంట్లో పనికి పంపించాడు– కార్మికుడు పనికి పోయిన రాత్రి రాజేశ్వరిని ఆఫీసర్ కొడుకు చెరిచి చంపి ఉరేసుకున్నట్లు చెట్టుకు వేళ్ళాడదీసాడు.

గుత్తపెట్టుబడిదారీ ఆర్థిక విధానంలో భారీ పరిశ్రమలు పనిచేసే తీరు తెన్నులకు నిదర్శనంగా వున్నది బైలదిల్లా సంఘటన.

రాజేశ్వరి ఉరేసుకొని చనిపోయిందని నమ్మమంటుంది యాజమాన్య సంస్కృతి.

ఇవన్నీ ఇటీవలి సంఘటనలు. చెదురుమదురు ఉదాహరణలే కావచ్చు కాని ఇవి ఒక స్వభావానికి మాత్రం మచ్చుతునకలు. రాజ్యాంగయంత్రం మానవ విలువలపై చేస్తున్న దాడికి, అత్యాచారాలకు వీటిలో ప్రతి వొక్కటి నిదర్శనమే.

'భారత గణతంత్ర రాజ్యాంగం' మానవ విలువలను కాపాడి పెంపొందించే విషయంలో అత్యంత జాగరూకత వహిస్తుందని పౌరులకు హామీ యివ్వబడింది. రాజ్యాంగం ఉపోద్ఘాతంలో వ్యక్తి ప్రతిష్ఠ, సౌభ్రాతృత్వం అనే అంశాలు కూడ చేర్చబడినాయి. రాజ్యాంగంలో ప్రత్యేక ప్రాధాన్యంలో రాయబడిన ఆదేశక సూత్రాల్లో మానవ గౌరవము (ప్రతిష్ఠ) అనే దృక్పథాన్ని విస్తృతంగా వివరించడం జరిగింది. ఆదేశక సూత్రాలనేవి దేశ పరిపాలనకు మౌలికమైనవని, చట్టాలు చేసేపుడు ఈ సూత్రాలను అన్వయించాల్సి వుంటుందని కూడ రాజ్యాంగం తన ఆదర్శంగా చెప్పుకున్నది. రాజ్యాంగయంత్రం శాసన, నిర్వహణ విధానాలను నిర్దేశించేవే ఆదేశక సూత్రాలు. ఈ ఆదేశక సూత్రాలు రాజ్యాంగ యంత్రం ప్రజలకు సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అన్ని రంగాల్లో కల్పించాలని రాజ్యాంగాన్ని ఆదేశిస్తున్నవి. రాజ్యాంగ యంత్రం ప్రజలకు మరీ ముఖ్యంగా బలహీనవర్గాలకు మరెన్నో సౌకర్యాలు కలిగించాలని చెప్పుకున్నది.

తానేర్పరుచుకొన్న ఎన్నో విధుల్లో చాలాముఖ్యమైంది పౌరులకు పనిహక్కును కలిపించుట, నిరుద్యోగంనుండి రక్షణ కలిపించుట, చదువుకునే సౌకర్యం కలిపించుట కాని "రాజ్యంయొక్క ఆర్థిక పరిమితులు, అభివృద్ధికి లోబడి" ఈ లక్ష్యాన్ని సాధించాలనడంతో పనిచేసే హక్కుఅనేది ఆర్థిక అభివృద్ధితో ముడిపెట్ట బడుతున్నది. ఆర్థికాభివృద్ధిని గురించి చెప్పడానికి మనకు కొన్నిఆర్థిక సిద్ధాంతాలున్నాయి. ఈ సిద్ధాంతాల ప్రకారం ఆర్థికాభివృద్ధి అనేది ఒక లక్ష్యాన్ని సాధించడానికి సాధనమేతప్ప దానికదే లక్ష్యం కాదు. దానికి కృషి, త్యాగమూ కావాలి. కాని కృషి అయినా త్యాగమైనా ఇదమిద్ధమైన కొలతలతో కొలవడం కష్టం. బహుశా దీనికొక అపవాదం మాత్రముంది. మనిషి పనిచేసిన పని గంటల కొలతతో మాత్రం దీన్ని అంచనా వేయవచ్చు. కాబట్టి మానవ శ్రమతో అనుబంధంగా ఆర్థిక గతిని నిర్ణయించవచ్చు. ఆర్థికాభివృద్ధి, ఆర్థిక ప్రగతికి సంబంధించిన విధానమంతా వ్యక్తుల చేతుల్లో పెట్టి

సంక్షేమ రాజ్యాంగం ప్రజల కష్టాల్ని తొలగించడానికి పూనుకుంటాననడం విచిత్రంగా వుంది. అందువల్లనే తత్వశాస్త్రం యొక్క పేదరికం (Poverty of Philosophy) లో మార్క్స్ చెప్పిన మాటలు ఈనాటికీ నిత్యనూతనమయినవి.

"యంత్రానికి మనిషిని బానిసను చేయడంతో తమ శ్రమవల్ల మనుషులు తామే తుడిచిపెట్టుకపోయే పరిస్థితి ఏర్పడుతున్నది. రెండు రైలింజన్ల వేగాన్ని కొలిచే గడియారపు ముల్లే ఇద్దరి శ్రామికుల క్రియాశక్తిని కూడా కొలవడానికి సాధనమవుతున్నది. అందువల్ల మనం ఒక మనిషి గంటకన్న ఇంకొక మనిషి గంట ఎక్కువ వుపయోగకరమైనది అని అనలేం. ఒక గంటలో ఒక మనిషి ఎంత వుపయోగపడ్తాడో యింకొక మనిషి అంతే వుపయోగపడ్తాడు అనవలసివస్తుంది. కాలమే సమస్తము. మనిషి ఏమీ కాదు. ఎక్కువలో ఎక్కువ మనిషి కాలం యొక్క అవతారం. గుణానికి విలువలేదు, పరిమాణమే అన్నిటినీ నిర్ణయిస్తుంది. గంటకు గంట రోజుకు రోజు."

మనిషి తన శ్రమనుంచి వేరుచేయబడుతున్నాడు. అతడి శ్రమ ఒక వినిమయ వస్తువుగా చూడబడుతున్నది. అతని శ్రమశక్తి మార్కెట్లో ఒక సరుకుగా అమ్మబడి అతని పరిపూర్ణ వ్యక్తిత్వానికి పోటీగా నిలుస్తున్నది. ఈవిధంగా ఒక కార్మికుడు "తన శ్రమశక్తికి యజమానిగా, అది ఒక వినిమయ వస్తువుగా అమ్ముకుంటున్నాడు. శ్రమశక్తి ఒక్కటే అతని ఆస్తి అయినట్టు అతని ప్రత్యేక పరిస్థితి నిర్వచించబడుతున్నది. సమాజం మొత్తంలోని భాగంగా చూసినప్పుడు అతని స్థానం ఒక ప్రత్యేకమయిన నమూనాగా కనిపిస్తున్నది. మానవ విధి ఒక వినిమయ వస్తువుగా పరివర్తితమైన ఈ స్థితి నగ్నంగా అంతటా కనిపిస్తుంది. వస్తు మారక సంబంధాల్లో వుండే టటువంటి మానవతా రాహిత్యం, మానవతా రహిత విధులు ఇక్కడ స్పష్టమవుతాయి." (చరిత్ర - వర్గచైతన్యం (History and class conciousness) లూకాస్) ఈ వినిమయ వస్తువు అనే సంకెళ్ళతో మనిషి నిండు మనిషిగా కాకుండా భాగాలుగా విభజింపబడుతున్నాడు. ఈ భాగాలలో మానవుడు తన మానవ సంబంధాలను నిలుపుకోగల సహజమైన రూపాలు లేకుండా పోతున్నాయి.

దోపిడీ సమాజంలో రోజురోజుకూ పెరుగుతున్న వైరుధ్యాల్లో ఈ భాగాలు మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉత్పత్తి సంబంధాలు వీటిని నిర్ణయిస్తున్నాయి. బూర్జువా రాజ్యాంగ యంత్రం ఎప్పుడూ వేతనాలను క్రమబద్ధంచేసే ఆలోచనే చేస్తుంది కాని మానవ సంబంధాలను క్రమబద్ధం చేయాలని ఆలోచించదు. ఇందువల్లనే సరియైన వేతనాలు మొదలైన విషయాలు నిర్ణంచటానికి కమిటీలు వేయడం మనకు కనిపి

స్తున్నది. మానవుని అవసరాలను అంచనావేసే విషయంలో కూడా మానవ శ్రమను ఒక మార్కెట్ వస్తువుగా చూసే ఈ ఆలోచనా సంకెల పనిచేస్తూ వుంటుంది.

"శ్రామికుడు అనే గుణవాచకాని (abstract noun) కి అవసరమైన ఆహారం తిరిగి పప్పు దినుసులనీ, ధాన్యమనీ కొన్ని కాలరీల్లోకి విభజింపబడుతున్నది. ఫలితంగా మనిషి (కార్మికుడు) తన జంతు విధులు నిర్వహించడానికి సామర్థ్యాన్ని పొందే సౌకర్యాలు పొందుతున్నాడు. అందువల్ల తన మానవ విధుల్లో తాను జంతువు తప్ప ఏమీ కాదని అనుకునే స్థితికి మార్చబడుతున్నాడు. తినుట, తాగుట, లైంగిక సంబంధాలు తప్పకుండా మానవ విధులే. కాని ఇతర మానవ క్రియ లన్నిటి నుంచీ వేరు చేసి ఇవే ఏకైక అంతిమ లక్ష్యాలుగా మార్చబడినప్పుడు అవి జంతువు విధులే అవుతాయి." (మార్క్స్)

ఇట్లా మనిషి నుంచి మనిషి శ్రమను వేరుచేసి శ్రమనొక సరుకుగా మార్చిన సమాజంలో మనిషి రాజకీయ జీవితాన్ని కూడా రాజ్యాంగమనే 'పవిత్ర గ్రంథం' లో కొన్ని "పవిత్ర ఆదేశిక సూత్రా"ల కింద మార్చేసి మానవుణ్ణించి వేరుచేసినారు.

"మేము భారత ప్రజలము.... ఇందుమూలంగా అనుసరించి రచించుకొని ఈ రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకొంటున్నాము."

కాబట్టి ప్రజల ఆశలూ ఆకాంక్షలూ అన్నీ ఒక ప్రాణంలేని దస్తావేజుల్లోకి మారి పోతున్నాయి. ప్రజల అత్యున్నత అధికారం భద్రంగా దాచిపెట్టబడిన 'పవిత్రమైన గ్రంథం'గా ఆ దస్తావేజు ప్రజల తలలపై బరువుగా నిలుస్తున్నది.

రాములమ్మ అభ్యర్థన, రమేజాబీపై జరిగిన అత్యాచారంపై ప్రజల ఆగ్రహం, అంధ విద్యార్థుల ప్రదర్శన, బైలదిల్లా కార్మికుల సమ్మె, రాజేశ్వరి పురిపై బెల్లంపల్లి కార్మికుల ఆగ్రహం. ఇవన్నీ ప్రభుత్వం ప్రజలపట్ల నిర్వహించవలసిన మౌలిక బాధ్యతలకు హెచ్చరికలు. ఈ అన్ని సందర్భాల్లో కూడా ప్రజల్లో ప్రబలిన అశాంతి ప్రభుత్వం శాంతిభద్రతల సమస్యగానే చూసింది. అన్ని సందర్భాల్లోకూడా ప్రభుత్వం పాశవికమైన అణచివేత విధానాన్నే అనుసరించింది. ఎందుకు ? రాజ్యాంగం కూలి పోతుందని ? కాను తాదు 'పవిత్రంగా' చెప్పుకున్న ఆదేశక సూత్రాలను అమలు చేయలేక.

ఇవి విడిగా కొన్ని చెదురుమదురు సంఘటనలు కావు. పురుకుల పరుగుల స్వార్థపూరిత మన పోటీ వ్యవస్థలో మన స్వార్థ భద్రత కూడా తన ఉత్ప్రేక్షి తల

ఎత్తి చూడక తప్పని సంచలనం కలిగించిన సంఘటనలు- కాని మన సమాజంలోని 'భద్రలోకానికి' ('మేధావు'లకు) యివి పట్టించుకొనే సమయంకానీ, మానవ విలువలపై జరుగుతున్న దాడిని ఎదుర్కొనే శక్తికానీ ఏవీ? ఎప్పుడో ఇటువంటి సంఘటనలు అసాధారణమైన ప్రజా ఆగ్రహాన్ని రగిల్చినప్పుడు అప్పుడు మనం తలెత్తి చూస్తాం- కాని రాజకీయ చైతన్యమనేది కొన్ని నీతి వచనాలు వల్లించటంవల్ల రగుల్తొనేది కాదు- శాస్త్రీయ సామ్యవాదం మాత్రమే మానవ ప్రతిష్ఠనూ, విలువలనూ నిలిపి మానవతా సమాజాన్నీ సామాజిక మానవతనూ ఆవిష్కరిస్తుంది.

[ఒక సెమినార్‌లో తార్కుండే కమిటీ కన్వీనర్, సుప్రసిద్ధ న్యాయవాది కె. జి. కన్నబిరాన్ గారు చదివిన వ్యాసం ఆధారంగా]

☆

మానవుడు భవిష్యత్తులో కూడ జీవిస్తాడు- నిరంతరం చలిస్తూ వుంటాడు అనే విషయం గుర్తించని 'జనతా' ప్రభుత్వాలు అతని భవిష్యత్ జంగమ స్వభావాన్ని నిర్ణయించడానికి భూతలింగం కమిటీలు వేస్తాయి!

వెలిగించుకోవాలనుకుంటే
నీ గుండెనే ఒక కాగడా,
వెదుక్కోనక్కరలేదు
నీ చేతులే ఒక కొరడా!

— అలిశెట్టి ప్రభాకర్

★

రక్తదానం

మా నెత్తురు పీల్చి పీల్చి
మత్తెక్కిన మీరు, ఒళ్ళు బలిసి
ఎప్పుడో ఒకప్పుడు
కాస్తంత రక్తం వదిలించుకుంటే
ఔరా, ఎంతటి పబ్లిసిటీ మీకు!

ఎన్. ఎన్. నాయకర్

భూమి కోసం

(యక్షగాన నృత్యరూపకం)

రుద్రజ్వాల

పాత్రలు :	వయస్సు :		వేషధారణ :
1. సూత్రధారి			తలపాగా, పంచె, చొక్కా, చెప్పులూ, గిల్టుంగరాలు
2. ప్రెసిడెంటు	40 సం॥		ఖద్దరు పంచా, చొక్కా, టోపీ, మెళ్లోదండ, చేతిలో వొంకి కర్ర, కాళ్ళకు చెప్పులు
3. రాజయ్య	40-50 సం॥ మధ్య		అంతా తెల్లడ్రెస్సు, అప్ప్లాకు టక్ చేసుకుంటాడు- తెల్ల కళ్ళజోడూ, ఫుల్ బూట్సు
4. సుందరన్న	50-60 సం॥ మధ్య		అఫ్ ఎర్రచొక్కా, పైజమా కళ్ళజోడూ, చెప్పులూ.
5. ప్రజానాయకుడు	50 సం॥ మధ్య		పంచా, చొక్కా, కోటూ అఫ్‌బూటూ, టోపీ, తెల్లకళ్ళజోడు
6. అబ్బురాం	30-40 సం॥ మధ్య		బనీనూ, పంచ
7. యాకోబూ	దాదాపు 30 సం॥లు		బనీనూ, పంచ
8. సింగన్న	30 సం॥	(రైతు కూలీలు)	బనీనూ, పంచ
9. దావీదు	50 సం॥		పంచ, తలగుడ్డా

గమనిక: సూత్రధారి, సుందరన్న, రాజయ్య ఒక్కరే వేయవచ్చు.

[తెరలో]

(నేపథ్య జోహారు గీతం - ఆటతాళం)

శరణు తెలంగాణా రైతా।
శరణు నక్సాలూరీ రైతా।
శరణు శరణు మీకే శరణన్నా
ఓ తెలంగాణన్నా.... నక్సాలూరన్నా
శరణు శరణు మీకే శరణన్న ॥శ॥

కూలిచేసే బతుకుల్లోనా
కొత్త పొద్దూ నిద్రా లేపీ
కోర్కె పండే దారే తెలిపేరా

ఓ రైతన్నలార
పోరుమార్గము కనులా చూపేరా ॥ఓ॥

కాలికూలే రైతుల్లోనా
కొత్త శక్తి ప్రోదిసేసీ
కోన కోనా సేనా నడిపేరా, ఓ రైతన్నలారా
రైతు రాజ్యము కొరకే పోరేరా ॥ఓ తెలంగాణన్న॥

సంధి: అని యివ్విధంబున తెలంగాణా నుండి నగ్జల్‌బరీ దాక భూమికోసం పోరాడి భూమిమీదొరిగిపోయిన అమరవీరుల స్మరించిన తదనంతరంబు సూత్రధారుడు వచ్చు విధంబెట్టిదనిన_

(తెరముందుకు సూత్రధారి ప్రవేశిస్తాడు)

పాట: (ఆదితాళం)

సూత్రధారుడు వెడలే చిరు గజ్జెలు ఘల్లన ॥సూ॥
కన్నుమూత కాల్మొంది నూకగా
మత్తుగిత్తు పాల్మాలిక లొదలగ ॥సూ॥

పకపక నగవూరేప, పరధ్యానము తొలగగ
ప్రజలూ ఓహోలూ తెల్పగా
పిల్లా_జెల్లా అల్లరాపగను
పెద్దలు గద్దలు పిసుక్కు_సావగ ॥సూ॥

అటునిటు కొంగూలాడ_ అభినేయము నెరపగ
పంచ పాదాలు తాకగా
శిరమున పాగను చెలువుగ జుట్టియు
కరమున గిల్టుఉంగరములు మెరవగ ॥సూ॥

వచనం: ఓయి రైతన్నా!

రైతు_ వచనం: యేమి సామీ, యేమి సెలవు?

సూత్ర_ వచనం: రైతన్నా! కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు, పేదా సాదా విచ్చేసిన యీ సభను మన ముత్తేజపరచవలెను గదా?

రైతు_ వచనం: ఔను సామీ, ఔనౌను.

సూత్ర-వచ: ఇపుడు మనము భూమికోసమనే యక్షగాన రూపకమును ప్రదర్శింప బోతున్నాము- కాన మీరందరు సావధానంగా చూచి ఆలోచించమని కోరు చున్నాను- ఇక నేవెళ్ళివచ్చెద.

(సూత్రధారుడు లోనికేగగానే తెర తొలగుతుంది- పెద్ద గాంధీ క్యాలండరు గోడకుంటుంది. దాని పక్కనే స్టూలు- స్టూలుపై బ్రాందీ సీసా పెట్టి వుంటాయి- రెండు కుర్చీలుంటాయి.)

సంధి ; అంత యిందూరు గ్రామ ప్రెసిడెంటు వచ్చు విధంబెట్టిదనినా....

(ప్రెసిడెంటు ప్రవేశము)

పాట ; (అటతాళం)

పెసిడెంటు చనుదెంచెనూ, యిందూరు గేమం ॥పెసి॥
పెసిడెంటు చనుదెంచె పొందూర్
ఖద్దరూ రెప రెపా లాడగ
ధగద్ధగమను తెల్లటోపీ- దీటుగా పూదండ వెలయగ ॥పెసి॥

కాపు పెద్దలు పొగడగా
అలగా కుంకలు దారి కొదిగీ బెదరగా

మిత్రం : పోతుగున్నా కన్నెపిల్లా, సందుగొందులు దూసుకోగా,
మూతిమీసం మెలీ దిప్పుచు
పొన్ను గర్రాడిచ్చుకొంటూ ॥పెసి॥
(గాంధీ క్యాలెండరుకు నమస్కరిస్తూ)

వచనం: బ్రాందీ మహాత్మా ! (నాలక్కరుచుకొని) అర్నీయమ్మ కాదు కాదు గ్యాంధీ మహాత్మా !

పాట: (ఆదితాళం)

సామీ వందనము లివ్వే సొతంత్రము
బహు నాజూగ్గా తెచ్చిన గ్యాంధీ
కాలివేసమేసీ గమ్మత్తుగ
గద్దె మాకు దక్కిచ్చిన దాతా ॥సామీ॥

నిన్ను నిత్తెమూ జపిచ్చినందుకు
నగరంలో బిల్డింగు లిత్తివి

ఇరవై యెకరాల్ నీ దయసూపే
ఇరవై పదులకు పెంపుసేత్తివీ ॥సామీ॥

(కుర్చీలో కూర్చుంటాడు)

సంధి: అంత నా ప్రెసిడెంటు ఆ గ్రామ రైతుకూలీలు భూమిని ఆక్రమించినారని ఆగ్రహంబున వారికి కబురంపగా, వారు వచ్చి విన్నవించుకొను విధానం బెట్టిదనినా....

(యాకోబూ, అబ్బురాం, సింగన్న ప్రవేశము)

పాట: (ఆటతాళం)

బాబూ మమ్ము మీకడకేల
పిలిపిచ్చింది యెరిగిచ్చరే
యేందీ కాపులట్టున్నర
యింతా జాగు ఐనాదనా ॥బాబూ॥

తుమ్మల బీడు దున్నాతంటే
తమ మడిసొచ్చి రమ్మన్నడు
అరకాగట్టు సేరంగనే
అదరా బదర యిటులొచ్చినాం ॥బాబూ॥

ప్రెసిడెంటు: (కందార్థము)

ఎపుడిదిరా తుమ్మ సెరువు ?
ఎవుడిది దాన్కింది బూమి ? ఎవుడిచ్చిండ్రా ?
ఎవుడిదని దాన్లొ దిగితిరి ?
ఎవుడుర ఆ లమ్డికొడుకూ యిటులా సేసిందీ.... ?
ఇవరంగ సెపుడీ యెట్టా సేసిందీ.... ?

మిత్రం: గేమగేమం తెల్సునాదని
గేపకం లేకండ బోయెన ?
గ్యానముండే సేసినారా ? కళ్ళుకావర మెక్కినాదా ?
యిటులా సేసిందీ....
యివరంగ సెపుడీ యెట్టా సేసిందీ ?

వచనం: యేమండ్రా కూలి నా కొడకల్లార సెప్పరేం ?

రైతు కూలీలు - పాట : (అటతాళం)

యినండి దయసేసీ సెపుతము ॥ఇనండి॥

గవరమెంటు బూమి త్తసన్నదని
కాళీగుందని యెత్తిమి బాబూ ॥ఇనండి॥

సెట్టూ కంపా కొట్టుకొన్నమూ
మిట్టా పుట్టా సదును సేసితిమి
పొద్దుగూకులూ రెక్కలు పిండీ
పొలమాకారం పట్నుతున్నమూ ॥ఇనండి॥

అరిజన గిరిజన బలయీనులనూ
అమ్మే సల్లగ సూత్తన్నదని
అమ్మపేర్ల మీరండ నుంటరని
నమ్మిసేత్తిమిడి యింకేమి ఎరగము ॥ఇనండి॥

ప్రెసిడెంట్ వచనం: అమ్మా, అమ్మ, అమ్మ- ఓర్నీయమ్మ బలే లంకిచ్చుకున్నార్రా యీ పదం. వురే! నాకు తెలీకడుగుతా యీయమ్మ యెవురమ్మను కుంత న్నరు?.... మా అమ్మరా. మా బూములు ఆమె పంచటమా? పిచ్చి సన్నా సుల్లార, అదే నిజమయితే మేమంతా ఆమెంబెందుకుంటంరా? మేము లేంది ఆమెమాత్తరం యాడ్నుంచుంటది? అందుకని, మీరు సెట్టూ, సేమా గొట్టి, మడిసిమీన మడిసిబడి, ఎగుడూ, దిగుడూ సదునుసేసినా, తాతముత్తాతల కాడ్నుంచి మా కిందున్న బూమి మీక్కాదు- అట్టా కాటానికిల్లేదసలు- యిది లా పాయింటు. నా యిసయం పక్కనపెడ్దాం- మొన్న పాపారావు పాడుబడ్డ బూమిలోకి మీ మాలా మాదిగోల్లె యెల్తే యేమయిందీ? యేమయింద్రా! అదు కాకిశాత కబురుసేత్తే కాకిబట్టలోల్లంతా పరిగెత్తుకుంటావచ్చి, పరిగెత్తిదాంకా మీవోల్లని కొట్లా? (నవ్వి) అందుకని నాయాల్లార! అమ్మ పలుకు పచ్చి సచ్చెమని యెర్రాశలు పెంచుకోకా, కొత్తబుద్ధిగా వుండండి- అది మాక్కాదురా మీ వొంటికే మంచిది.

రైతుకూలీలు - పాట (ఆటతాళం)

అయ్యా బీడనీ మేమూ పోతిమీ - అంతా బాగుసేత్తిమీ
అలసటా మర్సి ॥అయ్యా॥

సాగులేని మిగులు సూత్తిమీ - సెమనూ దారా వో త్తిమీ
పొద్దూ సూడక ॥అయ్యా॥

ప్రెసిడెంటు - పాట (అటతాళం)

మిగులూ బూములు ఎక్కడరా
కుక్కలకొడకా ॥మిగులూ॥

పిల్లలా బాగం కిందా, పందా యెకరం పోతే
దంపతులు యేరేగుంటే ముప్పది మాకేవత్తే ॥మిగు॥

మిత్రం : పసుపు పంటకు కొంతయును
నారింజా- మామిడీ, కొబ్బరి
జీడి మామిడి, సపోటా, పనసతోటల కంతపోతే
॥మిగు॥

వచనం: వరేయ్! నా దొబిలేసినా, వోలిండియా మొత్తమ్మీన మీకు్కంట సీలిక్కూడా రాదురా- సెరుకు తోటలకిందదీ రాక, యాపారిప్పంటల కింటదీ రాక, పార్టీలూ, పరిశ్రమలూ, దేముళ్ళ కిందున్నయ్యీ రాక, యేందిరా మీకొచ్చేదీ? వత్తదీ, గిత్తదీ అని ఎదురు సూసీ, సూసీ కల్లతీపుల్తప్పా? ఐనా- వకేల వుత్తపలాన మేమొప్పుకోని మా బూములు మీ కిచ్చేదామన్నా దీందుంపతెగిరి, మా పెద్దోల్లు రాసిన రాజ్జాంగం వుంది సూడూ, అది అరిసిసచ్చినా వొప్పుకోదు. అదో లెనిన్ బవుమతి సందిన మీ కాంగ్రేసేడు రాజయ్య, ఆవు ముద్దెనకాలే, ఆవు దూడ తంతన్నా గునుసుకుంటూ, పడతా, లేత్తా యిటే వత్తన్నాడు అర్నే అడగండి- అన్నీ సెపుతాడు.

సంధి : అంత కాంగ్రేసేడు రాజయ్యగారు విచ్చేయు విధంబెట్టిదనినా....

పాట : (ఆదితాళం)

రాజగారూ వచ్చేరథన్నా - రొప్పుకుంటూ, రోజుకుంటూ,
ఆవు తోకా గట్టిగబట్టి - అడ్డమైనా తోవలుసుట్టీ ॥రాజ॥

కళ్ళు మూసీ, కాళ్ళను సాసీ, కీళ్ళతీతలు గాలికి తోసీ
కాలితాపులు. కొమ్ముల కుమ్ములు కష్టజీవులా కొరకుథరించీ ॥రాజ॥

వచనం : (రొప్పు ఆపుకుంటూ) నమస్కారమండి ప్రెసిడెంటుగారూ।

ప్రెసి-వచ: యేకారం? నమసకారమా। నాదీ అట్టగే వుంకోటేసుకొని కూకోండి.

రాజ-వచ: (కూర్చుంటూ) యేంటండీ మన విషయాలు?

ప్రెసి-వచ: మన యిసయాల కేముంది గాని ముందీన్నది సూడండి- అడగండ్రా మీ నాయకుణ్ణి.

రైతుకూలీలు - పాట (ఆదితాళం)

పేదల నాయక సెప్పడి మీ నోటా
బడుగువోల్లకూ
అమ్మ యిచ్చిన బూముల యవ్వారం?

మిత్రం: పెద్దవోల్ల బూములమ్మె పోనీకండా సూత్తదాని
పెద్ద కాపు పలికినాది పదిలమంటరా
యెన్నోనాల్ల నుంచి మీరు - యిన్నపంసేసేటి యిదము
యేమరిల్ల కిపుడుమీరు - యిప్పిసెప్పు డింకనైన ॥పేద॥

రాజయ్య-వచనము: యేంటీ మీ పార్టీ అభ్యుదయ అంశాల్ని చెప్పటానికి మొగమాటం గుందా మీకూ? నేనే చెప్తా- వినండి- మీరూ వినండ్రా.

బుడబుక్కల చెంచులకూ
అడలెడి సంచారులకును అంతో, యింతో
కడు దయ పంచెను బంజరు
బడుగులకే అమ్మయనగ బాధలు బాపెన్
పెడపెట్టకుండా - యెంతో సాకున్

మిత్రం: మూలమూలలనున్న భూముల మూలముల లెక్కలను దేల్చి
దేశమున భూసంస్కరణలు దీనులకె అందేట్టు సేసెను
ఎడపెట్టకుండా - సాకెన్ పేదల ఎడపెట్టకుండా.

ప్రెసి-వచ: యేందేంది బూములు అమ్మ అనదల కందిత్తున్నదీ అంటవు? వోర్నీ యమ్మ బలే సెప్పినవయ్యా.

రాజ-వచ: అన్సలీయ నేదంటారా మీరు?

ప్రెసి-వచ; అమ్మమ్మ! అట్టెట్టంటను? యిత్తే యెంతిచ్చినరు? వక్కుంటా, లేకపోతే గోసిపాతంత సెక్క, అది వూరక్కాడూ, పుచ్చుకున్నోడు పదేను కిత్తాల్లో బూమిలవనుబట్టి మా గవరమెంటుకి నట్టపరియారం సెల్లిచ్చుకోవాల. యే కిత్తా దీయకపోయినా, అదింకోడికి యిస్తలో నీల్లల్లే, చేతిలోంచి జారిపోద్ది- అడీయ

కుంటే యింకోడి కింకోడి కింకోడికి యిచ్చినట్టు కాయితాలకేసిన సెక సెకా, దళిత వరగాల పునరుద్ధరణ జరిగిపోతాయనే వుంటది, బూముల నట్టపరియారం అంజి నీలసోమి తోకలాగా పెరగతానే వుంటది. ఇదండీ, మమ్మకొత్తన్న బూసంసకరణలు- యివరం తెల్సిందా ?

రాజి-వచ: అయితే యెన్నికలపుడు బలహీనవర్గాలకోసం తమ పార్టీ చెప్పిందంతా.

ప్రెసి-వచ: బలయీన వరగాలా (నవ్వుతూ) ఓర్నీయమ్మ వొస్తాదు కొల్లుబట్టేవోడే- బస్తీమె సవాలన్నట్టుంది నీ వాలకం. మేం కాదన్నా కాతర జేసేట్టు లేదే నువ్వు! సూత్తుంటే మా కన్న నువ్మే బాగా ఒంటబట్టిచ్చు కున్నట్టుందీ మాటలు. ఎలకసన్ల ముందెన్నో సెపతాం తరవా తెవడికీ గ్యాపకముంటయ్ సెప్పండీ. అయినా నీమాటకే వద్దాం- యిపుడు సీటుమీదునోళ్లెవురో సెప్పు ?

రాజ-వచ: మీవాళ్ళే.

ప్రెసి-వచ: అంటే.

రాజ-వచ: అమ్మపార్టీవాళ్ళు.

ప్రెసి-వచ: ఆర్నీయమ్మ అదికాదయ్యా నేనడిగేదీ, మేమెవురిమీ అని ?

రాజ-వచ: కులమా ?

ప్రెసి-వచ: అరెరే! యిదిగూడా మర్సిపోయేంత 'యిది'లో వున్నావంటే నాకే యిసిత్రంగా వుంది- సరే నేనే సెప్తాలే- మేమెవురిమీ అంటే బూ....సా.... ములం- తెల్సిందా ?

రాజ-వచ: అవునవును.

ప్రెసి-వచ: అవునవునుగందా- సూత్తా సూత్తా మా బూము లీల్లకిచ్చేత్తామా ? యేదో పొరపాట్న మాపైనోల్లు సట్టాలూ, పట్టాలని సంసకరణలకి సందిచ్చినా, కింద బూ పంపకం కమిటీల్లో వుంచిందెవుర్ని ? నన్నూ నావాళ్ళనీ నిజమా? కాదా? యేందట్ట మిడిగుడ్డేసుకోని సూత్తావ్ ? పెజలంటే మేమెంత పేమ సూపిత్తన్నా కట్టార్జితం బూముల్ని వొదిలేసుకోమంటవా యేంది ?

రాజ-వచ: అట్లా నేనెందుకంటానూ- కానీ అమ్మె చెప్పిందంతా....

ప్రెసి-వచ: వోర్నీయమ్మ నీవెట్ట కమ్మినిటువంటా ? ఎదట యెలట్రీ బలుపల్లె బూసంసకరణల తతంగం కనబడతంటే కళ్ళకి గంతలు కట్టుకుంటా నంటావా

యేంది? అందుక్కాదూ అమ్మెంట నీవు నడిపిత్తే నిన్నొదిలేసి జనమంతా బోలోమని ఆమెనక నడుత్తాంది- ఇప్పటికైనా సిగ్గుతెచ్చుకోనీ కూర్జేసుకోని కులాసాగ్గ బతికేవోళ్ళి సెడగొట్టకండా- "పురేయ్! మనకు బూములావురా, దురమారగంగా లోకుల బూముల్లో కాలెడితే, యే తలకుమాసినోడూ సూత్తా వూరుకోడ్రా" అని యూళ్ళకి గట్టిగా సెప్పు- ఇయ్యాల నేను మంచోడ్ని గనక సరిపోయింది- అదే యింకోడి బూమైయుంటే యేమైయుండేదంటావ్?

రాజ-వచ: యేమిటేమిటి ఆ మాట చెప్పరేం? మీ భూములా వీళ్ళాక్రమించింది? నిజంగా మీరు గాబట్టి సరిపోయింది- లేకపోతే మీరన్నట్లు యెంత యిద్దై యుండేదో.

పాట (ఆటతాళం)

ముందు వెనకలు గానకా - పొలమందు దిగి
దున్నేదరు చట్టము చూడరే - పొలమూ వీడరే ॥ముందు॥

సొంత భూమని తెలిసి కూడా - పంతమున మీరేల పోతిరి
మానరే చిక్కులు గానరే ॥ముందు॥

పాలకులు దయ సూపినాదే పరమభాగ్యము
మీకు మాకని యెంచరే సులువాలించరే ॥ముందు॥

ప్రెసి-వచ: సివరగా యిదీ యినండ్రా.

పాట (ఆటతాళం)

మా బూములను వీడి పోపొండీ మీకు
మరియాద దక్కదిక తరలండీ

మీ హద్దులను మీరు మీరినా మీకు
కటకటాల్ తప్పవని తెలియండీ

యేంది అట్టా సూత్తరేందిరా మీకు
సెంద్దాలు వొగిసెయ్య మంటారా

గట్టూ-పుట్టా లిడిసి పోతారా మీరు
మక్కెలిరిగిందాక వుంటారా....

వచనం: లేబరంటే కాత్తబిమానం వున్నోన్ని గనక. యేమి సెయ్యాలేక మిమ్మల్ని యిడిసి పెడతన్న- యెప్పుడూ యిసుమంటియి తలపెట్టుకోబాకండి- సెడిపోతారు, (లోనికి పోబోతాడు)

రైతులలో ఒకరు-వచ: బాబూ! మూడ్నెల్లపాటు మీ బీడంతా గడ్డలిరిసి బాగుసేసినాం. యెద్దూ, మేమూ కష్టపడి దున్నినం, ఆ శాకిరి కూలన్నా యిప్పిచ్చండి.

ప్రెసి-వచ: యింటన్నవా కమ్మినిట్టూ?

రాజ-వచ: వరేయ్ అబ్బుర్రాం! గడ్డీ గాదంతో పది కాలాలపాటు పశువులకు పని కొచ్చే మీరాయన బీడు భూముల్ని సెడగొట్టిరా, మీకే సెబ్బరా కలక్కుండా పోతున్నందుకు సంతోషించండి- వెళ్ళిరండి.

రైతుకూలీలు: (ఒకరి మొకాలొకరు చూసుకుంటూ పోతారు)

ప్రెసిడెంటు: (నవ్వుతుంటాడు)

రాజ-వచ: అట్లా నవ్వకండి.

ప్రెసి-వచ: (నవ్వుతూనే) యేమంట?

రాజ-వచ: మీతో మాకున్న సంబంధ సూత్రం ఐక్యతా- పోరాటం. మేమూ వాళ్ళతో గలిసి రెండో పదాన్ని చేపట్టుంటే మీరిట్లా నవ్వి వుండేవారా?

ప్రెసి-వచ: ఆగండాగండి- యేందేందీ- ఐక్కె....త్తా, పో....రాఠం. వోర్నీ యమ్మ బలేగ్గనిపెట్టినరే. ఒహటి కాళ్ళట్టుకోటం, రెండు కలబట్టం- యెట్టా కుదురుద్దీ? అహ! యెట్టాకుదుర్దీ అంట- కాళ్ళట్టుకోని కలబడ్తరా? లేక కలబడి కాళ్ళట్టుకుంటరా? సెప్పండీ? అయినా మీరడిగింది కాదన్నపుడు గద రొండోపదం- అందుకే వూరకే రారు మానుబావులంటారు. అస్సలీ డొంక తిరుగుడంతా యెందుగ్గానీ, మీరెందుకొచ్చినట్టో సెపితే పోలా.

రాజ-వచ: యేముందండీ! పిల్లలు రష్యాలో చదువుకున్నారా! వాళ్ళ ఖర్చుల కేమయినా....

ప్రెసి-వచ: వోర్నీయమ్మ అందుగ్గదుటయ్యా మిమ్మల్ని కమీసన్ల కమ్మినిట్టులందీ. సరే- తప్పుద్దా. పైసా కర్సు లేకండా బీడంతా దున్నిపిచ్చి దక్కిచ్చినవు మరి. రా- పోదాం. (అట్టగే నిలబట్టం చూసి) అరె! నీ యిల్లు బంగారంగానూ యిత్తనూ అంటన్నగా.... లోకిరా.... (చేతులుపట్టుకోని) రావయ్యా!

(యిద్దరూ నవ్వుకుంటూ లోనికి పోతారు)

2వ భాగం

(లైట్సారిపోయి వెలుగుతై- గాంధీ ఫోటో వద్ద జయప్రకాశ్‌నారాయణది వుంటుంది.)

సంధి: అంత కొన్నాళ్ళకు పార్టీలు మార్చీ, మార్చీ ప్రజానాయకుండైన మాజీ యిందూరు గ్రామ ప్రెసిడెంటు తమ పార్టీ ప్రతిష్టను తెల్పుతూ వేంచేయు విధంబెట్టిదనినా....

ప్రెసి-పాట (ఆదితాళం)

కనుడీ పెజానోమ్యమ్మెట్టిదో యినుడీ
మా పెత్తనమందో ॥కనుడీ॥
నిరంకుసెత్తం నిలువుగ కూల్సి
సొతంత్రి పదకము సాటి సెప్పితిమి ॥కనుడీ॥

సమ్మెల మీన తుపాకు లెత్తితేం
పేచ్చను బరీగ పెరగనిచ్చితిమి
పెద్దలు సిన్నల అనిసేత్తుంటేం
సమానెత్తమును సాదిత్తున్నాం ॥కనుడీ॥

వచనం: నమసకారం గ్యాంధీ మహాత్మా ! అర్నీయమ్మ- పాత పటం తీసేసినా పాత పేర్టీ అలవాట్లు వోసంటన్నయ్యే దీన్తస్సాదియ్యా- నారాయనసోమీ యేమను కోకండేం ? మీరట్టనుకోర్లే! అనుకుంటే- యే కాలానికే నినాదం యివ్వాల్నో యిచ్చి యెవుర్ని యెట్టా నడిపిచ్చాలో నడిపిచ్చి, మమ్మల్నందర్నీ ఒక తాటి నిలుసోబెట్టి కురిసీలు మాకోసం యిడిసి పెట్టవ్. అందుకనే....

కందార్థము : వొందనము లోక నాయక
వొందనమిదె నీకు నేడు వొందనమయ్యా
వొందనము లివ్వె పేర్టివి
వొందొందల వొందనాలు పదవులు నిలపన్
ముండూకాలం పదిలంగుండన్

మిత్రిం : యెన్నొ యెన్నో వుద్దెమాలను
యెన్నిటినొ మా కొరకు నడిపీ
అన్నిటిని మా యెనక దిప్పి
అందలము లెక్కిచ్చినావూ
పదవులూ నిలపన్- ముందూకాలం పదిలంగుండన్

వచనం: నిజం సెప్పొద్దూ! మీమీనన్నా, గ్యాందీగోరి మీదనన్నా నాకు నా బూముల యిత్తిర్నమంత బకితీ, బెమా. అర్నీయమ్మ- బూములంటే గేపకానికొచ్చిందీ; యేందీ నారాయన పెబూ! తమురేందో యీమద్దెన బూదానపుద్దెపం పేరంబిత్తా మన్నరంటగా? ఆనాడు ఆ గజేంద్రుని రచ్చిచ్చటానికి ఆ నారాయనమూర్తి సెక్రం యిడిసినట్టుగా- యీ బూమిందురుడి కోసం బూదాన సెక్రిం గనక మీరిప్పు డిడిశారా, అబ్బో! యింకేముంది- మా వూళ్ళోనూ, సుట్టుపక్కలా హొలాలాక్రిమిత్తామని ఎగబడతన్న యెర్రి నాకొడుకులంతా తోకూపుకుంటా మీసుట్టే సుట్టకసుట్టక తిరగతారు- అపుడు మీరుంటారూ, మీరు కాదుగూడదూ అంటే తుంగపాస మొలవని నా సవిటి పర్రింతా మీ ముందుంటదీ.

యేమంటారు? ముందా వుద్దెమమేదో తొరగా కదిలిచ్చండీ- మీ మేలు యీ జనమలో కాదు, వొచ్చే జనమలంతా కూడా మర్సిపోను. (నమస్కరించి కుర్చీలో కూర్చుంటాడు.)

సంధి: ఇట్లాసీనుండయిన పరిజానాయకునికి రైతుకూలీలు పరివేశించి తమ భూ సమస్యను విన్నవించుకొను విధంబెట్టిదనినా.

(సింగన్న, అబ్రహాం, యాకోబు పరివేశిస్తారు)

రైతుకూలీలు-పాట (ఆటతాళం)

ఇనుడీ మీరు మా యిన్నపమో బాబూ
బూమి దున్నాతంటే పోలీసులొచ్చే ॥ఇనుడీ॥

పొందీ పొందని మమ్మ గద్దిచ్చి నెట్టారు
పలుపూలిప్పి దున్నల తోలీనారూ ॥ఇనుడీ॥

కందార్థము: ఇతరుల బూముల్లో మా
బతుకులు నాగ్లేసి పంటపండిచ్చామూ
మెతుకేమీ నోచుకోకా
బతికితిమిన్నాళ్ళు మేము బాదాలు మింగీ
సితికీ పోతూ సింతాల కోర్సీ

మిత్రం: రైతుసేమం సూత్తమంటె
రైతులం మిము గెలిపిత్తిమి

రైతులం మేం వేడుతున్నాం
దయతో నిచ్చుడి బూమి మాకు
బాదాలు బాపా- మాసేమాము గురితిచ్చీ బాగా....

వచనం: ఎపుడు మీ మాట మీనే నడుత్తున్నం గద. తమురొక్కటూలి పోలీసుల్తో సెపితే మెల్తారు- ఇపుడు మేం దున్నతన్న ఆ రొండెకరాల బంజరన్నా తలోకరెకరం వత్తది బాబూ!

ప్రె-నా-వచ: (లేస్తూ) అర్నీయమ్మ మీరంటన్నది బంజరయినా మన పక్కూరి బొల్లాపల్లి జమీందారు సెక్కర పేకఉేరు కిందికి పోద్దది.

రైతుకూలీలు-వచ: ఆరికి మూడ్నాలు గేలెకరాల్దా తుందిగా బాబూ!

ప్రె-నా-వచ: అవును, నిజం చెప్పుకోవాలంటే అది మీకు రాదురా- జమీందారుగోరి కెన్ని యేల యెకరాలున్నా పరిశ్రమల కిందున్న బూమి తాకరాదని అమ్మ పెబుత్తం నిసేదిచ్చింది మరి. అట్టాగే పరిస్రిమలు పెంసాలన్న వుద్దేసంతో మేమూ ఆటి జోలికెల్లదలుసుకోలేదు.

రైతుకూలీలు-వచ: బాబుగోరూ!

ప్రె-నా-వచ: అర్నీయమ్మ అది నానోటిమీదగా యెందుగ్గానీ, అదుగో మా సోవాస గాడూ, మీ ఎర్ర కమ్మినిట్టూ సుందరన్న సీటుల మెట్టులెక్కిన సంబరంతో వుక్కిరిబిక్కిరవతా వత్తన్నాడూ- అర్నడగండి. (కూర్చుంటాడు.)

(సుందరన్న ప్రవేశము)

పాట (అటతాళం)

కామ్రేడూ సుందరన్న సూటిగవొచ్చేనే నేస్తులారా
వర్గపోరూ లెంతా జేసూ - పదవు లొచ్చిన చాలు నేస్తులారా ॥కా॥
మరియాదా కామ్రేడూ - మర్యాద గొచ్చే నేస్తులారా
సమత రాజ్యంకేమి రాష్ట్రి మేలిన చాలూ నేస్తులారా ॥కా॥

సుంద-వచ: (ప్రె-నాయకునితో) నమస్కారమండీ.

ప్రె-నా-వచ: మస్కారం- రండి.

రైతుకూలీలు-వచ: దండాలు బాబుగోరూ!

సుంద-వచ: యేంటీ యిలా వచ్చారూ?

ప్రె-నా-వచ: యేంలేదు, పాపం యీళ్ళు బొల్లాపల్లి జమీందారు గోరి బంజరు భూముందిసూడ్లా (సుందరన్న యెరగనని తలూపుతాడు) అర్నీయమ్మ. అద్దెల వడూ నీకూ. మనూరి ముత్తేలమ్మ కుంటుందిసూడూ, దానికి సక్కాగా పడమటే వున్న నల్పదరంసెక్క- దాన్నీళ్ళు దున్నతంటే ఎర్రబుట్టలోల్లడ్డ మొచ్చారంటా, అల్లైనక్కి యెల్లేట్టు సేయమని సెప్పటానికొచ్చారు నాకు.

సుంద-వచ: మీరేమన్నారూ?

ప్ర-నా-వచ: యేమంటానూ, నావొల్లగాదన్నాను.

సుంద-వచ: ఎంతన్యాయం? యిదేనా మీరుచూస్తానన్న రైతుసంక్షేమం?

ప్ర-నా: వోర్నీయమ్మ రైతులమీన తెగపేమొలకబోత్తన్నారే! అందుకేగామాల....

పాట (అటతాళం)

భూముల కోసరమూ రయితులూ పుద్దెమిచ్చినపుడూ
సుట్టూ ముట్టుడని సైన్నెముతోలి పట్టిసంపలేదా వారల
నొంచివేయలేదా ॥భూ॥

వచనం: మొన్న మీపెత్తనంలోనేగా నగజలూర్లో యింతాసేసింది- అపుడేమర్సిపోయారా

సుంద-వచ: ఆహా! అట్టాగా?

పాట (అటతాళం)

మేమటు అణిచేస్తే మీరెంతక్కువ తిన్నారా? మీరటూ
పూరక వున్నారా?
సమ్మెజేసినా కష్టజీవులను హింసపెట్టలేదా
వారల కాల్చిచంపలేదా?

వచనం: నిన్ననేకదండీ మీరు పరిశ్రమలభివృద్ధి పేరుతో యీదారుణం చేసిందీ?

ప్ర-నా-వచ: అర్నీయమ్మ మీగుమాత్తరం సేత్తందేంటీ? సమ్మెలూ, గోరావోలూ సయిచ్చమని కారిమికుల అక్కులని కాలరాయలా.

సుంద-వచ: మమ్మల్నే యెద్దేవా చేస్తున్నారా? యిట్టగయితే మావిమర్శనా పూర్వక మద్దత్తు నుపసంహరించుకుంటాం.

ప్ర-నా-వచ: అవునుమరి. శాత్రం పూరకేసెప్పేరా. వోడెక్కేంత దాకేరా వోడ మల్లయ్యా, దిగింతరవాత బోడిమల్లయ్యేఅని. ఎలకసనులు అయిపోయినాయిగా. యేమన్నా మాట్లాడతారు.

సుంద-వచ: అబ్బబ్బ! మాటికి మాటమాట్లాడటం యిద్దరికీ మంచిదికాదు. యిక మీరూరుకోండీ. (రైతుకూలీల్తో) యేమోయ్! చట్టానికీ, న్యాయ సూత్రాలకీ లోబడి మీరేపనిచేసినా మిమ్మల్ని పేంముందుండి నడుపుతాం.

ప్ర-నా-వచ: లేకంటే, వెనకనుచ్చి తరుముతాం. నిజం సెప్పుకోవాలంటే యిదీ నిజం. తెల్సిందా?

సుంద-వచ: విన్నారటోయ్, యింకెళ్ళండి.

ప్ర-నా-వచ: (లోనికెల్తూ) ఆర్నీయమ్మ అశ్శెల్లారేవయ్యా! మీరు లోనికిరండి. కాత్త టిపినీసేసి పోదురుగాని.

సుంద-వచ: (నవ్వుతూ) సీట్లపొత్తేనుకున్నాం. దాన్ని ప్లేట్లపొత్తుదాక లాగారన్న మాట. పదండి. తప్పేదేముందీ?

(ప్ర-నాయకుడూ, సుందరన్నా లోనికెల్తారు.)

సింగ-వచ: ఇప్పటిదాకా మీరు మనోల్లనుకుంటున్న ఎర్రకబుర్ల మొనగాళ్ళ యెట్టా యీల్లసేతుల్లో యిసిని కర్రలయినారో, సూసినారుగా. ఒహరమ్మ పేర్టీ యిసిని కర్రయితే యింకోరవ్వ పేర్టీ యిసినికర్ర. ఇకఅమ్మ పెబుత్తం భూసంసకరణల పేర్తో మనకు పుర్రసెయ్యి సూపిత్తే, రయితులకోసమే గద్దెక్కుతున్నామన్న యీమారాజులు యెక్కినాక, మనంబెతిమాలుకున్నా, మొహాలుతిప్పేసి మూతి రిశారు. పెద్దపెద్దోల్లకాడి వందల వేలెకరాలట్టగేవుంటమూ మనంమాత్తరం ఆల్ల నేలలు సెమటల్తో తడిపి- దాన్నెం పండిచ్చి ఆల్లగరిసెల్నింపటం, యిదేగదరా ఆల్లూ, ఆల్ల తాతాలూ, గవరమెంటులూ సెపతన్న సట్టం, నాయం సెప్పండి.

అబ్బురాం-వచ: అవును, అంతేగా.

యాకోబు-వచ: సింగన్నా! సిన్న పడిసెక్కయినా పూరకే రాదని నువ్వు సెపతంటే యిసుంటి కబుర్లతోనే పట్నంలో మిల్లు పని సెడగొట్టుకొచ్చిన రనుకున్నంగాని అదెంత సచ్చెమో, యియ్యాల తెలుసుకున్నాం.

సింగన్న-వచ: దాన్లో యేముందిలే యాకోబూ, బూమి కోసమే కాదు మన రాజ్జెం కోసమైనా మనం పోరాటం సేయక తప్పదనీ, మీరూ అనబవందోరా అరదం సేసుకున్నారు- కాని యిది సాలదు- మన వూళ్ళోని రైతు కూలీలకు మన అనబవాలుసెప్పి, సంగంగా కూడగట్టాల. పోదాం పదండి.

3వ భాగం

(లైట్సారి వెలుగుతై– ప్రదేశం భూమి)

సంధి: ఇట్లా గ్రామ రైతు కూలీలు సంగంగా యేర్పడి, తమ్ముల నెత్తేసిన భూము లాక్రమించు విధంబెట్టిదనినా....

(రైతుకూలీలు లింగన్నా, అబ్బురాం, యాకోబు పలుగుల్తో, పారల్తో ప్రవేశిస్తారు)

రైతుకూలీలు–వచ: 'రైతుకూలీ సంగం వర్ధిల్లాలి'
'దున్నేటోడిదే బూమి'–

పాట (అటతాళం)

దున్నెటోడిదె బూమి – దున్నంగ వచ్చాము
రాంట్రా పోదాము సేలోకి – కలసి రాంట్రా పోదాము సేలోకి
రాంట్రా పోదాము సేలోకి – రైతు కూలీలమూ కల్సి సేలోకి ॥దు॥
ఓ.....ఓ.....ఓ..... బూమి త్తనన్నారు – బూమాశ సూపారు
బూమి మాటడిగేక – బూకరించేశారు వోరన్నా
మనల గెంటేశారు వోరన్నా
మనల తరిమేశారు వోరన్నా
కట్టుగా పోరితే వోరన్నా
గెడ్డ మనికె దక్కుతాది రైతన్నా.... వోయ్ కూలన్నా–

సింగన్న–వచ: (ఎడమ వైపు వింగులోకి చూస్తూ) ఓ.....య్ నాగన్నన్నా ఆయేపునుంచి తిన్నగా అరకట్రాలానీండి– యాకోబూ! అబ్బూరాం! ముందా పిచ్చి సెట్టూ కంపా కొట్టండి.

దావీదు–వచ: (వస్తూ) వోట్రా ఆడు తల్లు పగల్తయ్– ఆగండేహ్. (కర్రెత్తి యాకోబు పైకి పోతుంటాడు)

యాకోబు–వచ: (తప్పుతున్నవాడాగి పలుగెత్తి) దారా, మేమూ లెడీగనే వున్నం.

అబ్బురాం–వచ: (వేగంగా వస్తూ) కక్కాయ్] ఆగు.

దావీదు–వచ: (కర్ర దించుతూ) యేంట్రా నువ్వీడుండవూ.

అబ్బురాం–వచ: వూల్లో వాళ్ళం రైతుకూలీ సంగంగా యేర్పడి యీ బూమి దున్ను కుంటున్నం.

దావీదు-వచ: యేందేందీ ! యిది మా ఆసామి సబుకుతోట కిందిదంటగా ?

యాకోబు-వచ: యెవుడి కిందిదీ కాదు- దున్నే కట్టజీవుల్ది.

సింగన్న-వచ: దావీదా ! నువ్వూ మాలో ఒహడివే. మా కడ్డం వత్తావా ?

దావీదు-వచ: నేనొచ్చే దేందుండే, ఆరే నన్నంపితే అరుగో ఆరే వత్తన్నారు- షేమారితో వున్నట్టే వుంటంగాని మీరు గట్టిగా నిలబడండి.

పత్రి-నా (ప్రవేశిస్తూ) పాట (అటతాళం)

యెవుడురా నా పొలమూలో దిగినా దెవుడురా వోడూ
కన్నుమిన్నుగానక దున్నెటోడు - సావుగోరీ కాల్దువ్వినవోడూ ॥యె॥

రైతుకూలీలు-పాట (అటతాళం)

మేమేరా పొలమందు దిగినది మేమే సూద్రోరీ
నాగళ్ళుదింపీ దున్నుతునుంది - దేనికైననూ సిద్దపడుందీ ॥మేమే॥
నీదు నోటి మాటలకు దడిసియు - నేలనొదిలి పోయినోల్లమోరీ
వొంగి దండాలుపెట్టినోల్లము - నిన్నవరకు కొలిసినోల్లమోరీ ॥మే॥

పత్రి-నా-వచ: మేం సూత్తావుంటే మీకెన్ని కొమ్ములన్నా వత్తాయిరా. నిజం సెప్పాలంటే యికూరుకోగూడదు- అరె! దావీదా సూత్తావేంరా ? (ఎడమవైపు వింగులోకి చూస్తూ) వురేయ్! రాములూ, యెంకన్నా, సుబ్బన్నా మీరంతా ఆ అరకలిప్పేయండి.

యాకోబు-వచ: (ఎడమవైపు వింగులోకి చూస్తూ) ఓయ్ ; సోములన్నా మీరంతా అరకలకి ముందు నిలవండి- యే యెదవ నాకొడు కద్దొచ్చినా అడ్నక్కడే నేలగరిపిచ్చండి.

దావీదు-వచ: రేయ్ ! (కర్రెత్తుతాడు)

అబ్బురాం: (పలుగుతో దావీదు కర్ర నడ్డుకొని నొక్కుతుంటాడు)

సింగన్న: (ప్రజానాయకుణ్ణి కిందపడేసి ఎడంకాలు పైనేస్తాడు) [స్టిల్ మూమెంట్]

(తెరలో గొంతులు)

1-గొంతు: వోడ్రా కాడికడ్డ మొచ్చేవాడూ ?
2-గొంతు: కొట్టండశ
3-గొంతు: యెయ్యండేహ్

(లోపల కొట్లాడుకుంటున్నట్టు కర్రల శబ్దాలు)

(తెరలో పాట) (జనం వస్తున్న కలకలం)

రండో య్, రండి, రండి, రండీ
రండి, రండి, రండీ
పలుగు పార నాగలి గొడ్డలి
కాడి మేడి యెత్తండో య్
రండో య్, రండి, రండి, రండీ
రండి, రండి, రండీ
దున్నే వానిదే భూమని
జనపదాలు నిదురలేవ
క్రాంతి పతాకం మోస్తూ
కదిలి కదిలి కదిలి రండి
రండో య్, రండి, రండి, రండీ
రండి, రండి, రండీ
రాండో య్....

(లోనుంచి మాటలు)

1_గొంతు: ఆడి పుడుసుల్లొచ్చేసినట్టుందిరా
2_గొంతు: పదండి తొందరగా పోదాం పదండి
3_గొంతు: పదండి పదండి
4_గొంతు: యేసెయ్యండ్రా నా కొడుకుల్ని.... తరమండి_

దావీదు_వచ: బాబూ! అదిగో పూల్లో లేబరంతా వొచ్చేత్తన్నట్టుంది_ ముందు మీరు పదండి_ నేనూ వొచ్చేత్తాను.

ప్రె_నా_వచ: (కిందుండి) ఆర్నీయమ్మ! కొత్త సిన్నంతరం పెద్దంతరం సూడకండా యేంద్రా యీ పనీ? పైగా యెకంకాలా? నన్ను లేవనీయవో య్.

సింగన్న: (కాలుదీస్తాడు)

ప్రె_నా_వచ: (ఒళ్లు దులుపుకొనిపోతూ, వెనక్కి చూసి) అరేయ్! యీడతోనే అయిపోయిందీ? యింక సూత్తారుగా నా పెతాపం, (మీసం మెలేయగానే సింగన్న అడుగు ముందుకేసి కర్ర నేలకేసి కొడ్తాడు_ ప్రెజానాయకుడు పరుగెత్తుతాడు_ దావీదూ, అబ్బురాం, సింగన్నా నవ్వుతారు.)

(లోపలినుంచీ - స్టేజీమీదా నినాదాలు)

'వర్ధిల్లాలీ రైతుకూలీ సంగం - వర్ధిల్లాలి'

'వర్ధిల్లాలి కార్మిక రైతాంగ మైత్రి - వర్ధిల్లాలి'
'దున్నే వాడిదే భూమి.'

యాకోబు: (తలకు నెత్తురు కారుతూ ప్రవేశిస్తాడు)

సింగన్నా, అబ్బురాం: యాకోబూ! (గాబరాగా దగ్గరకెల్తారు)

అబ్బురాం-వచ: (గాయంమీద చెయ్యేస్తూ) ఎంత దెబ్బేసినార్రా నా కొడుకులు.

యాకోబు-వచ: యేందట్టిదవుతారూ? బూమికోసం పేనలికి పేనాలే యిడిసిన మన అన్నలూ, తమ్ముళ్లూ, అక్కల్తో పోలిత్తే యిదేపాటి? గేమాల్లో నూటికెనబయ్యెంతులున్న మన కూలిరైతులూ, పాలేళ్ళూ నిచ్చెమూ పడతన్న కట్టాల ముందిదెంతట్టో సెప్పండి.

సింగన్న-వచ: అందుకనే యాకోబూ! మన నుంచే యిముత్తి పేరంబం కావాల. మన యిముత్తి నిలవాలంటే మన రాజ్జెం రావాల. అట్ట రాటానికి పెదాన మార్గమైన యీ బూ పోరాటం సాగాలి- ఈ దేశంలో కల్లనీరెడతన్న సుత్తెలూ, కొడవళ్ళూ సేతులు సేతులు కలిపి పిడికిళ్ళు బిగిచ్చాల.

యాకోబు-వచ: గేమ గేమానా సగళ్ళు తిరగబడాల.

లోపలి జనం గొంతులు: అవును- రైతుకూలీల శకితెంతో సూపిచ్చాల.

సింగన్న-వచ: (తెరలోకి చూస్తూ) రైతుకూలీ సోదరులారా! మనల్ని నెట్టేయటానికొచ్చినోళ్ళంతా పారిపోయారు- సమయానికే వచ్చి, మీరు మన బలం నిరూపిచ్చారు- కాని యిదింటితో పోలేదూ, పోదు. కనక యెన్ని అడ్డంకులొచ్చినా యిప్పటి మన ఒద్దిక సెడిపోకుండా యిట్టగే అందరం కలిసివుండాల.

యాకోబు-అబ్బురాం-వచ: అవును ఎవురడ్డమొచ్చినా ఏంజరిగినా బూమికోసం మొదలెట్టిన మన పోరాటం యిడవకండా సాగిద్దాం.

దావీదు-వచ: యేదేమయినా, నేనూ మీతోపాటే.

సింగన్న-వచ: అట్టగయితే అంతా యిలాగనండి-

అందరు-పాట: (ఏకతాళం)

రైతు కూలీలంత ఒకటిగా వుందాం
ముందుకేసిన అడుగు ముందుకే యేద్దాం
దున్నెటోనికె బూమి దక్కేట్టు సేద్దాం
అమరు లాశయాలు పంటలెత్తేలాగ
పెజల రాజ్జెం కొరకు పోరుసాగిద్దాం
ఎర్రజెండా కింద గెలిచి పాలిద్దాం.

మావో మందహాసం

["కొల్లాయి గట్టితేనేమి మా గాంధి" లాంటి గేయాలను దేశభక్తికి ఉపకరణంగా వాడుకున్నది మన సాహితీ సంప్రదాయం. అలాగే 1930 ప్రాంతాలలో సజీవ నాయకులను పాత్రలుగా పెట్టి నాటకాలు రాసారు మన రచయితలు.

కాని స్వాతంత్ర్యం లాంటి వస్తువొకటి మన పాలకవర్గానికి చిక్కిన తర్వాత క్రమక్రమంగా మన రచయితలకూ, కవులకూ, విమర్శకులకూ ఇతర దేశీయ నాయకులను చులకనగా చూసే దుష్ట సంప్రదాయం సంక్రమించింది. మావో ఈత మీదా, నవ్వుమీదా, వార్తలు వచ్చిన ఎగతాళిగా మాట్లాడే నాగరీక సంప్రదాయమది. ఇది ఇలా ఉండగా మంత్రులకు అంకితాలు, మంత్రుల చేత సన్మానాలూ.... పరస్పర భూషణలు మరో రకమైన జాతీయ సంప్రదాయం....

ఈ కథ వ్రాసింది చెక్ దేశీయుడు- ఈ కథ వ్రాసేనాటికి స్టాలిన్ సజీవుడు- కమ్యూనిస్టు అంతర్జాతీయత రష్యాలో కూడా సజీవంగా ఉండేది.

ఈ కథ శిల్పరీత్యా ఓ హెన్రీ అంతటివాడు రాయదగ్గ కథ- వస్తురీత్యా కూడా ఇది ఉన్నత ప్రమాణాలను అందుకుంది. మావో పాత్ర చిత్రీకరణ.... సంఘటనలో సహజత్వం.... ముగింపు.... అన్నీ కథకుడికున్న నిశిత పరిశీలనను చెపుతాయి. మావో మౌలికంగా తాత్త్వికుడు, భావుకుడు; తర్వాత ఆచరణలో కాకలుతీరిన మహానాయకుడు. ఆయన రచనా విధానమూ, తాత్త్వికతా, తార్కికతా క్లుప్తంగానూ స్పష్టంగానూ చెప్ప గలిగాడు రచయిత. అలాగే స్టాలిన్‌కూ ప్రపంచ విప్లవ పోరాటాలకూ అవిభాజ్యతను నిరూపించడం దాని లక్ష్యం. అది కొన మెరుపులాగా కనబడుతుంది- కాని అంతర్యంలో ఆ భావన ఈ కథకు చోదితశక్తి అని వార్తతో కథ ప్రారంభించడమే సూచిస్తుంది- సులువుగా, సరళంగా నడిచిపోవడం ఈ కథకున్న ముఖ్యలక్షణం.

సజీవ వ్యక్తులను కథలో పాత్రలుగా చేస్తే.... ఆయా వ్యక్తులను గురించి సమగ్రమైన అధ్యయనం కావాలి- అందుకు ఉదాహరణ ఈ కథ....]

"చైనా నగరాలలో జరిగే ప్రదర్శనలన్నిటిలోనూ మావో సేటుంగ్ మొదలైన చైనా నాయకుల చిత్రాలు కనబడతాయి కాని, స్టాలిన్ చిత్రాలు అరుదు."

(ఆంగ్లో అమెరికన్ పత్రికలలో వార్త)

పెకింగ్‌లో ఉన్న పాశ్చాత్య దేశాల పత్రికా ప్రతినిధులను (జపాన్ విలేఖరులతో సహా) మావో తన ఆఫీసుకు రమ్మని ఆహ్వానించాడు- ఆయన ఆఫీసు పాత చక్రవర్తి ప్రాసాదంలో ఉంది.

ఆయన స్నిగ్ధంగా ఉన్నాడు- విశాలమైన మందహాసం చేస్తున్నాడు- అతిథులకు జాగ్రత్తగా మర్యాదలు చేస్తున్నాడు- వారంతా చిన్న చిన్న కప్పులతో టీ సేవిస్తు

న్నారె- పత్తెక్కించే దాని సౌఖ్యాన్ని కీర్తిస్తున్నారు- అసలు ఆరోజంతా మత్తెక్కించే విధంగానే ఉంది- మంత్రినగరి లాంటి ఆ ప్రాసాద పరివేశం, ప్రాసాదమంతా చిక్కరి బిక్కరిగా ఉన్న గదులగుండా పర్యటన, పెంకుటి కప్పుల మీదుగా కనిపించే దృశ్యం- దేవదారుచెట్ల వనము పీచ్ చెట్ల పుష్పాలు- అన్నిటికంటె అక్కడే వారి మధ్యనే తెల్లకాలరు, నల్లకోటు ధరించి కూర్చున్న మావో ఎక్కువ మత్తు కలిగిస్తున్నాడు- అయితే వారెవరికీ మావో అంటే ఇష్టంలేదు- న్యూయార్క్, లండన్, పారిస్, రోమ్, టోక్యో, హేగ్.... నగరాలలో ఉన్న వారి యజమానులకూ ఇష్టం లేదు- భూగర్భం నుంచి బంగారాన్ని తవ్వుకునే చైనావారు శాశ్వతంగా కోల్పోయారు- కలలాగా విలాసంగా గడిచిపోయే విదేశీయుల బ్రతుకు పొగలాగా మాయమై పోయింది మరి. అందుకనే వారు పంపే వార్తలలో చైనాను అపఖ్యాతిపాలు చేయడానికీ నిందించడానికీ ఉపయోగిస్తారు.

"నేను మిమ్మలిని మీ వార్తలలో చెప్పే విషయాలను గురించి దీర్ఘంగా చర్చించడానికి ఆహ్వానించాను-" అన్నాడు మావో. "ఎకనమిస్టు పత్రిక చెప్పినట్టు 'విగ్రహాల మధ్య యుద్ధం' లాంటి వార్తలను మీ పత్రికలు వేస్తున్నాయి.... సరే- చైనీయ సృజనాత్మక కళ అంటే మీకు ఆసక్తి ఉన్నట్లు కనబడుతోంది- నాకు తెలిసింది కూడ చెప్ప దలచుకున్నాను- చైనా ప్రజా ప్రదర్శనలలోను, సభలలోనూ చైనా రాజకీయ నాయకుల చిత్రాలు కనబడతాయి కానీ, స్టాలిన్ చిత్రాలు అరుదేనని మీ పత్రికలు కచ్చితంగా తేల్చేసాయి. మీ పరిశీలనా సామర్థ్యాన్ని అభినందిస్తున్నాను- మీకు గద్దకున్న చూపు వుంది- అందుకే ఈరోజు మీ పరిశీలనా శక్తిని పరీక్షించడానికి మీకొక అవకాశం కల్పించబడింది."

"ఈ దేశ సంస్కృతి ఎంత ప్రాచీనమైనదో చైనీయ కళ కూడా అంత ప్రాచీనమైనదే- ప్రపంచంలో మిగతా జాతులకంటె మిన్నగా, చైనీయులు కుంచెను ఒక సృజనాత్మక పనిముట్టుగా భావిస్తారని మీ అందరికీ తెలుసనుకుంటాను. 'కుంచెకొనలో ఆత్మ నివసిస్తుంద'ని సంగ్ వంశ కాలం నాటి కళాకారుడు చూషున్ చెప్పాడు- కాని ఎప్పుడో నాలుగవ శతాబ్దంలోనే 'సాంకేతిక నైపుణ్యం మాత్రమే కాక వస్తుసారాన్ని లోతుగా చూడగలగడమే కళకు ప్రాథమిక లక్షణమ'ని కూ-కై-షీ అన్నాడు. చైనీయ చిత్రకారుడు ఎల్లప్పుడూ వాస్తవాన్ని ఓపిగ్గా పరిశీలిస్తూనే వచ్చాడు- వారాల తరబడీ, నెలల తరబడీ, నీటిలోని చేపనూ, పచ్చికబయళ్ళలో మేసే పశువులనూ, జోరీగలనూ, వెదురు తోపులనూ.... పరిశీలించిన తర్వాతనే వాటిని పట్టు వస్త్రంపై చిత్రించడానికి

సాహసించేవాడు- మధ్యాహ్నపు ఎండలో, సంధ్య వెలుగులో, వెన్నెల వర్షంలో, ప్రకృతినీ, మానవాకృతినీ చూసీ....చూసీ.... పరిశీలించేవాడు- ఆ తర్వాతనే అతని పరిశీలనలు మొత్తం బొమ్మలుగా మారేవి- నాలుగవ శతాబ్దం నాటి హిసైవో చెప్పిన ఆరు సూత్రాలలో మొదటిది: 'కళాకారుడు అసామాన్యమైన దానిలో సామాన్యమైన దాన్ని గుర్తించాలి'.... సోషలిస్టు వాస్తవికతా సూత్రాలు ఈ పద్ధతికి ప్రతిధ్వనిలాగా అనిపించడం లేదా ?"

మావో తన కప్పులోంచి వేడివేడి టీ కొద్దిగా చప్పరించి అక్కడున్న జనం వంక చూసారు. వారంతా ఈ 'పాఠం' ఎక్కడికి తీసుకువెళ్తుందో అర్థంకాక అయోమయావస్థలో ఉన్నారు- నిజానికి మావో వారిని కళాతత్త్వాన్ని గురించి చర్చించడానికి పిలిపించలేదు గదా! కాని వారి గృహస్థు (Host) మళ్ళీ ఏదో ఇంకా సంకీర్ణమైన సంక్లిష్టమైన విషయంలోకి దిగిపోయాడు.

"మానవుడు ఒంటరివాడు కాదు- మిగిలిన ప్రజలతోనూ, మొత్తం ప్రపంచంతోనూ అతనికి ఉన్న సంబంధాలను బట్టి అతనిని తెలుసుకోవడం అతని నైజాన్ని గుర్తించడమూ సాధ్యపడుతుంది."

"ఇది కమ్యూనిస్టు ప్రచారం" అని అక్కడున్న వారందరిలో తెలివైనవాడు తనలోతాను గొణుక్కుని మళ్ళీ మావోవైపు చెవి ఒగ్గాడు.

కాని మావో "నేను తొమ్మిది వందల సంవత్సరాల క్రితం చెప్పిన మాటనే ఇంతకు ముందు చెప్పాను" అని ఊరుకున్నాడు.

తర్వాత, తానెక్కడికి ఎందుకు పోతున్నాడో తెలిసిన రాజకీయవేత్తలాగానే కళాకారుడు కూడా తాత్త్వికుడుగా ఉండాల్సిన అవసరాన్ని గూర్చి మావో మాట్లాడారు- ఆ ఉపన్యాసం రాజకీయ విషయాల వద్దకు వచ్చే సరికి శ్రోతల శ్రద్ధాసక్తులు పెరిగాయి. కాని మళ్ళీ మావో కావాలని చేసినట్లుగా మావో కళావిమర్శవైపు తిరిగాడు.

"ముక్డెన్ సమాధులు, చైనా గోడ, పెకింగ్‌లోని ఈ రాజప్రాసాదంలాంటి.... అనేక మహా నిర్మాణాలతోపాటు, మహోన్నతమైన బౌద్ధశిల్పాలు, ఆరామాలతోపాటు ఇవన్నీ కూడా సౌలభ్యానికీ సాహసానికీ అద్భుత సృష్టి అనతగ్గవే- కాని వీటితో పాటు, ఈ సాంస్కృతిక రంగంలో సూక్ష్మాతి సూక్ష్మ చిత్రరంగంలో కూడ చైనా కళాకారులు తమ ప్రతిభా నైపుణ్యాలను ప్రదర్శించారు. మంగోలియన్ అయుధ శిల్పకారులు ఎంతటి పరిపూర్ణతను సాధించారో మీకు తెలుసు. అంతెందుకు రోజూ

ఉపయోగించే కప్పులు, గిన్నెలు, పూల కుండీలు. వాటిపై చైనా చిత్రకారుడు ఎంత నైపుణ్యంగా బొమ్మలు వేస్తాడో మీకు తెలుసు. హాటామన్ వీధి దగ్గర్లో ఉండే గృహాల్లో లోహ వస్తువులపై ఎనామెల్‌తో ఎంత చక్కగా చిత్రిస్తారో మీరెరుగుదురు: సూక్ష్మమైన తీగ రేఖలపై నిపుణులు ఎనామిల్ చుక్కలు పోస్తారు. నమ్మశక్యంకానంత సంకీర్ణంగా సూక్ష్మ మొజాయిక్ చిత్రాలు సృష్టి అవుతాయి. భూతద్దం సాయంతోనే ఈ పని సాధ్యపడుతుంది. ఆ నిపుణులు చిన్న వయసులోనే అంధులవుతారు. కాని వారి కళాతృష్ణ శాశ్వత అంధత్వం వల్ల కలిగే ఘోర పరిస్థితి కంటె కూడ తీవ్రమైనది. పాత చైనాలో ప్రసిద్ధి కెక్కిన జేడ్ రాయిపై చెక్కిన శిల్పాలను గురించి మీరు వినే ఉంటారు: చైనా ప్రజల కళ వారి రోజువారీ జీవితంలాగానే ఓపికతోనూ శ్రమతోనూ కూడుకొని ఉంది. వరిసాగుచేసేవాడు సున్నితమైన పనిచేసే కళాకారుడు కాడా? ఊబిలో పుట్టి గుంటల్లో మునిగిపోయే మొక్కలను జాగ్రత్తగా చూసుకోవడం ఓపికకూ నేర్పుకూ చిహ్నం కాదా?

శ్రోతలందరూ మంత్రముగ్ధులయ్యారు. ఆయనవి కవివాక్కులు. మావో కవి, కళాకారుడు, రాజనీతిజ్ఞుడు. కాని అలా పత్రికల్లో వ్రాయకూడదు. వారంతా నిజం చెప్పడానికి కాదుగా అక్కడున్నది.

వారి అతిథేయి లేచాడు. శ్రోతలు తాము వెళ్ళిపోవడానికి అదొక సంజ్ఞ అనుకున్నారు. ఆయన వాళ్ళ నక్కడి కెందుకు పిలిచాడు? వాళ్ళ కాయన ఏం చెప్పదలిచాడు?

అంతలోనే ఆయన వారిని ఆ రాజప్రాసాదాలలో పర్యటనకు ఆహ్వానించాడు. వారంతకు ముందెప్పుడూ వాటిని చూడలేదు. వారు చకితులై ఆయన వెనకే బయలు దేరారు. విశాలంగా ఉన్నతంగా పడుచువాడిలా నడుస్తున్నాడు మావో. పెరళ్ళలో పచ్చని ఐమూల దారులగుండా ఆయన నడుస్తున్నాడు. పాలరాతి మెట్లు ఎండలో మిల మిలలాడుతున్నాయి. రాజప్రాసాదంలో ప్రవేశించారు. హాలులో ఒక్కటే ఎబొనీ కుర్చీ ఉంది. పచ్చని బంగారు నేసిన తెర బోర్డిఖాన్ సింహాసనాన్ని కప్పుతోంది. పై కప్పునుంచి పట్టుతెరలు వేల్లాడుతున్నాయి. రెండు పెద్ద పూలకుండీలు సింహాసనం ముందు నిటారుగా ఉన్నాయి.

మావో ఆగలేదు. ఆయన త్వరగా నడుస్తున్నాడు.... రెండో రాజప్రాసాదం.... మూడోది.... నాలుగోది.... వాళ్ళు ఐదో ప్రాసాదం ప్రవేశించారు. "మీకు పింగాణీ ప్రదర్శనశాల చూపిస్తాను" అని అన్నాడే గాని మావో ఆగలేదు. తెల్లని మెట్లమీదుగా ఆయనను అనుసరించారు. అక్కడ వెలుగురు నిండిన హాలులోకి వచ్చారు.

"యుద్ధ నేరస్థుడు హిరోహిటో ఈ ప్రదర్శనశాలకు చాల నష్టం కలిగించాడు" అని మావో జపాన్ విలేఖరులవంక చూసాడు– "అయినా మిగిలిన ఈ భాగం కూడా ఆసక్తికరంగానే ఉంటుంది."

మెరుస్తున్న షోకేసుల్లో మిలమిలలాడుతున్న టాటార్ జీనులూ, వజ్రమాలలూ, బంగారు పూలకుండీలు.... చూసారు. అవన్నీ ఒక క్రమపద్ధతిలో పెట్టబడి ఉన్నాయి– ఇంకా ఎనామెల్ వేజ్‌లూ మంగోలియన్ కత్తులూ, ఎర్రరాళ్ళు పొదిగిన బాకులూ, రెండవ శతాబ్దం నాటి చెప్పులూ, నేతలో చిత్రించిన వీరుల, జాలరుల, రైతుల చిత్రాలు, నీలమణులతో తయారైన కొంగలూ, కంచు డ్రాగన్‌లూ, అడవిదున్నలూ.... ఇంకా సీడర్ వేరుపై చెక్కిన శిల్పాలు, గుడ్డలపై అల్లిన పువ్వులూ, మైదానాలూ, నక్షత్రమండలాలు; రోజాలూ, కలువలూ మెరిచిన గాజు కప్పులూ, గిన్నెలూ.... మంగోలియన్, టిబెటన్, టాటార్ వీరుల వక్షఫలకాలూ.... అన్నీ చూసారు.

వారక్కడ నిలిచిపోయే వారే– మావో తన అడుగుల వేగం తగ్గించేసాడు.... "మహాశయులారా చైనా సృజనాత్మక కళపై మీ విజ్ఞానం విస్తృత పడిందని నేను నమ్ముతున్నాను".... కాని అప్పటికే వారు మరో ప్రాసాదంవద్దకు వచ్చేసారు– అక్కడి మెట్లపైగా వారికి బాగా గుర్తున్న ప్రతిభలు కనబడ్డాయి– వారు గమనించారు. "అవన్నీ ఛాంగ్‌కైషేక్ వద్ద స్వాధీన పరుచుకున్న పతాకాలు" అన్నాడు మావో.

వారిని తీసుకువెళ్తున్నది ఆ హాలు లోనికే– అది అప్పుడే రూపుదిద్దుకుంటున్న రేపటి విప్లవ ప్రదర్శనశాల.

"ఈ స్టాలిన్ బొమ్మల్ని చూడండి–" గోడమీద చాల బొమ్మలున్నాయి.... కొన్ని ఫోటోలు, కొన్ని బొగ్గుతో గీసిన చిత్రాలు, కొన్ని తైలవర్ణ చిత్రాలు, నీటిరంగు చిత్రాలు.... ఉన్నాయి. మామూలు కోటుతో ఉన్న స్టాలిన్, మార్షల్ దుస్తులలో ఉన్న స్టాలిన్; అవన్నీ సామాన్య గ్రామీణులూ, శ్రామికులూ చిత్రించినవి– కాని అద్భుత కళారూపాలు. స్టాలిన్ చిత్రంతోపాటు నినాదాలున్న పత్రాలనేకం ఉన్నాయి.

"మీ రిపోర్టుల ప్రకారం.... ఈ చిత్రాలు చైనా ప్రజా ప్రదర్శనలలో కనబడవు...." అని మావో మొదటిసారిగా వారిని పరిశీలించాలని ఆగాడు– వారంతా ఇబ్బందిపడ్డారు– నిశ్శబ్దంగా ఉన్నారు.

"మీ మౌనం నా కర్థం అవుతోంది– మిమ్మల్ని పంపింది నిజం రాయమని కాదు గదా!" అన్నాడు మావో. చటుక్కున వెనక్కి తిరిగి బయటికి నడిచాడు– వారు అనుసరించారు.

వారంతా గోడదగ్గర ఆయుధాలతో ఉన్న రక్షకదళం వద్ద ఆగారు.

ఒక సైనికదళం రక్షక గృహాన్నుంచి వచ్చింది‌_ వారంతా రెండు బారులుతీరి నిలబడి మావోకు అభివాదం చేసారు. మావోను పెద్ద పెద్ద శబ్దాలతో ఆహ్వానించారు. మావో ఒక కుర్ర ఆఫీసర్ వద్దకు వెళ్ళి తన చేయి అందించాడు.

ఇటు తిరిగి "ఇప్పుడు నేను మీకు సూక్ష్మ శిల్పాల్లో అద్భుతమైన దాన్ని చూపిస్తాను" అన్నాడు_ పత్రికల వారితో ఈమాట అంటూంటే మావో మొఖంలోకి వెలుగు వచ్చింది.

"దగ్గరకు రండి.... మా సైనికుల కెదురుగా నిలుచోండి.... ఇంకా దగ్గరగా.... భయపడకండి" అని మందహాసం చేసాడు.

అక్కడున్న ఆఫీసరుతో నెమ్మదిగా ఏదో చెప్పాడు_ ఆఫీసర్ వెనక్కి తిరిగి "మీ ఆయుధాలను చూపండి" అని ఆజ్ఞాపించాడు.

దళంలోని వారంతా నీలిరంగు బాయ్‌నెట్లతోనున్న తుపాకులను భూమికి సమాంతరంగా పట్టుకున్నారు_ సైనిక దళమంతా దాడిచేయడానికి సిద్ధంగాఉన్నట్లు నిలబడింది.

"మహాశయులారా, ఆ బాయ్‌నెట్ ముక్కులను చూడండి_ పర్వాలేదు.... చేత్తో ముట్టుకుని చూడండి" అన్నాడు మావో.

వారంతా ఒకరి తర్వాత ఒకరు వచ్చి ఆ ఉక్కు ముక్కులను పరీక్షించి చూసారు_ తలలూపారు_ భుజాలు ఎగరవేసారు.

"మీకేమీ కనబడలేదా?"

"లేదు."

"ఇవిగో.... నా అద్దాలు ఇస్తాను" అని మావో తనదగ్గరున్న భూతద్దాన్ని తనకు సమీపంగా ఉన్నతనికి ఇచ్చాడు_ అతను ఆ లెన్సుగుండా బాయ్‌నెట్ ముక్కును చూసి ఇబ్బందిగా నవ్వాడు_ అతని ముఖం కందిపోయింది.

"మీకేం కనబడలేదా" మావో అడిగాడు.

"ఉహూః.... లేదు...." పత్రికా విలేఖరికి కొంచెం కోపం కూడా వచ్చింది. వారందరికీ కూడ కోపం వచ్చింది_ వారంతా కలిసి మంచి హుందా అయిన నిరసన పత్రం ఇవ్వాలిసిందే.... కాని వారు నేల చూపులు చూస్తూ ఉండిపోయారు_ మావో కొంచెం ఆసక్తి చూపాడు,

"మహాశయులారా, నాకు చాలా బాధగా ఉంది. మీకు మరికొంచెం నిశితదృష్టి కావాలి- ఈ బాయ్‌నెట్ ముక్కలపై చెక్కిన శిల్పాలున్నాయి" అన్నాడు మావో. పత్రికా విలేఖరులకు ఇంకా మండిపోయింది.

మావో గొంతు పెంచాడు- ఆయన దృఢంగా కఠినంగా మాట్లాడుతున్నాడు. "మా జన సందోహాల తలల మీదుగా స్టాలిన్ చిత్రాన్ని మీరు చూడలేదు- ఈ బొమ్మను కూడా చూడలేదు- చూసే అనుమతీలేదు- దాన్ని ట్రూమన్ నిషేధించాడు- ఈ బాయ్‌నెట్ల కొసలే విప్లవ ప్రతిఘాతకులను చైనా నుంచి తరిమివేసాయి. ఈ బాయ్‌నెట్ల కొసలే మా దేశ సరిహద్దు రేఖలను గీసాయి. ఈ బాయ్‌నెట్ల కొసలే శాంతిని రక్షిస్తున్నాయి. ఈ బాయ్‌నెట్ల ముక్కలపై స్టాలిన్ ఉన్నాడని చెప్పదలుచుకున్నాను."

పత్రికా విలేఖరులు నేల చూపులు చూస్తూ ఉండిపోయారు- పిరికితనమే వారిని గొణక్కుండా కూడా చేసింది. వారు త్వరత్వరగా వెళ్ళిపోయేవారే- కాని మావో ఇంకా మాట్లాడుతున్నాడు.

"మీరు కోరితే మొత్తంగా కాని, గుంపులు గుంపులుగా మీరంతా చైనా అంతా తిరిగే ఏర్పాటు చేస్తాను- నాల్గు దిక్కులా వెళ్ళండి- మా ఇళ్ళల్లోకి, పశువుల కొట్టాల్లోకి, ఫ్యాక్టరీల్లోకి.... ప్రతి చోటికీ వెళ్ళండి- ప్రతి హృదయంలోకీ చూడండి- ప్రతి గోడమీదా స్టాలిన్ బొమ్మ ఉంది- ప్రతి నాగలిమీదా, నేత మగ్గంపైనా, లేత్ పైనా.... స్టాలిన్ ఉన్నాడు- స్టాలిన్ మాలో ఉన్నాడు-" అంటూ తన గుండెవైపు చూపాడు మావో.

ఆయన మహోన్నతంగా, వారందరిపైనా వ్యాపించిన మహావృక్షంలాగా కనబడుతున్నాడు.

సగర్వంగా నిటారుగా నిలబడి అక్కడున్న సైనికులకు ఆయుధాలు దించమని ఆదేశించాడు- అలిసిపోయిన అతిథులు బయటికి వెళ్ళాలిసిన ద్వారాలు తెరవమని ఆదేశించాడు,

వారంతా వెళ్ళారు- మావో తనలో తాను నవ్వుకున్నాడు- ఆ నవ్వు అక్కడి సైనికులకు కూడా అంటుకుంది....

[మూలం: ఒక చెక్ కథ (1950-51)
అనువాదం : రహి]

కృష్ణాబాయిగారి లేఖ చదివిన తర్వాత ఈ లేఖ వ్రాయవలసి వచ్చింది. బొట్టు మొగుడి ప్రాణం కాదు అంటూనే ఆ భావానికి సపోర్టు వ్యక్తం చేశారు ఈ లేఖలో. ఇది పైకి చూస్తే 'రెంటికి సమాన దూరంలో' ఉన్నట్లు కనిపించిన దాని వెనుక వున్న అశాస్త్రీయ భావాల్ని మార్క్సిస్టులైన వారు ఎవరైనా వ్యతిరేకించక తప్పదు. బొట్టు చెరిపి వేయడంలో తన భావాన్ని రచయిత ఎంతో గొప్పగా అందచేసాడని కృష్ణాబాయి గారు మెచ్చుకున్నారు. "రాడికల్" భావాలు కల్గిన వారి దగ్గరి నుండి చాలా "అనుభవం" ఉన్నవారు అందరూ కథలోని ముగింపును మెచ్చుకున్నారట. బొట్టును బొట్టుగా కాక దాని వెనుక నున్న సంస్కృతిని (ఫ్యూడల్) అర్థం చేసుకొమ్మని, దాని ప్రమాదాన్ని గుర్తించమని మాత్రమే నేను వ్రాసిన లేఖలోని సారాంశం. అలాకాక ఆ 'రాడికల్' భావాలవారు, చాలా 'అనుభవం' ఉన్నవారు ఏ ఉద్దేశ్యంతో ఆమోదించారో నాకు తెలియదు కాని, వారు ఇంకా ఆ బంధనాలనుండి బయట పడలేదేమో అని ఇతరులు అర్థం చేసుకోవల్సివస్తుంది.

క్రిష్ణాబాయిగారు రచయిత కొక సలహానిచ్చారు– దానిద్వారా వారు సిద్ధాంతకారునికి (ఇది ఏ ఉద్దేశ్యంతో వాడారో స్పష్టంగాలేదు), జీవితాన్ని కాచివడపోసే కథాకారునికి మధ్యన పెద్ద 'గండి' కొట్టారు– అవి రెండు వేరువేరు అనీ, రచయితకి సైద్ధాంతిక దృక్పథం అవసరం లేదనే ఆలోచన కృష్ణాబాయి గారికి వున్నట్లు ఈ లేఖద్వారా అర్థం అవుతుంది. ఈ అగాథంలోంచి వారు ఎంత త్వరగా బయటపడితే అంత మంచిది.

హైద్రాబాద్ 16–8–78 – పర్వత్

యువ స్వరంలో అపస్వరం !

"మొలీనా" గారి యువ స్వరం చదివాను–

అన్నింటినీ రెండుగా చీల్చినట్లే
మిమ్మల్నీ రెండుగా చీలుస్తాం
ఒక ముక్క ముసలి పీనుగుల మీదికి విసిరేస్తాం
(అట్నుంచి మేం తీసుకున్నదానికి బదులుగా)
మిగిలిన వాళ్ళం........

చాలా అర్థరహితంగావుంది– ఎందుకంటే, "మిమ్మల్నీ రెండుగా చీలుస్తాం" అని గాక "మమ్మల్నీ రెండు ముక్కలుగా చీల్చి (అంటే యువకుల్ని) ఓ ముక్క ముసలి పీనుగుల మీదికి విసిరేస్తాం (యువకుల్లోగల వృద్ధుల్ని) అంటే బాగుండేది– ఇది అచ్చు పొరపాటో, లేక రచయిత పొరపాటో తెలియటంలేదు.

ఏమయినా 'మి' బదులు 'మ' అని వుంటే ఆ గేయం మరింత ఉన్నత విలువల్ని పొందుతుందనేది నా అభిప్రాయం.

23–8–78 – అజ్ఞాత సూరీడు

SRJANA Telugu Monthly Sep. 78 H/WL-10
Regd. No. with Registrar of News Papers 10953/67

కాకతీయ యూనివర్సిటీని పోలీసు ఆక్రమణ నుండి విడిపించాలి

వరంగల్ విరసం డిమాండ్

కాకతీయ విశ్వ విద్యాలయాన్ని నిరవధికంగా మూసివేసి పోలీసులకు స్వాధీనం చేయటం చూస్తే మాకు బాధ, క్రోధమూ కలుగుతున్నవి.

ఏ అవసరమూ లేకుండానే విద్యాలయాన్ని మూసివేసినందుకు బాధ, పరిస్థితిలో శాంతికి ఏ అపాయమూ సంభవించకుండానే ఎవరి చట్ట భద్రతలకు హాని కలగకుండానే విద్యార్థులను బలవంతంగా హాస్టళ్ళ నుండి వెళ్ళగొట్టి భయభ్రాంతుల చేస్తూ పోలీసు గూండాలకు విశ్వవిద్యాలయాన్ని స్వాధీనం చేసినందుకు క్రోధమూ కల్గుతున్నవి.

కాలేజీ ఎన్నికల నిర్వహణ సందర్భంగా అధికారులు చేబట్టిన అసమర్థ పక్షపాత పద్ధతివల్ల జనించిన అర్థరహిత అజ్ఞానయుత అపోహలతో ఒక చిన్న ముఠాకు సాయం చేసే పద్ధతిలో ప్రవర్తిస్తూ పరిస్థితి విషమింపచేసి ఆ రకంగా వరంగల్ విద్యాలయాన్నిలా శాంతికి భంగంకలిగే ఎడక నడుస్తున్నారు. ప్రభుత్వమూ, పోలీసు, యూనివర్సిటీ అధికారులు అపవిత్ర రహస్యకూటమిగా ఏర్పడి తమ చట్టబద్ధ హక్కు అయిన సంఘ ఎన్నికలు జరపమని అడిగే విద్యార్థి జనబాహుళ్యాన్ని భయభ్రాంతులచేసి లొంగదీయాలనిచేసే కుట్రలోనే యిదంతా భాగం. అందుకే యీ చర్యలను మేం గర్హిస్తున్నాం.

వెంటనే యూనివర్సిటీని తెరవాలని, క్యాంపస్‌ను ఆక్రమించిన పోలీస్‌ను ఉపసంహరించాలని వరంగల్ విరసం డిమాండ్ చేస్తున్నది.

డాక్టర్ ఎం వి ఆర్ పై మరొక హత్యకేసు!

డా॥ ఎం. వి. రమణారెడ్డిగారిపై మరి 8 మంది కార్మికులపై మరియొక హత్యా నేరము మోపినారు. ఈ కుట్ర వెనక స్థానిక ఇందిరా కాంగ్రెసు ఎం.ఎల్.ఏ శ్రీ చంద్ర ఓబుళరెడ్డిగారి హస్తమున్నది.

డా॥ గారిని 17వ తారీకునాడు నిర్బంధములోనికి తీసుకున్నారు.

ఇదివరకు 7వ తారీకునాడు లారీ డ్రైవరు కా॥ సుబ్బారెడ్డిని పై ఎంఎల్ఏ గారి కుమారుడు ఇతర గుండాలు హత్య గావించిరి. కానీ ఇంతవరకు కేవలం ముగ్గురు నిందితులు మాత్రమే అరెస్టు చేయబడినారు. ఇంకనూ 12 మంది ముద్దాయిలు పోలీసులకు పట్టుబడలేదు.

హత్యా నేరాల్ని మోపి ప్రభుత్వం కార్మిక నాయకులను నిర్బంధాల పాలుచేసి ప్రజా సంబంధాలను నెరపకుండా చేయుటకు ఈ విధంగా పన్నాగం పన్నుతున్నది.

ప్రొద్దుటూరు
కడప జిల్లా
19-8-78

డి. రామమూర్తి,
సహాయ కార్యదర్శి
పీపుల్స్ యూనియన్ ఫార్ సివిల్ లిబర్టీస్